ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్

: fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 246 పేజీలు: 10+4 వెల: 6.50




## మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

రోగనిరోధక శక్తిపై పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

ఇద్దరు అమెరికన్లు, ఒకరు జపాన్ శాస్త్రవేత్త

2



# మోగిన బీహార్ నగారా

## రెండు దశల్లో ఎన్నికలు

### నవంబర్ 6, 11న పోలింగ్, 14న కౌంటింగ్

### షెడ్యూలు విడుదల చేసిన ఇసి.. 7 రాష్ట్రాల్లో 8 సీట్లకు ఉప ఎన్నిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. రెండు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబర్ 10న తొలి దశ నోటిఫికేషన్ విడుదల కానుండగా, అక్టోబర్ 13న రెండో దశకు నోటిషికేషన్ జారీ కానుంది. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. బీహార్‌తో ఏడు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈ ఉప ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13న నోటిఫికేషన్ జారీ కానుండగా, నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. షెడ్యూల్ విడుదలైనందున తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఈసీ వెల్లడించింది. సోమవారంనాడిక్కడ కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈవో) >>2

## నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

### కొత్త ఓటర్ల నమోదుకు మరో 10 రోజులు

### ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం ఉప ఎన్నికకు నగారా మోగింది. అందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 11న >>2



సోమవారం మీడియాతో ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, సిపి సజ్జనార్ తదితరులు




# బిసి కోటాపై ఊరట

## రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం కోర్టు

### హైకోర్టు స్టే ఇవ్వకుంటే 'సుప్రీం'కు వచ్చేస్తారా? అని ప్రశ్న

### అక్కడే తేల్చుకోవాలని ఆదేశం

### రిజర్వేషన్ల అమలు తథ్యమన్న డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట లభించింది. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలుఅయిన పిటిషన్‌నుఅత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈఅంశం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టులో ఇదే అంశంపై 2 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, ఏడీఎన్ రావు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. అనంతరం పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్‌సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోపై సోమవారం సుప్రీంకోర్టులో, 8నహైకోర్టులో విచారణ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది.స్థానిక సంస్థల ఎన్నికలతొలి దశ నోటిఫికేషన్‌ను ఈనెల 9న జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు జారీ చేసిన జీవోపై సుప్రీంకోర్టులో జరగనున్న విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఈ జీవో చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటు అధికారులను, అటు పార్టీ నేతలను ఆదేశించారు. కాగా, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలు అయిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్వీకరించలేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క >>2



సోమవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌తో భేటీ అయిన ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

# మరో రూ.9 వేలకోట్ల పెట్టుబడులు

### ముందుకొచ్చిన అమెరికా కంపెనీ ఎల్‌లిల్లీ

### ఇక్కడి నుంచే ప్రపంచస్థాయి ఔషధాల తయారీ

### సిఎం రేవంత్‌తో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** తెలంగాణ మరో సారి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ.9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ >>2

## హైదరాబాద్‌లో ఎకరం 177 కోట్లు

### వేలంలో 18 ఎకరాలకు రూ.3135 కోట్లు దక్కిన వైనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 6:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ధరలు కొత్త రికార్డ్ సృష్టించాయి. టిజిఐఐసి నిర్వహించిన వేలంలో రాయదుర్గం నాలెడ్జ్ సిటీ ప్రభుత్వ భూముల వేలానికి ఊహించని స్పందన లభించింది. >>2





సిజెపై దాడికి యత్నించిన లాయర్ రాకేశ్ (ఫైల్)

# సుప్రీం సిజెపై దాడికి యత్నం

### కోర్టు హాలులోనే షూ విసిరిన లాయర్

### అతడిని అదుపులోకి తీసుకొన్న భద్రతా సిబ్బంది

### నన్ను ప్రభావితం చేయలేరు: చీఫ్ జస్టిస్ గవాయ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టులో ఇవాళ సీజేఐ బీఆర్ గవాయ్‌పై ఓ లాయర్ తన షూ విసిరేందుకు ప్రయత్నించారు. సీజేఐ కూర్చున్న డయాస్ వద్దకు ఓ లాయర్ వెళ్లి తన కాలుకున్న షూను తీసి, జడ్జీ మీదకు విసిరే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఓ కేసు వాదనల సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే అక్కడే ఉన్న సెక్యూర్టీ సిబ్బంది వెంటనే కలగజేసుకుని ఆ లాయర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని బయటకు తీసుకెళ్లారు. ఆ లాయర్‌ను కిషోర్ రాకేశ్‌గా గుర్తించారు. కోర్టు రూమ్ నుంచి బయటకు తీసుకెళ్తున్న సమయంలో ఆ లాయర్ సనాతన >>2




# నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

>> ఓటింగ్ నిర్వహించి ..14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిందింది. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వెంటనే పోస్టర్లు, బ్యానర్లను తొలగిస్తామని చెప్పారు. అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదల అవుతుందని తెలిపారు. అలాగే 21వరకు నామినేషన్ల స్వీకరణ, 22న పరిశీలన, ఉపసంహరణకు గడవు అక్టోబర్ 24ఉంటుందని తెలిపారు.

నవంబర్ 11న పోలింగ్ ఉండనుందని..14న కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోకవర్గంలో దాదాపు 4 లక్షల మంది ఓటర్లు ఉన్నారని.. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి ఇంకా పది రోజుల సమయం ఉందని చెప్పారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 139 ప్రాంతాల్లో 407 పోలింగ్ కేంద్రాలున్నట్లు తెలిపారు. కోడ్ ఉల్లంఘిస్తే పార్టీలకు అతీతంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తుది జాబితా ప్రకారం మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉన్నట్లు అందులో పురుషులు -207367 స్త్రీలు -1,91,1590, ఇతరు 25మంది ఉన్నట్లు తెలిపారు. ఓటర్లు తమ పేరును ఓటరు జాబితాలో వెరిఫై చేసుకునేందుకు ఈసిఐ వెబ్‌సైట్, సిఈవో వెబ్‌సైట్, ఈఆర్‌వో కార్యాలయం, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లో సంప్రదించవచ్చుననీ కమిషనర్ తెలిపారు. జులై 1, 2025 నాటికి18 ఏళ్ల నిండిన వారు, అర్హులు ఉండి ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకొని వారు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# బిసి కోటాపై ఊరట

>> మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ జీవోపై కొందరు సుప్రీంకోర్టులో కేసు వేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన కేసును కోర్టు డిస్మిస్ చేసినందుకు సంతోషిస్తున్నామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రజలు కోరుతున్నారని, ప్రతిపక్ష నేతలు ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సర్వే నివేదికను అసెంబ్లీ ముందుంచామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని, శాసనసభలో ఉన్న అన్ని పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు.

# సిజెపై దాడికి యత్నం

>> ధర్మంపై నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. సనాతన్ కా అప్మాన్ నహీ సహింగే సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదని ఆ లాయర్ అన్నారు. సీజేఐ గవాయ్ మాత్రం ఆ ఘటన పట్ల ఎటువంటి అధైర్యానికి లోనుకాలేదు. కోర్టులో ఉన్న లాయర్లను తమ వాదనలు కొనసాగించమని కోరారు. ఇలాంటి వాటి వల్ల ఎవరూ విచలితులు కావొద్దు అని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని సీజేఐ గవాయ్ పేర్కొన్నారు. అయితే కొన్ని రోజుల క్రితం సీజేఐ గవాయ్ ఓ కేసులో చేసిన వ్యాఖ్యల వల్లే ఈ ఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఖజురహోలోని ఏడు అడుగల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన కేసులో సీజేఐ గవాయ్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ కేసును ఆయన డిస్మిస్ చేస్తూ వెళ్లి ఆ దేవుడినే అడుక్కోవాలని కామెంట్ చేశారు. విష్ణువుకు వీరభక్తుడిని అని చెప్పుకుంటున్నావు కాదా, వెళ్లి ఆ దేవుడినే ప్రార్థించుకో, అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఏఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సీజేఐ వ్యాఖ్యానించారు. ఖజురహో కేసులో సీజేఐ గవాయ్ చేసిన వ్యాఖ్యల పట్ల సోషల్ మీడియాలో తీవ్ర దుమారం చెలరేగింది. మతపరమైన భావాలను కించపరిచినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ వివాదానికి ఆయన తనదైన స్టయిల్‌లో తెరించారు. రెండు రోజుల తర్వాత ఓ కేసులో స్పందిస్తూ తానేమీ ఏ మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీజేఐకి అండగా నిలిచారు. సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయన్నారు.

# మీపై దాడి భారతీయులను ఆగ్రహానికి గురిచేసింది

## సిజెఐతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై షూ దాడిని ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. భారత సీజేఐపై దాడికి యత్నించడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన సీజేఐతో మాట్లాడారు. మన సమాజంలో ఇలాంటి అనైతికమైన చర్యలకు తావు లేదని మోడీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌తో మాట్లాడాను. ఈరోజు ఉదయం సుప్రీంకోర్టు ఆవరణలో ఆయనపై జరిగిన దాడి భారతీయులను ఆగ్రహానికి గురి చేసింది.

ఇలాంటి అనైతికమైన ఆమోదయోగ్యంకాని చర్యలకు మన సమాజంలో చోటు లేదు. సీజేఐపై దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని మోడీ తన ట్వీట్‌లో వెల్లడించారు. ఇదిలా ఉంటే సిజెఐపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్‌ను సస్పెండ్‌చేసినట్లు బార్ అసోసియేషన్ వెల్లడించింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న రాకేశ్‌ను పోలీస్ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

## సిజెఐ గవాయ్‌పై దాడి: ఖండించడానికి మాటలు సరిపోవు దేశ చరిత్రలో చీకటి రోజు: సిఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** దేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ ప్రజలను కలచి వేసింది. ఈ ఘటనను పలు పార్టీల నేతలు, ప్రముఖులు ఖండించారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆసక్తికర ట్వీట్ చేశారు. దేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న గౌరవనీయులపై దాడి చేసి భయపెట్టే ఈ నీచమైన ప్రయత్నాన్ని ఖండించడానికి మాటలు సరిపోవు. ఇది మన దేశ చరిత్రలో ఒక చీకటి రోజు... ఇలాంటి పిరికిపంద దాడులతో తాను వెనక్కి తగ్గబోనని ధైర్యంగా ప్రకటించిన మన అజేయమైన భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌తో నేను, ఈ దేశ పౌరులందరూ మద్దతుగా ఉన్నామని స్పష్టం చేశారు.

# మెడిసిన్‌లో ముగ్గురికి నోబెల్

## రోగనిరోధక శక్తిపై పరిశోధనలకు అత్యున్నత పురస్కారం

## ఇద్దరు అమెరికన్లు, ఒకరు జపాన్ శాస్త్రవేత్త

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** వైద్య రంగంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ పురస్కారం లభించింది. రోగనిరోధక వ్యవస్థ (పెరిఫెరల్ ఇమ్యూన్ టోలరెన్స్)పై పరిశోధనలకు గాను మేరీ ఇ.బ్రుంకోవ్, ఫ్రెడ్ రామ్స్ డెల్, షిమోన్ సకాగుచిలు అత్యున్నత అవార్డుకు ఎంపికయ్యారు. వారు చేసిన పరిశోధనలు క్యాన్సర్, ఆటో ఇమ్యూన్ రోగాలకు నూతన చికిత్సా విధానాల అభివృద్ధికి దోహదపడతున్నాయి. నోబెల్‌కు ఎంపికైన వారికి డిప్లొమా, బంగారం పతకంతో సహా 11 మిలియన్ స్వీడిష్ క్రోనార్‌లు (సుమారు రూ.10.38 కోట్లు) అందిస్తారు. ఈ మేరకు నోబెల్ కమిటీ చైర్మన్ ఓల్లీ కాంపె ఒక ప్రకటనలో వెల్లడించారు.

నోబెల్ పురస్కారం అందుకున్న వారిలో ఇద్దరు అమెరికన్లు, ఒక జపాన్ శాస్త్రవేత్త ఉన్నారు. మేరీ ఇ బ్రుంకోవ్ అమెరికాలోని సియాటెల్‌లో ఉన్న ఇన్సిటిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయోలజీలో,ఫ్రెడ్ రామ్స్‌డెల్ శాన్‌ఫ్రాన్సిస్‌కోలో ఉన్న సోనోమా బయోథెరపాటిక్స్‌లో పనిచేస్తున్నారు. షిమోన్ సకాగుచి జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. రోగనిరోధక వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంలో ముగ్గురు పరిశోధకులు కీలక విషయాలను గుర్తించారు. శరీరంలోని అత్యంత శక్తివంతమైన రోగనిరోధక వ్యవస్థను నియంత్రించాల్సి ఉంటుందని, లేదంటే ఆ వ్యవస్థ మన శరీర అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. రోగనిరోధక వ్యవస్థ శరీరాన్ని దెబ్బతీయకుండా ఉండే పెరిఫరల్ ఇమ్యూన్ టాలరెన్స్ గురించి ముగ్గురు శాస్త్రవేత్తలు స్టడీ చేసినట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొన్నది.

రోగనిరోధక వ్యవస్థలో సెక్యూర్టీ గార్డుల్లా పనిచేస్తున్న రెగ్యులేటరీ టీ కణాల గురించి శాస్త్రవేత్తలు ఆవిష్కరణ చేశారు. ఈ టీ కణాలు మన శరీరంపై ఇమ్యూన్ కణాలు దాడి చేయకుండా నివారిస్తాయని గుర్తించారు. టీ కణాల అధ్యయనం వల్ల మన రోగనిరోధక వ్యవస్థ పనితీరు విధానం అర్థమవుతుందని, దీని వల్ల ఆటోఇమ్యూన్ వ్యాధులు ఎందుకు డెవలప్ కావడం లేదన్న విషయం తెలుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## వారం - వర్జ్యం

07-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
○పౌర్ణమి ఉ.9.16, కృ.పాడ్యమి తె.5.54
రేవతి రా.1.26
వర్జ్యం : రా.7.11-8.27
దు.ఉ.8.22-9.10
ఉ.6.30-7.15
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** ఆరోగ్యం, వాహనాల విషయంలో కాస్త మెలుకువలోన వ్యవహరించండి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** మాట పట్టింపులో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు

**సింహం:** సంఘుసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** నూతన పెట్టుబడుల విషయంలో మెలుకువతో వ్యవహరించండి.

**తుల :** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులకు పదోన్నత పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి.

**ధనుస్సు:** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు.

**మకరం:** క్రమశిక్షణను పాటించడం వలన లాభపడుతారు.

**కుంభం:** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు.

**మీనం :** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సముద్రంలో చమురు చిందటం వంటి ప్రమాదకర సమయాల్లో సహాయక కార్యక్రమాలపై సోమవారం తమిళనాడు తీరంలో ఇండియన్ నేవీ నిర్వహించిన రిహార్సల్స్ దృశ్యం

# మోగిన బీహార్ నగారా

>> జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి మీడియాతో మాట్లాడుతూ... బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నట్లు చెప్పారు. 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు ఈసీ పేర్కొంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వివరించారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణ కోసం 4.53 లక్షల మందిని వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)తో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగిందని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సమాధానమిచ్చారు.

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు 38, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు 2 ఉన్నాయి. బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. 1,725 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లున్నారు. 14 లక్షల మంది తొలి సారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వందేళ్లు పైబడి వయస్సున్న ఓటర్లు 14 వేల మందికి పైగా ఉన్నారని ఈసీ పేర్కొంది. తొలి దశలో 121 స్థానాలకు, రెండో దశలో 122 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరుగనుంది. బీహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతోనే నవంబర్ 16కు ప్రక్రియ ముగించేలా కార్యాచరణ రూపొందించినట్లు ఈసీ ప్రకటించింది.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 11న బీహార్ అసెంబ్లీ పోలింగ్ రెండవ దశతో పాటు ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ జ్ఞానేష్ కుమార్ తెలిపారు. నవంబర్ 14న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు ఉప ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, తెలంగాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల్లో ఖాళీ అయిన 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు బై ఎలక్షన్స్ జరుగనున్నాయి.మరోవైపు రాజస్థాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పడటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, దీంతో ఈ 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల కోసం ఈసీ షెడ్యూల్ జారీ చేసింది.




సోమవారం న్యూఢిల్లీలో 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' నివేదికను విడుదల చేస్తున్న నీతి ఆయోగ్ సిఇఒ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం

# మరో రూ.9 వేలకోట్ల పెట్టుబడులు

>> ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎల్ లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎల్ లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎల్ లిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్‌వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎల్ లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్ లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. హైదరాబాద్ గ్లోబల్ సిటీ అని. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్ధతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మ హబ్‌గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1965లో ఇందిరా గాంధీ హైదరాబాద్‌కు ఐడీపీఎల్ తీసుకురావడంతో ఫార్మా హబ్‌గా మారిందన్నారు. హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. ఆనంద్ మహీంద్రా నేతృత్వంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫార్మ్‌కు సంబంధించిన అనేక మంది ప్రముఖులు స్కిల్ యూనివర్సిటీ బోర్డు మెంబర్స్‌గా ఉన్నారని సిఎం రేవంత్ పేర్కొన్నారు. మంత్రి శ్రీదర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఎల్ లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎల్ లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.

# సిజెఐ గవాయ్‌పై దాడిని ఖండించిన డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది దాడిని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రత, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన ఒక హేయమైన దాడి అని పేర్కొన్నారు. పౌర సమాజంలో, న్యాయ వర్గాలలో విస్తృత ఆందోళన కలిగించిందన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా కాకుండా, భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ గౌరవం, ప్రజాస్వామ్య, లౌకిక వాదం ఆశయాలపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాది పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ న్యాయవాది ఆలోచనలు ఎంత ప్రమాదకరమో ఈ సంఘటన స్పష్టం చేస్తుందన్నారు. చీఫ్ జస్టిస్ గవాయ్ రాజ్యాంగ పరిరక్షకుడు, అత్యుత్తమ విలువలు కలిగిన వ్యక్తి. వారికి దేశం యావత్తు సంఘీభావం తెలపాలి, ఐక్యంగా నిలబడాల్సిన సందర్భం ఇది అని పేర్కొన్నారు.

# విదేశాలకు వెళ్లిన చైర్మన్, స్పీకర్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశ రాజధాని బ్రిడ్జిటౌన్ లో జరిగే 68 వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా.వి. నరసింహా చార్యులు, అధికారులు బయలుదేరి వెళ్లారు. ఈనెల 11వ తేదీ వరకు జరిగే పిఏసి కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అనంతరం స్టడీ టూర్లో భాగంగా యునైటెడ్ కింగ్ డమ్, ఫ్రాన్స్, ఇటలి దేశాలలో తెలంగాణ శాసనమండలి బృందం పర్యటించనుంది.

# హైదరాబాద్‌లో ఎకరం 177 కోట్లు

>> రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికి రికార్డు నెలకొల్పింది. దేశంలోనే అత్యధిక ధర పలికింది. తద్వారా తన రికార్డ్‌ను తానే హైదరాబాద్ బ్రేక్ చేసింది. ఈ ప్రాంతంలో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని టీజీఐఐసీ వేలం వేసింది. దీంట్లో పాల్గొన్న ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.67 ఎకరాల భూమిని వేలంలో సొంతం చేసుకుంది. ఒక్క ఎకరానికి రూ.177 కోట్ల చొప్పున మొత్తం రూ.1358 కోట్లకు చేజిక్కించుకుంది. మరో 11 ఎకరాలకు వేలం ప్రక్రియ వేరుగా కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసి) సోమవారం నిర్వహించిన రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని భూముల వేలం పాటలో ఎకరా భూమికి ఏకంగా రూ. 177 కోట్లు చెల్లించి ఎంఎస్ఎన్ రియాల్టీ ఈ భూములను సొంతం చేసుకుంది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ (సర్వే నంబరు 83/1)లోని మొత్తం 18.67 ఎకరాల్లో భాగంగా ఉన్న 7.67 ఎకరాలను ప్రభుత్వం టీఎస్ఐఐసీ ద్వారా వేలం వేసింది. రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, టీజీఐఐసీ ఈ వేలం కోసం ఎకరాకు రూ. 101 కోట్లుగా ప్రారంభ ధరను నిర్ణయించింది. ఈ వేలంలో ఎంఎస్ఎన్, హెటెరో, మేఘా, బ్రిగేడ్ గ్రూప్, సత్య, ప్రెస్టీజ్ వంటి ప్రముఖ రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు హోరా హోరీగా పోటీ పడ్డాయి. ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ ఈ వేలంలో ఒక్క ఎకరా భూమిని రూ. 177 కోట్లకు దక్కించుకోవడం ద్వారా రికార్డు సృష్టించింది. ఈ ధరతో మొత్తం 7.67 ఎకరాలను ఎంఎస్ఎన్ రియాల్టీ సంస్థ ఏకంగా రూ.1,357 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకుంది.

ఈ రికార్డు స్థాయి ధర, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ బలాన్ని, ముఖ్యంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాలకు సమీపంలో ఉన్న రాయదుర్గం ఏరియా ప్రాముఖ్యతను మరోసారి చాటి చెప్పింది. రాయదుర్గంలో భూముల ధరలు రికార్డ్ బ్రేక్ చేశాయి. మొత్తం 18 ఎకరాల ప్రభుత్వ భూమికి టీజీఐఐసీ వేలం నిర్వహించింది. 7.67 ఎకరాలను ఒక భాగంగా, 11 ఎకరాలను మరో భాగంగా ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించింది. 11 ఎకరాలను రూ.1556.5 కోట్లకు ప్రెస్టేజ్ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుంది. ఎకరానికి 141.5 కోట్లు చొప్పున ఆ రియల్ ఎస్టేట్ కంపెనీ వేలం పాడింది. కాగా ఈ 18 ఎకరాలకు వేలం ధరలతో పాటు రిజిస్ట్రేషన్ ఫీజు,స్టాంప్ డ్యూటీలతో ప్రభుత్వానికి మొత్తం రూ.3135 కోట్ల ఆదాయం వచ్చింది. 2017లో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ. 42.59 కోట్లు పలికింది. ఎనిమిదేళ్లలోనే వ్యవధిలోనే రాయదుర్గంలో ఎకరం ధర రూ. 177 కోట్లు పలికింది. 2022లో నియోపోలీస్, కోకాపేట్‌లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వేలం వేసిన భూమికి రూ.100 కోట్ల 75లక్షల ధర లభించింది. కోకాపేట, నియోపోలీస్ భూములతో పోలిస్తే ఇప్పుడు రాయదుర్గంలో 75 శాతం ధర ఎక్కువగా ఉంది. 7.67 ఎకరాలు, 11 ఎకరాలను రెండు భాగాలుగా చేసి టీజీఐఐసీ వేలం వేస్తోంది. తాజా వేలంలో రికార్డ్ బ్రేక్ అయ్యింది. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం డీలా పడిపోతుందని, భూముల విలువ క్రమంగా తగ్గిపోతుందని ప్రచారం జరుగుతోన్న వేళ సిటీలో ఎకరం ధర ఏకంగా రూ.177 కోట్ల రికార్డ్ ధర పలకడం గమనార్హం. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు,జిసిసిలు ఏర్పాటు చేసేందుకు ఉన్న సదుపాయాల వల్ల అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, అందుకే రియాలిటీ రంగం ఊపందుకుందని టిజిఐఐసి తెలిపింది. సిఎం రేవంత్‌రెడ్డి,ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాలనలో తీసుకొచ్చిన పారదర్శకత,అభివృద్ధి వల్ల దేశంలోనే హైదరాబాద్ దూసుకెళ్తోందని పేర్కొంది.

# త్వరలో కామారెడ్డి బహిరంగసభ

## జూబ్లిహిల్స్ టికెట్ బిసిలకు ఇచ్చే అవకాశం

## ఎంఐఎం మద్దతు మాకే, మేమే గెలుస్తాం

## పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,అక్టోబరు 6,ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక టికెట్ బిసి కి వచ్చే అవకాశం ఉందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. టిపిసిసిచీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో టికెట్ ఖరారు చేసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో మంగళవారం చర్చించిన తర్వాత అభ్యర్థుల లిస్ట్ ఎఐసిసి కి పంపిస్తామని తెలిపారు. ఉప ఎన్నిక లో ముగ్గురు ఇంచార్జి మంత్రులు రిపోర్టు ఆధారంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని ఆయన వివరించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక గెలిచి తీరుతామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనకు తేడా సుస్పష్టంగా ఉందని ఆయన అన్నారు. జూబ్లీ హిల్స్ ప్రజలు అభివృద్ధి , సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని జోస్యంచెప్పుకొన్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలను వక్రీకరించారని, అసత్యాలను ప్రచారాన్ని నమ్మకండని ఆయన కోఉరారు. డిసెంబర్ నాటికి పార్టీ పదవులు అన్ని భర్తీ చేస్తామని తెలిపారు. త్వరలోనే కామారెడ్డి బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, ముగ్గురు మంత్రులతో కలిసి జూబ్లీ హిల్స్‌లో బస్తీ బాట చేపడుతామని చెప్పారు. స్థానిక పరిస్థితుల బట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం,సిపిఐ, జనసమితి అభ్యర్థులకు టికెట్‌లభిస్తోందని తెలిపారు. ఎంఐఎం మా ఫ్రెండ్లీ పార్టీ తప్పకుండా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం మద్దతు మాకే ఉంటుందని, తప్పకుండా గెలిచి తీరుతామన్నారు.

## సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ సద్భావన అవార్డు

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** మాజీ కేంద్ర విదేశాంగశాఖ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్‌గాంధీ సద్భావనా అవార్డు అక్టోబర్ 19న ప్రధానం చేయబోతున్నామని మాజీ ఎమ్మెల్సీ బి కమలాకర్‌రావు, టిపిసిసి మేధావుల సెల్ కన్వీనర్ ఎ శ్యామ్‌మోహన్ తెలిపారు. సోమవారం గాంధీ భవన్‌లో కమలాకర్‌రావు, శ్యామ్‌మోహన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశమై నిర్ణయం తీసుకొన్నారు .35వ రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును తెలంగాణ ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రధానం చేయబోతున్నారు. మాజీ ప్రధాని,మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు దివంగత రాజీవ్ గాంధీ, 1990వ సంవత్సరం అక్టోబర్ 19న చారిత్రాత్మక చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, జంట నగరాల్లో సద్భావనా యాత్ర చేశారని గుర్తుచేసుకొన్నారు. రాజీవగాంధీ సద్భావనా యాత్రా స్మారక సమితి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినము గా పాటిస్తూ గత 35 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం చారిత్రాత్మక చార్మినార్ వద్ద ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. వివిధరంగాల్లో సేవలు అందించిన ఒక ప్రముఖ వ్యక్తిని సద్భావనా అవార్డుతో సత్కరించడం జరుగుతుందని కమలాకర్ చెప్పారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

## సినీహీరో విజయ్‌దేవరకొండ కారుకు ప్రమాదం

**అల్లంపూర్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** సినీహీరో విజయ్ దేవరకొండ కారుకు ఉండవెల్లి ఎన్‌హెచ్ 44 సమీపంలో ప్రమాదం జరిగింది. హైవే పై వెళుతున్న బొలేరో వాహనం ఒక్కసారిగా కుడివైపు మళ్లడంతో వెనకాల వస్తున్న విజయ దేవరకొండ లెక్సస్ మోడల్ కారు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న విజయ్ దేవరకొండకు, అతని కుటుంబానికి ఎలాంటి గాయాలు కాలేదు. విచారణ నిమిత్తం కారును వదిలి వేరే వాహనంలో హైదరాబాదుకు వెళ్లారు. ఈ ప్రమాదం పుట్టపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి హైవే సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

## కాంగ్రెస్ నేతలపై ఎన్నికల కమిషన్‌కు బిజెపి ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 6:** ఎన్నికల కమిషన్‌కు బిజెపి ఎంపి రఘునందన్ రావు ఫిర్యాదు చేశారు. ఓటర్ కార్డులను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రఘునందన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతలు ఓటర్ ఐడీ కార్డులు పంచిపెట్టే దుకాణం పెట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ చేతుల్లోకి రావాల్సిన ఓటర్ కార్డులు.. కాంగ్రెస్ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. బహిరంగంగా ఓటర్ కార్డులను పంచుతుంటే ఎన్నికల కమిషన్, జిహెచ్ఎంసీ కమిషనర్ ఎందుకు మాట్లాడటం లేదని ఎంపీ రఘునందన్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులను పంచుతున్న నవీన్ యాదవ్ ఎమ్మెల్యేగా పోటీకి ఎలా అర్హుడు అవుతాడని రఘునందన్ మండిపడ్డారు. నవీన్ యాదవ్‌కు ఓటర్ ఐడీ కార్డులు ఎవరిచ్చారు, జిహెచ్ఎంసీ కమిషనర్ ఇచ్చారా..? ఎన్నికల కమిషన్ ఇచ్చిందా..? అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేస్తామంటే గగ్గోలు పెడుతున్న మేధావులు ఇలాంటి వాటి మీదా స్పందించాలని తెలిపారు. ఎస్ఐఆర్ చేస్తామంటే ఓట్ల చోరీ అంటున్నారని, ఇది ఐడీ కార్డుల చోరీనా..? అని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ ఐడీ కార్డులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. జూబ్లీ హిల్స్‌లో ఓటర్ ఐడీ కార్డుల పంపిణీపై వెంటనే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల షెడ్యూల్‌తో లైసెన్స్ ఆయుధాల అప్పగింతకు ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్ పరిధిలో లైసెన్స్ కలిగిన ఆయుధాలను సంబంధిత వ్యక్తులు వెంటనే వాటిని సమీప పోలీసు స్టేషన్ లలో అప్పగించాలని సిటీ పోలీసు ఉన్నతాధికారు లు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఆయుధాలను సొంతదారులు మళ్లీ తీసుకునే వీలుంటుంది. నవంబరు 11న జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌కు ఉపఎన్నిక జరగనుండడంతో ఈ ఆదేశాలు జారీ చేశారు.

## నేడు బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశం

### జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై చర్చ

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిటీ మంగళవారం సమావేశం కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఈ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు సమాచారం.ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపించనుంది. బుధవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రేసులో జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, లంకల దీపక్ రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేసి మూడో స్థానానికే పరిమితమయ్యారు. ప్రస్తుతం భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు ఉప ఎన్నిక టికెట్ దక్కుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయనకు టికెట్ ఇవ్వని పక్షంలో జూటూరు కీర్తి రెడ్డికి టికెట్ దక్కే అవకాశముందని సమాచారం. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సన్నిహితంగా ఉన్న లంకల దీపక్ రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డిలో ఒకరు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఉన్నట్లు తెలిసింది.

# వరల్డ్ స్కిల్ కాంపిటీషన్లలో యువత పాల్గొనాలి

### 16-24 యేళ్ల వారికి అవకాశం.. 15 వరకు ఉచిత దరఖాస్తు

### విజేతలకు షాంఘైలో జరిగే స్కిల్ ఒలింపిక్స్‌కు అవకాశం

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 16 నుంచి 24 సంవత్సరాల లోపు ఉన్న యువత ఉపాధి, శిక్షణ శాఖ నిర్వహించే వరల్డ్ స్కిల్స్ కాంపిటీషన్-2026 పోటీల్లో పాల్గొనాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సూచించారు. ఇందులో గెలుపొందిన వారు వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో చైనాలోని షాంఘైలో జరిగే ఒలంపిక్స్-2026లో పాల్గొనే అవకాశం దక్కనుందని తెలిపారు. ఉత్సాహవంతులైన యువతీ, యువకులు ఈ నెల 15లోగా స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డెవలప్‌మెంట్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రశాంతితోపాటు ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్‌తో కలిసి సోమవారం మీడియాకి వివరాలను వెల్లడించారు. స్టేట్ స్కిల్ కాంపిటీషన్స్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ తెలంగాణ నిర్వహిస్తుందని తెలిపారు. ఇండియా స్కిల్ కాంపిటీషన్స్‌ను కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ వారు నిర్వహిస్తారని తెలిపారు. జోనల్, స్టేట్, రీజినల్, నేషనల్ పేరిట నాలుగు లెవల్స్‌లో స్కిల్ కాంపిటీషన్స్ ఉంటాయని తెలిపారు. కుకింగ్ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ వరకు 63 రకాల స్కిల్ కాంపిటీషన్స్‌ను నిర్వహించనున్నారు. నవంబర్‌లో జోనల్ లెవల్స్‌ను పూర్తి చేసుకొని డిసెంబర్‌లో స్టేట్, ఫిబ్రవరిలో నేషనల్ లెవల్స్‌ను పూర్తి చేసేలా ఇప్పటి వరకు ప్రణాళికను రూపొందించుకున్నట్లు తెలిపారు. అయితే వచ్చే దరఖాస్తుల ఆధారంగా మార్పులు, చేర్పులు ఉంటాయని తెలిపారు. 63 స్కిల్ కేటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. వ్యక్తిగతంగా గ్రూప్ పోటీలు ఉంటాయని తెలిపారు. స్టేట్ నుంచి 63 స్కిల్ కాంపిటీషన్స్ నుంచి గెలుపొందిన వారిని నేషనల్ పోటీలకి పంపిస్తామన్నారు. ఉచితంగానే స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌లో 16 నుంచి 24 సంవత్సరాల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఇప్పటి వరకు సుమారు 5500 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గత ఏడాది 25 మంది రాష్ట్రం నుంచి నేషనల్ కాంపిటీషన్స్‌కి వెళ్లారని.. ఈ సారి ఎక్కువ మంది వెళ్లేలా ప్రయత్నిస్తున్నట్లు స్టేట్ స్కిల్ కాంపిటీషన్స్ కోఆర్డినేటర్ ప్రశాంతి తెలిపారు. వరల్డ్ స్కిల్ కాంపిటీషన్స్‌లో 89 దేశాల నుంచి ప్రాతినిధ్యం ఉందని తెలిపారు.

# మాటలు కాదు.. మాది చేతల ప్రభుత్వం

### మాజీమంత్రి హరీశ్‌రావుకు మంత్రి కోమటిరెడ్డి కౌంటర్

### డిసెంబరు నాటికి నిమ్స్ ఆస్పత్రి పనులు పూర్తి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 6, ప్రభాతవార్త:** తమది చేతల ప్రభుత్వమని, బీఆర్ఎస్ పార్టీలా మాటల ప్రభుత్వం కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఎర్రంమంజిల్ ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ పి. విజయారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత తదితరులతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాము విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. శంకుస్థాపన స్థాయిలో వదిలివెళ్లిన ఆసుపత్రులను ఈ 21 నెలల్లో వేగంగా నిర్మిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 40వేల కోట్ల బకాయిపెట్టి వెళ్లిందన్నారు. నిత్యం అర్అండ్‌బి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని, రాత్రిపగలు తేడా లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. సనత్ నగర్ టిమ్స్ అక్టోబరు 31కి ప్రారంభిస్తామని, అలాగే అల్వాల్ ఆసుపత్రి వద్ద దాదాపు వేయి మంది ఒక షిఫ్టులో పనిచేస్తున్నారన్నారు. వచ్చే మార్చి నాటికి ఆయా పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసు కొస్తామన్నారు. ఎల్బీనగర్‌లో కొనసా గుతున్న పనులను జూన్ నాటికి పూర్తి చేస్తామని, అలాగే నిమ్స్ ఆసుపత్రిని 2వేల కోట్లతో నిర్మిస్తున్నామని, వచ్చే డిసెంబరు నాటికి పనులన్నింటిని పూర్తి చేస్తామన్నారు. వరంగల్‌లో నిర్మిత మవుతున్న ఆస్పత్రి పనులు శరవేగంగా సాగు తున్నాయని, డిసెంబరు నాటికి పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తా మన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పర్యటనలు చేస్తూ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని హరీశ్ రావుకు కౌంటర్ ఇచ్చారు. ప్రజల మేలు కోసం, వారి అవ సరాలను తీర్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రూ. 8కోట్ల వ్యయంతో కార్పొరేట్ స్థాయి హంగులతో ఎర్రంమంజిల్ ప్రభుత్వ పాఠశాల రూపుదిద్దుకుందని, త్వరలో డిజిటల్ తరగతులు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ పాఠశాల తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ మోడల్ పాఠశాలగా నిలుస్తుందన్నారు. ప్రపంచంతో పోటిపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించాలని నిర్ణయించామన్నారు. రూ. 20వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో అధునాతన రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామన్నారు. నల్గొండ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శ్లాబ్ స్థాయి వరకు పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిచందనతోపాటు పలువురు జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



ఎర్రంమంజిల్ పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, అనీల్‌కుమార్‌యాదవ్, విజయారెడ్డి తదితరులు.

## కోల్డ్‌రిఫ్ దగ్గు మందును వాడొద్దు

### డిఎంహెచ్‌ఒలకు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కోల్డ్ రిఫ్ దగ్గు మందును వాడొద్దని.. దాని వాడకాన్ని రాష్ట్రంలో నిషేధిస్తూ తెలంగాణ డైరక్టర్ జనరల్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిష్ట్రేషన్ నిర్ణయం తీసుకుందని.. ఈ నేపథ్యంలో కోల్డ్ రిఫ్ దగ్గు మందును వాడొద్దని పబ్లిక్ హెల్త్ డైరక్టర్ జిల్లా వైద్యాధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ డైరెక్టర్ జనరల్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తమిళనాడులోని కాంచీపురం జిల్లా, సుంగువర్చతిరం, శ్రేసన్ ఫార్మా తయారు చేసిన కోల్డ్‌రిఫ్ సిరప్‌ను వాడటం వెంటనే ఆపమని ప్రజలను హెచ్చరిస్తూ ఒక ప్రెస్ నోట్ జారీ చేశారని డిఎంహెచ్‌వోలకు తెలియజేశారు. ఈ ఔషధం డైథిలిన్ గ్లైకాల్ (డిఈజి)తో కల్తీ చేయబడిందని డ్రగ్ కంట్రోల్ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ సిరఫ్ కనుక ప్రజల వద్ద ఉంటే, వారు ఎటువంటి ఆలస్యం చేయకుండా దాని వాడకాన్ని ఆపేయాలని సూచించాలని డిఎంహెచ్‌వోలను ఆదేశించారు. ఈ సిరఫ్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పబ్లిక్‌హెల్త్ డైరక్టర్ సూచించారు. పిల్లలలో వచ్చే చాలా తీవ్రమైన దగ్గు అనారోగ్యాలు స్వయంగా తగ్గుతాయని, తరచుగా ఔషధాల జోక్యం లేకుండానే తగ్గిపోతాయని కేంద్ర డైరక్టరేట్ జనరల్ హెల్త్ సర్వీసెస్ ప్రకటించింది.

# ఫామ్‌హౌస్‌లలో మైనర్ల చిందులు!


### మొయినాబాద్‌లో ఓ మందు పార్టీ భగ్నం

### 22 మంది మైనర్లుసహా 65 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### ఇద్దరికి గంజాయి పాజిటివ్, ఓనర్ సహా ఏడుగురిపై కేసులు

**మొయినాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఫామ్‌హౌస్‌ల కల్చర్‌తో పాడవుతున్న యువత.. బార్లలో పరిమితులు ఉంటాయని, బహిరంగంగా ఉండే ఫామ్‌హౌస్‌లను అడ్డాగా చేసుకోని ఇష్టారాజ్యాంగా మద్యం, పార్టీలు, హుక్కా, గంజాయి, డ్రగ్స్‌లతో పార్టీలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో రోజుకో ఫామ్‌హౌస్ పుట్టుకొస్తుంది. ఫామ్‌హౌస్‌ల కల్చర్లకు మొయినాబాద్ అడ్డాగా మారింది, ఫామ్‌హౌస్‌లలో మైనర్లు సైతం మందులకు, చిందులకు అలవాటు పడుతున్న దుస్థితి.. అయితే వాటిని అరికట్టాల్సిన అధికారులు దాడులుచేసి వేడుకచూస్తున్నారు. మొయినాబాద్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం మొయి నాబాద్ మున్సిపాలిటీలోని పెద్దమంగళారం రెవెన్యూలోని చెర్రివోక్స్ ఫామ్ హౌస్‌లో మద్యం పార్టీ ఉందంటూ సోషల్‌మీడియా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నెలల తరబడి ఆర్గనైజింగ్ చేశారు. దాంతో ఈవెంట్ పాస్‌లను ఒకరికి ఎంట్రీ టిక్కెట్ ధర 1,300 చొప్పున అమ్మకాలు జరపగా పాస్‌లను కోనుగోలుచేస్తూ ఈవెంట్‌కు 65 మంది హాజరయ్యారు. కాగా ఎస్ఒటి పోలీసులు పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి తనిఖీ చేయగా, అక్కడ మద్యం పార్టీ నిర్వహిస్తుండగా ఎస్ఒటి అధికారులు ఆ పార్టీని భగ్నం చేశారు. అక్కడ తనిఖీలు నిర్వహించగా వారికి 9 ఒడ్కా సీసాలు లభ్యమయ్యాయి, పోలీసులు ఫామ్‌హౌస్ చేరకముందే అక్కడున్న వారు మద్యం సేవించి చిందులు వేస్తున్నారు. 6 మద్యం బాటిళ్లను సీజ్‌చేసి వారిని అదుపులోకి తీసుకొని టెస్టులు నిర్వహించగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ వచ్చిందని పోలీసులు వెల్లడించారు. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిని ఆరా తీయగా నెల రోజులక్రితం హైదరాబాద్‌లో సేవించామని తెలిపారు, పార్టీలోని 65 మందిలో 22 మందిని మైనర్లని గుర్తించామని, మిగితా 43 మంది మేజర్లుగా ఉన్నట్లుగా తెలిపారు. వారిలో 12 మంది మహిళలుండగా ఇద్దరే మేజర్లుగా ఉన్నారు. మిగితా పదిమంది మైనర్లు. వారందరిని అదుపులోకి తీసుకోని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫామ్‌హౌస్ యజమానులకు సంబంధం లేకపోయినా అనుమతులు లేకుండా ఈవెంట్లను చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. మైనర్లు ఉండడంతో వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించికౌన్సిలింగ్ ఇచ్చామని, మిగిలిన ముగ్గురు ఆర్గనైజర్లు, ఇద్దరు డిజె ప్లేయర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సౌండ్ పొల్యూషన్, అనుమతులు లేకుండా ఈవెంట్‌లను ఆర్గనైజ్‌చేసినవారిపై, ఫామ్‌హౌస్ మేనేజర్‌పై, ఫామ్‌హౌస్ ఓనర్ రమేశ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు, అనుమతులు లేకుండా మద్యం ఈవెంట్‌లను చేస్తే ఫామ్‌హౌస్ యజమానులదే పూర్తి బాధ్యత ఉంటుందని ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.





# ప్రభుత్వ విభాగాలు నీటి బిల్లుల బకాయిలు చెల్లించాలి

### సర్కారుకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** జంట నగరాలలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు అనేక సంవత్సరాలుగా నీటి బిల్లుల చెల్లింపులు చేయ డం లేదని, ఈ బకాయిలు రెండు వేల కోట్ల రూపాయల వరకు వుంటుందని, వీటిని వెంటనే చెల్లించేలా చూడాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స ర్కారును కోరింది. సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ రాశారు. సమాచార హక్కు చట్టం ప్రకారం రా ష్ట్ర ప్రభుత్వ విభాగాల నుంచి 1764.18 కోట్ల రూపాయలు, కేంద్ర ప్రభుత్వ విభాగాల నుంచి 250.23 కోట్ల రూపాయలు వాటర్ వర్క్స్ బోర్డుకు అందాల్సి వుందని వెల్లడయ్యిందని ఆయన తెలిపారు. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి కూడా కోట్లాది రూపాయలు అందాల్సి వుందని ఆయన తెలిపారు. బకాయిలు పడ్డ విభాగాలలో విద్యా శాఖ 19.02 కోట్ల రూపాయలు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 109.69 కోట్ల రూపా యలు, పోలీసు శాఖ 40.86 కోట్ల రూపాయలు, గృహ నిర్మాణ శాఖ 57.55 కోట్ల రూపాయలు, పరిశ్రమల శాఖ 24.96 కోట్ల రూపాయలు, మున్సిపల్ శాఖ 33.05 కోట్ల రూపాయలు, మిషన్ భగీరథ 1011.30 కోట్ల రూపాయలు, పంచాయితీరాజ్ శాఖ 377.29 కోట్ల రూపాయలు, రోడ్లు భవనాల శాఖ 17.71 కోట్ల రూపాయలు వుందని ఆయన తెలిపారు. సామాన్యుల నుంచి బకాయిల వసూలులో కఠినంగా వుండే సర్కారు ప్రభుత్వ విభాగాల విషయంలో ఉదాసీనంగా వుండడం సరైంది కాదని ఆయన తెలిపారు. ఈ విషయంలో సిఎం వెంటనే చొరవ చూపి వాటర్ వ ర్క్స్ బోర్డుకు రావాల్సిన బకాయిలు వచ్చేలా చూడాలని ఆయన కోరారు.

# బస్సు చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** హైదరాబాద్, సికింద్రాబాద్‌లో సిటీ బస్సుల కనీసఛార్జీని ఒక్కసారిగా రూ.10 పెంచడం పేద, మధ్యతరగతి ప్రజలపై నేరుగా భారం మోపుతుందని, ప్రభుత్వం వెంటనే బస్సు ఛార్జీల పెంపును రద్దు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాం చందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిందని, హైకోర్టులో అదే అంశంపై కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు సుప్రీంకోర్టు, ముందుగా హైకోర్టులో వాదనలు వినిపించాలి అని చెప్పడం సహజ ప్రక్రియ అన్నారు. అయితే కాంగ్రెస్ మంత్రులు పెద్ద హడావుడి చేసి ఏదో సాధిస్తామంటూ తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్లారన్నారు. దీనిపై రాజకీయంగా ప్రయత్నిస్తూ, ఏదో సాధించాం అని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, హైకోర్టులో న్యాయనిపుణులతో వాదనలు వినిపించి బిసిలకు న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో డిస్మిస్ కావడానికి కారణం హైకోర్టులో కేసు పెండిం గ్‌లో ఉండటం మాత్రమే అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కావాలని బిజెపి మొదటి నుండి కోరుతుందన్నారు. అందుకు మద్దతు ఇచ్చామని, కట్టుబడి ఉన్నామన్నారు. ఆర్‌టిసి బస్సు చార్జీల పెంపు దారుణం అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, పేద, మధ్యతరగతి వర్గాలపై సిటీ బస్సు చార్జీల పెంచి భారం మోపిందన్నారు. ఒక చేతితో ఇచ్చి, మరో చేతితో లాక్కోవడం అనేది కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికకు అభ్యర్థి ఎంపికకు అభిప్రాయాలు సేకరించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావు, మాజీ ఎంపి రాములు, కోమల ఆంజనేయులు ఉన్నారన్నారన్నారు. కమిటీ ద్వారా పార్టీ నాయకుల అభిప్రాయాలను సేకరించి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు అభ్యర్థిని ఎంపిక చేసి ప్రకటిస్తామన్నారు.



**భారతీయ జనతా పార్టీలో చేరికలు**

మహేశ్వరం నియోజకవర్గం నుంచి ముస్లిం మైనారిటీ కమ్యూనిటీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు కొత్తగా పార్టీలో చేరినవారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ముస్లిం మైనారిటీలు లబ్ధి పొందుతున్న నేపథ్యంలో, బిజెపిలో పెద్ద ఎత్తున చేరికలు కొనసాగుతున్నాయన్నారు.

# మావోయిస్టు పార్టీలో మళ్లీ మల్లోజుల కలకలం

> పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన
> సాయుధ పోరాటాన్ని వీడాలని క్యాడర్‌కు పిలుపు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు అయిన మల్లో జుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ మరోసారి సంచలన ప్రకటన చేశారు. పార్టీలో తన పదవులకు రాజీనామా చేస్తున్నట్లు సోమవారం నాడు ఒక ప్రకటన చేసిన మల్లో జుల సాయుధ పోరాటాన్ని వీడాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఇంతకు ముందు మావోయిస్టు పార్టీ ఆయుధాలను వీడాలని, కేంద్రంతో చర్చ లు జరపాలని అభయ్ చేసిన ప్రకటన సంచలనం రేపగా దీనిని ఆ పార్టీ ఖండించడంతోపాటు ఇది ఆయన వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొంది. ఇలాంటి ప్రకటన చేసినందుకు అభయ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన మావోయిస్టు పార్టీ ఆయన తన ఆయుధాలను వెంటనే అప్పగించాలని లేకుంటే, పార్టీ క్యాడర్ తీవ్రంగా వ్యవహరిస్తుందని హెచ్చరించింది. దీనిపై ఓవైపు చర్చ జరుగుతుండగానే మల్లోజుల మరో ప్రకటన విడుదల చేశారు. తా ను మావోయిస్టు పార్టీలో అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నానని, అన్నివార్య కారణాల వల్ల ఈ పదవుల్లో కొనసాగే అర్హత తనకు లేదని అభయ్ తన ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు పార్టీ క్యాడర్ వెంటనే సాయుధ పోరాటాన్ని వీడాలని ఆయన పిలుపునిచ్చారు.

మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు అనుసరించిన పంథా పూర్తిగా తప్పని, దీనివల్ల ఉద్యమం తీవ్రంగా నష్టపోయిందని ఆయన తెలిపారు.

మావోయిస్టు పార్టీ ఉద్యమాన్ని ఓట మి పాలుకాకుండా కాపాడలేక పోయినందుకు తాను క్షమాపణ కోరుతున్నట్లు ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు జరిగిన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదని, ఇలా జరిగివుంటే పరిస్థితి మరోరకంగా వుండేదని ఆయన వెల్లడించారు. అడవుల్లో వుంటూ ఏడాదికి ఒకటి లేదా రెండుసార్లు శత్రువులపై దాడులు చేసినంత మాత్రాన విజయం అనుకుంటే అది పూర్తిగా తప్పని, శత్రువులు రోజు రోజుకు బలపడుతున్నా ఇలా ఎందుకు జరుగుతుందనే దానిపై నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిందని అభయ్ తెలిపారు. ఆయుధాలు వీడాలనే నిర్ణయంపై పార్టీలో అంత ర్గతంగా చర్చ జరిగిన తరువాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి జీవించి వున్నప్పుడే ఈ అంశంపై చర్చ జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధికార ప్రతినిధి జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ప్రస్తుత ఫాసిస్టు పరిస్థితుల్లో సాయుధ పోరాటం ద్వారా లక్ష్యాన్ని చేరుకోలేమని అభయ్ తెలిపారు. అనవసర త్యాగాలకు ఇకనైనా ముగింపు పలికి, పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవా లని అభయ్ హితవు పలికారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన క్యాడర్‌కు సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానము
(దేవాదాయ శాఖ రిజిస్టర్ నెం.సి/1637/89)
ఇందిరానగర్, రామంతాపూర్, హైదరాబాద్ - 500013.

ఎల్.ఆర్.నెం. 04/2024, **బహిరంగ వేలం ప్రకటన** తేది. 07-10-2025

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి మరియు గ్రామస్తులకు తెలియజేయునది ఏమనగా, శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానము, ఇందిరానగర్, రామంతాపూర్, ఉప్పల్ మండలము, మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం యొక్క కొబ్బరికాయలు మరియు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు షాప్ నెం.1 లీజుకు ఇచ్చుటకు బహిరంగ వేలము తేది: 22-10-2025 బుధవారము రోజున ఉదయం 11.30 గం.లకు దేవాలయ ఆవరణము నందు నిర్వహించుటకు నిర్ణయించడమైనది. ఈ బహిరంగ వేలములో పాల్గొనుటకు ఆసక్తి కలవారు అందరూ వేలంపాటకు ముందుగా ఉదయం 11.30 గం.ల లోపల నిర్ణయించిన డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది. వివరములు: కొబ్బరికాయలు మరియు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు కాల పరిమితి: ఒకటిన్నర సం.లు తేది: 01-11-2025 నుండి తేది: 31-03-2027, డిపాజిట్: రూ.50,000/-. ఇతర వివరములకు ఫోన్ నెం. 9676565742 ని సంప్రదించగలరు.

DIPR.No.8841-PP/CL/Advt/1/2025-26, తేది: 06.10.2025 సం/- కార్యనిర్వహణాధికారి

వార్త

మధ్యవర్తి మాట, అడవిలోని బాట ఎంతవరకు తీసుకెళ్తాయో ఎవరికి తెలియదు.

-రాఛెల్

# ఔషధలీల..మృత్యుహేల

సాధారణ దగ్గు వారం రోజుల్లో దానంతటదే తగ్గిపోతుంది. అదే కోరింత దగ్గయితే చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుందని తాజా అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. కోరింత దగ్గు పీడితులు ఊపిరి పీల్చుకునేటప్పుడు కంగు కంగుమనే శబ్దంతో దగ్గువస్తుంది. కోరింత దగ్గయితే అంటు రోగమేనని చెప్పకతప్పదు. ఈ రెండింటికి తేడా తెలియక దగ్గు సంకేతాలు తెలియగానే పిల్లలకు వెంటనే దగ్గు మందు ఇచ్చేసి అదే తగ్గిపోతుందులే అనుకోవడం కద్దు. కానీ దగ్గు మందు నాణ్యత బెడిసి కొట్టి మధ్యప్రదేశ్‌లో 14 మంది చిన్నారులను పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటన గురించి తెలియగానే కేంద్ర ఆరోగ్య శాఖ మెళకువ తెచ్చుకుంది. ఎక్కడైనా దుస్సంఘటనలు జరుగగానే అప్పటికప్పుడు ప్రక్షాళన నిర్ణయాలు తీసుకోవడం మన పాలకులకు అలవాటే. ఇక్కడా ప్రభుత్వం ఆ మేరకు స్పందిస్తోంది. నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులను రద్దు చేస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో 'కోల్డ్రిఫ్' దగ్గు మందులను వాడిన వారిలో తీవ్ర 'అనారోగ్య లక్షణాలు కనపడి అసువులు బాశారు. చాలా రాష్ట్రాలు సత్వరం ఆ మందులను నిషేధించాయి. ప్రాణాపాయానికి కారణమైన మందులను తమిళనాడు కాంచీపురంలో ఓ ఔషధ తయారీ సంస్థ నుంచి బయటి కొచ్చింది. అలాంటి నాసిరకం మందులను కనిపెట్టాల్సింది ఆరోగ్యశాఖ కింద పనిచేసే ఔషధ నియంత్రణ విభాగమే. కానీ మార్కెట్‌లోకి విడుదలై పసిపిల్లల ప్రాణాలు తీసే వరకు తెలియలేదంటే ఏమనుకోవాలి. దీనికి కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖే బాధ్యత వహించాలి. కాగా 'కోల్డ్రిఫ్' సిరప్‌ను తయారు చేసిన శ్రేసన్ ఫార్మస్యూటికల్స్ మీద చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఉద్యుక్తమయ్యింది. ముందే తీసుకోవాల్సిన చర్యలు తర్వాత తీసుకుంటే ఏమవుతుంది? కొన్ని ప్రాణాలు బలైపోయాయి. మధ్యప్రదేశ్‌లోని బేటుల్ జిల్లా, ఆమ్లాబ్లాక్‌లో ఇద్దరు చిన్నారులు ఈ సిరప్ వాడాక మరణించారు. దాంతో ఛింద్వారా జిల్లాలోని పరాసియా ప్రజారోగ్య కేంద్రం పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రవీణ్ సోనిపై కేసు నమోదు చేశారు. ఆ డాక్టరు చాలా మందికి అదే సిరప్‌ను సిఫారసు చేశారు. ఈ సిరప్‌ల 10నాణ్యతా ప్రమాణాల్లో 9 మాత్రమే అనుగుణంగా ఉన్నాయని గుర్తించారు. ఈ మందు కలుషితమైనట్లు గుర్తించి దాని తయారీ కంపెనీపై తమిళనాడు రెగ్యులేటరీ అథారిటీ ఎఫ్‌డిఎ చర్యలు తీసుకొంది. దాని లైసెన్సును రద్దు చేయమని సిడిఎస్‌సిఒకు సిఫారసు చేసింది. ఇవన్నీ ఏదైనా దుస్సంఘటన జరిగినప్పుడు తీసుకునే చర్యలే. వీటిలో ప్రత్యేకత ఏమీలేదు. ఆ బ్యాచ్ సిరప్ సరుకుకు ఎలా అనుమతిచ్చి, మార్కెట్‌లోని విడుదలై, డాక్టర్ల చేత సిఫారసు చేయబడిందంటే వీటికి ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఎంత ఉందో పసికట్టి వారిపై చర్యలు తీసుకోవడం ఎంతో అవసరం. ఈ మందు వాడిన పిల్లలకు మూత్రపిండాల సమస్యలు వచ్చాయి. మూత్రపిండాలు వాచిపోయి క్రియాటినైన్ లెవెల్స్ మారిపోయి తీవ్ర సమస్యలు తలెత్తాయి. మూత్రం బంద్ అయ్యింది. ఒక కేసులో లెప్టోస్పైరోసిస్ పాజిటివ్ కనపడింది. ఇంత సీరియస్ సంఘటనలో కూడా ప్రభుత్వ విభాగాల అలసత్వం బయటకు రాకుండా ఏవేవో సమర్థింపులుచేసుకుంటున్నారు. పైగా గ్రామీణ ప్రాంతం నుంచి ఆ చిన్నారులు రావడాన్ని కూడా ఒక అవకాశంగా మార్చుకోవాలని చూశారు. గ్రామీణ ప్రాంతంలో పుట్టడం వారి నేరం కాదు. కానీ సంఘటనకు ఎవరూ బాధ్యత వహించడం లేదు. వైద్యులు దగ్గుమందులు రాసేటప్పుడు హేతుబద్ధంగా వ్యవహరించాలని కేంద్రప్రభుత్వం హెచ్చరిస్తోంది. ఇక్కడ 'హేతుబద్ధత'కు అర్థం తెలియక కొంత మంది డాక్టర్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో విడుదలైన దగ్గుమందులో రసాయనాలుంటాయని ప్రిస్క్రిప్షన్ రాసే మందు ఎలా తెలుస్తుందో జవాబు దొరకని ప్రశ్న. ఉదంతం జరిగాక ప్రాణాపాయంలో ఉన్న చిన్నారులకుఎలాంటి వైద్యసహాయం అందలేదు. మరణించిన చిన్నారులకు పోస్ట్‌మార్టెమ్ కూడా వెంటనే జరుగలేదు. ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాన్ని వెల్లడిస్తోంది. 'కోల్డ్రిఫ్' దగ్గు మందు కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైందని అనుమానిస్తున్నారు. కేవలం ఆ బ్యాచ్ సిరప్ ఎస్ఆర్ 13ను మాత్రమే నిషేధించారు. ఈ బ్యాచ్ సిరప్‌లు మరెక్కడా వాడకుండా సీజ్ చేసే ప్రక్రియ మొదలైంది. ఇలా అనంతర జాగ్రత్తలు చిన్నారుల ప్రాణాలు నిలబెట్టలేవు. కనుక సిరప్‌లు తయారయ్యే ఫార్మసీ కంపెనీల వద్దనే సంపూర్ణ స్థాయిలో పరీక్ష, విశ్లేషణ, పర్యవేక్షణ పటిష్టం చేయాల్సిన అవసరముంది. తీరా నాసిరకం ఔషధాలు బయటికొచ్చి రోగి శరీరంలోకి ప్రవేశించాక చేతులుకాలాక ఆకులు పట్టుకున్న చందాన ఉంటుంది. 'కోల్డ్రిఫ్' దగ్గుమందును ల్యాబ్‌లలో పరీక్షించి చూస్తే డైథిలీన్ గ్లైకాల్ (డిఇజి) ఇథైలీన్ గ్లైకాల్ (ఈజీ)గా పిలిచే ప్రమాద రసాయన ఆనవాళ్లున్నాయి. ఈ రెండూ మానవ శరీరం లోని మూత్రపిండాలు, కాలేయంలతో పాటు నాడీ వ్యవస్థలను దెబ్బతీస్తాయి. చిన్న ఫార్మా కంపెనీలు తమ ఔషధ ఉత్పత్తులను మార్కెటింగ్ సందర్భంలో డాక్టర్లకు తృణమో ఫణమో ఆశ చూపిస్తారు. ఆ నేపథ్యంలోనే డాక్టర్లు కొన్ని మందులను వాడమని సిఫార్సు చేయడం సహజం. డా.ప్రవీణ్ సోనీ ప్రభుత్వ డాక్టరు. కానీ తన ప్రైవేటు ప్రాక్టీసులో చిన్న పిల్లలకు పై నాసి రక మందును సిఫారసు చేశారు. అదే ఆయన తప్పిదమైంది. ప్రతి విషాద ఉదంతం జరిగినప్పుడు ఆ తర్వాత మరో విషాదం జరుగకూడదని మన స్ఫూర్తిగా, చిత్తశుద్ధితో సంకల్పం చెప్పుకుంటే తప్ప మానవ జీవన ప్రమాణాలను పెంచలేము.

బలవంతంగా పనిచేసే పది మంది కంటే ఒక స్వచ్ఛంద కార్యకర్త మేలు.



రాధాకృష్ణన్

మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న, పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి.



బైరన్

# యువత సామాజిక బాధ్యతను గుర్తెరగాలి

**చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్నచిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్లదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి.**

శ్రీశ్రీ కుమార్

నేటి విద్యార్థులే భావిభారత పద నిర్దేశకులు. రేపటి సమాజానికి మార్గదర్శకులు, విద్యార్థులు ఆదర్శవంతమైన యువతిగా రూపుదిద్దుకొని ఒక నీతి నిజాయితీ, నిబద్ధతతో కూడిన వ్యవస్థను రూపొందిస్తారని వారి పైన తల్లిదండ్రులకే కాదు అందరికీ ఉండే ఒక ఆశావహ అభిప్రాయం, ఆకాంక్ష. ఉన్నతమైన ఆశయాలతో మెరుగైన సమాజాన్ని నిర్మిస్తారని వీరిపై అందరికీ ఉండే ఒక సహజమైన విశ్వాసం కానీ కొద్ది సంవత్సరాలుగా పరిశీలిస్తే విద్యార్థులు రకరకాల దురలవాట్లకులోనై చెడు మార్గం పట్టడం గమనించవచ్చు. కారణాలు ఏమైనా కావచ్చు. కానీ రేపటి రోజుకు వీరు ఆశాకిరణం లాగాకాక సంఘ వ్యతిరేక శక్తులుగా కూడా తయారవుతున్నట్లు మనకు అవగతమవుతున్నది. ముఖ్యంగా విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం చాలా తరచుగా వింటున్నాం. కొద్దిమంది మరో అడుగు ముందుకేసి వాటి స్మగ్లింగ్‌లో కూడా పట్టుబడుతున్నారు. ఇలాంటి సంఘటనల వల్ల కాబోయే యువతపై మనం పెంచుకున్న విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఇలాంటి దురలవాట్లకు లోనై వారు చివరకు సంఘవిద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రవర్తనను ముందే పసిగట్టి కౌన్సిలింగ్ ద్వారానో కఠిన చర్యల ద్వారానో అరికట్టాల్సిన ఆవశ్యకత బాధ్యత తల్లిదండ్రులపైన, అధ్యాపకులపైన ఎంతో ఉంది. ఎన్ని చట్టాలున్నా, ఎన్ని చర్యలున్నా తగ్గకుండా నడుస్తున్న మరో దురలవాటు ర్యాగింగ్. కేవలం సీనియర్లు జూనియర్ల మధ్యన ఒక పరిచయం స్నేహభావం వెల్లివిరియాలనే సదుద్దేశంతో మొదలైన ఈ ప్రక్రియ విద్యార్థిలోకొన్ని ఒకజాడ్యంలాగా ఆవహించింది. వారి జీవితాలను కబళిస్తున్నది. సీనియర్లు జూనియర్ విద్యార్థులను వికృత క్రీడలతో విచిత్రమైన చేష్టలతో దానిని వింత పుంతలు తొక్కిందారు. పర్యవసానంగా ఈ బాధను తట్టుకోలేకపోయిన సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు మనకు తెలుసు. పోలీసు కేసులు రిజిస్టర్ అవుతున్నా, టిసిలు ఇచ్చిన సంఘటనలున్నా ఈ ర్యాగింగ్ రోగం తగ్గిన దాఖలాలు లేవు. రకరకాల రూపాలలో విశృంఖలంగా సాగుతూనే ఉన్నది. దీనిని సంపూర్తిగా సమూలంగా అరికట్టకపోతే ఈ దుష్ట సంస్కృతిని నిర్మూలించకపోతే మరిన్ని విలువైన ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. నాగర్ కర్నూల్ సూర్యాపేట, మెడికల్ కళాశాలలో సంఘటనలు సమాజాన్ని కదిలించి వేశాయి. చిత్తూరు జిల్లాలోనూ సీనియర్లు ఒక జూనియర్ విద్యార్థిని తమ రూములో చిత్రహింసలకు గురిచేసి తాము చేసిన ఘనకార్యాన్ని వీడియో కూడా తీయడం దారుణం. కళాశాల యాజమాన్యం కూడా ఇలాంటి సంఘటనల్లో మౌనం పాటించడం శోచనీయం. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దవలసిన అధ్యాపకులు, యాజమాన్యం తగిన సమయంలో స్పందించకపోతే దాని పరిణామాలు అనూహ్యంగానే ఉంటాయి. గత తొమ్మిది ఏళ్ల వ్యవధిలో 2024-25 సంవత్సరంలో అత్యధికంగా ర్యాగింగ్ కేసులు నమోదు కావడం బాధాకరం. 2022-24 మధ్య 51 ఆత్మహత్యలు కేవలం ర్యాగింగ్ వల్లనే జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. వృత్తి విద్యాకళాశాలలు ర్యాగింగ్‌కు కేంద్రాలుగా నిలపడం బాధాకరం. విద్యార్థులు యువత తాము అనుకున్నవి జరగకపోతే తట్టుకోలేకపోతున్నారు. మానసికంగా కృంగిపోతున్నారు. అది వారికి ఇష్టమైన కోర్సు కావచ్చు, ఉద్యోగం కావచ్చు. తనకు నచ్చిన మొబైల్ కొనివ్వలేదని ఆత్మహత్యలకు పాల్పడిన వారు, మొబైల్ వాడనివ్వలేదని కూడా మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు మనం చదువుతున్నాం. విద్యార్థులు ఈ రకంగా



సున్నిత మనస్కులుగా తయారు కావడం వారి భవిష్యత్తుకు మంచిది కాదు. తల్లిదండ్రులు కూడా వారిని ఆ విధంగా పెంచకూడదు. తాము అనుకున్న మార్కులు రాలేదనిర్యాంకు రాలేదని కూడా తీవ్రచర్యలకు పాల్పడుతున్నారు. మార్కులు, ర్యాంకు, కోర్సు ఇవి మాత్రమే జీవితం కాదనేది వారు గుర్తించాలి. పాఠశాలల్లో కళాశాలల్లో కూడా వారికి తరచుగా కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించుతూ వారిని దృఢ మనస్కులుగా తయారు చేయాలి. పరీక్షలు మార్కులు ర్యాంకులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ జీవితం ఒకటేనని వారు గుర్తించేలా చేయాలి ఒంటరిగా తిరిగేవాళ్లను అన్యమనస్కంగా ఉండే వారి మీద ఒక కన్నేసి ఉండాలి. అనుమానాస్పద ప్రవర్తనను పరిశీలిస్తూ ఉండాలి. ఉద్యోగార్థులు తమ ప్రయత్నంలో విఫలమైతే విరక్తిచెందుతారు. మరోమారుప్రయత్నం చేసి సాధించవచ్చుననే మనోధైర్యం వారిలో కల్పించాలి. వైఫల్యాలే భవిష్యత్తులో విజయాలకు సోపానాలని వారికి బోధించాలి. వారికి జీవితంపై ఆశ కలిగేలా చేయాలి. ఉద్యోగమే కాదు ఉపాధి అవకాశాలు గూర్చి వారికి అవగాహన కల్పించి, అవకాశాల గూర్చి కూడా వారికి తెలియజేసి వారిని ఆ దిశగా ఆలోచింపజేయాలి. జీవిత సత్యాలను, జీవన నైపుణ్యాలను వారికి నేర్పడం ద్వారా సమాజానికి ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దవచ్చు. మరి కొందరు ప్రేమ విఫలమైందనే మనోవ్యథలో కూడాకృంగిపోతున్నారు. తల్లిదండ్రులకు సమాజానికి భారంగా మిగిలిపోతున్నారు. అలాంటి వారి మనసు మళ్లించి మంచి వ్యాపకంలో వారిని తీరిక లేకుండా ఉండాలి. వారి అభిరుచిని బట్టి పని అప్పగిస్తే వారు ఇష్టపూర్తిగా చేసి విజయాన్ని ఆస్వాదిస్తారు. ఒత్తిడిని జయించే శక్తి సామర్థ్యాలు కలిగేలా చేయడం ద్వారా విద్యార్థులను యువతను సన్మార్గంలో పెట్టి వారితోనే సమాజంలో మార్పు తీసుకురావచ్చు. సామాజిక సేవ, రాజకీయాల వంటివి కూడా వారిని సరైన దిశలో నడిపిస్తాయి. వారి శక్తి వారు తెలుసుకునేలా చేయడంలోనే విజయ రహస్యం దాగి ఉంది. దేశం గర్వించదగిన ఎందరో మహానుబావుల చరిత్రలు చదివించడం ద్వారా వారిలో జీవితం పట్ల ఆసక్తిని కలిగించవచ్చు. సమాజంపట్ల బాధ్యతను పెంచవచ్చు. విద్యార్థులలో యువతలో ఎందుకింత నైరాశ్యం ఆవహించింది? అసలు వారి చదువుల్లోనే ఏదో ఒక లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. భాషల పట్ల నిర్లక్ష్యం పెరిగింది. భాషా వాచకాలలో ఎన్నో నీతి కథలు, ఆదర్శ పురుషుల జీవిత గాథలు, జీవన నైపుణ్యాలు నేర్పే విషయాలు ఇంకా జీవన విధానం తెలిపే అనేక విషయాలు ఉంటాయి. మారిన కాలమాన పరిస్థితులలో తరగతి బోధనలో భాషలు మూలన పడ్డాయి. ప్రాముఖ్యత కోల్పోయాయి. కంప్యూటర్ యుగం కావడంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే టెక్నికల్ కోర్సులకు డిమాండ్ సహజంగానే పెరిగింది. గ్రంథాలయాల్లో పుస్తకాలకు చెదలు పట్టాయి. పుస్తక పఠనం విద్యార్థుల్లో యువతలో పూర్తిగా పడిపోయింది. అందువల్ల వారు మానసిక దుర్బలులవుతున్నారు. చదువు, మొబైల్, టీవీ, కంప్యూటర్ ఇంతకుమించి వారికి వేరే ప్రపంచం లేకుండా పోయింది. అందులోనే వారు ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఆప్తులైన స్నేహితుడు కూడా కరువయ్యారు. ఆటలు ఏనాడో మరిచిపోయారు. శారీరక వ్యాయామం, శ్రమ పూర్తిగా మరుగున పడింది. ఆటంటే నేడు క్రికెట్ మాత్రమే. ఆటల ద్వారా స్నేహభావం గెలుపోటములు వాటి విలువ తెలుస్తుంది. క్రీడా స్ఫూర్తిని జీవితంలో కూడా ఉపయోగించగలుగుతారు. పాఠశాలల్లో కళాశాలల్లో గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నికలు లేకుండా చేశారు. దాంతో వారికి సామాజిక స్పృహ, ప్రతినిధులు, చట్టసభలు, చర్చలు ఇంకా వాదనల లాంటి వాటికి దూరమయ్యారు. రాజకీయ జ్ఞానం కూడా బొత్తిగా కొరవడుతున్నది. సామాజిక శాస్త్రాల పట్ల పాలకుల నిర్లక్ష్య ధోరణి దీనిని మరింత పెంచింది. సామాజిక బాధ్యత కూడా యువత నేడు గ్రహించడం లేదు. చదువు లక్ష్యం కేవలం ఉద్యోగమే కాదని జీవితాన్ని అర్థవంతంగా ఆనందంగా జీవించడమని వారు గుర్తించాలి. ఈ యువత దేశాన్ని ఉద్ధరించుతుందన్న ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. భూమి ఆకాశాలను ఏకం చేసే సత్తా కూడా వారికి ఉంది. పట్టుదల, వైద్యం వారి సొంతం. వారి ఆలోచనలను సరైన దిశలో మళ్లిస్తే వారు అద్భుతాలు సృష్టించగలుగుతారు. హత్యలు, ఆత్మహత్యల లాంటి వాటికి జోలికి పోకుండా తమ ఉన్నత స్థితి, సామాజిక పురోగతి లాంటి వాటికి బాటలు వేయాలి. సామాజిక స్థితిగతులను వారు అధ్యయనం చేయాలి. అన్యాయాన్ని ఎదిరించాలి. అక్రమాలకు అడ్డుకట్టు వేయాలి. కులమత రహిత సమాజానికై తమ వంతు పాత్ర పోషించాలి. చిన్న చిన్న విషయాలకి కృంగిపోతే, కునారిల్లితే వారు ముందుకు సాగలేరు. ముళ్ళదారులను పూలదారులుగా మలుచుకుంటూ వారి ప్రయాణం సాగాలి. యువతే నవ సమాజాన్ని నిర్మించాలి. ●

# ఇది జీవన సౌలభ్యమా! వ్యాపార సౌకర్యమా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ట్రంప్ సుంకాల భారం నుంచి మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రధాని జీఎస్టీ రేట్లు తగ్గించారా ? లేక అధిక జీఎస్టీ రేట్ల వలన ఎకానమీ ఆర్థిక మాంద్యం వైపుపోతున్నదనా? దేశంలో అధిక జీఎస్టీ రేట్ల వల్ల పడిపోయిన సార్థక డిమాండ్‌ను సరుకులు మార్కెట్లను పెంచి ఉత్పత్తులు ఉద్యోగిత ఆదాయాలు దేశంలో పెంచి ప్రజల జీవన సౌలభ్యం పెంచేందుకా? మన దేశంలో ఉన్నది జీవన సౌలభ్యమా? వ్యాపార సౌలభ్యమా? జీవన సౌలభ్యం అయితే సమాజంలో జీవనస్థితిగతుల నాణ్యతను సూచించేది. అంటే ఆర్థికఅవకాశాలు విద్యా వైద్య వసతులు, మౌలిక సదుపాయాలు పర్యావరణ స్వచ్ఛతమొదలైన అంశాల ప్రాతిపదికన జీవన సౌలభ్యస్థాయిని నిర్ధారిస్తారు. వ్యాపార సౌలభ్యం అంటే దేశంలో ఒక ప్రాంతంలో వ్యాపారాన్ని ప్రారంభించడం, నిర్వహించడం వాటిలో ఉన్న నియమ నిబంధనలో వ్యాపార అభివృద్ధికి దోహదపడుతున్నాయా లేదాఅనేది వ్యాపార సౌలభ్యాన్ని నిర్ణయిస్తాయి. ఉదాహరణకు జీఎస్టీ రేట్ల తగ్గింపును తీసుకుందాము. ఆ రేటు తగ్గింపుతో వినియోగదారులకు ఇప్పుడు 200000కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుందని అధికారిక అంచనా. మరి ఇంతకాలం వసూలు చేసినది? జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నందువలన మన జిడిపిలో కుటుంబ రుణాలపెరుగుదల 40శాతంవరకు ఉన్నదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మరొకవైపు కుటుంబాల పొదుపు జిడిపిలో 18.1 శాతానికి పడిపోయింది. ప్రజలు ఇంతవరకు చేసిన రుణాలను తీర్చుకోగలరా?ఈ నేపథ్యంలో దేశం, ప్రజల జీవన సౌలభ్యంమాటేమిటి? మొన్నటి వరకు ఐదు స్లాబ్‌ల జిఎస్టి పన్ను విధానంతో జీవన సౌలభ్యాన్ని కోల్పోయామా? వ్యాపార సౌలభ్యం జరిగిందా? ఈ ఐదు స్లాబుల జీఎస్టీ రేటు దేశంలో డిమాండ్‌ను తగ్గిపోయేట్టుగా చేసిందా ముఖ్యంగా చిన్నతరహా కుటీర పరిశ్రమలు2020-24 మధ్యకాలంలో49342 సంస్థలు మూతపడి 3.18 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. 2014లో మేక్ ఇన్ ఇండియా ప్రారంభించినప్పటి నుంచి ఉత్పాదక రంగంవాటా మన జిడిపిలో 16.7శాతం నుంచి 13శాతానికి పడిపోయింది. నిరుద్యోగం ఎక్కువైంది. అయితే దేశంలో ప్రతి ఏటా 80 లక్షల మంది లేబర్ మార్కెట్కు చేరుకుంటున్నారు. వారిలో రెండు శాతం కూడా ఉపాధి పొందలేకపోతున్నారు. ప్రస్తుతం జీఎస్టీ రెండు స్లాబులగా తగ్గించడం వలన మూతపడిన పరిశ్రమలు తెరుచుకుంటాయా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి? 2014లో మన ప్రధాని మేక్ ఇన్ ఇండియా పథకాన్ని ప్రారంభిస్తూ భారతదేశం కేవలం ఒక మార్కెట్ గా కాకుండా ఒక ఉత్పత్తి కేంద్రంగా కూడా ఉండాలని ప్రపంచమార్కెట్ను కైవసం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఆనాటి స్వదేశీ ఉద్యమం తరహాలో ఈనాడు స్వయం పోషకత్వం కోసం మేకిన్ ఇండియా ఆత్మనిర్భర భారత్ ఇలాంటి పథకాలను మన ప్రధాని జాతీయ వాదమని దేశభక్తి అని ప్రజల ఐక్యతను ఆశిస్తూ చేస్తున్న పాలనలో ఈ జీఎస్టీ పన్నుల విధానంతో దెబ్బతిన్నాయని భావించడం జరిగి ఇప్పుడు జిఎస్టిరేట్లను తగ్గించుచున్నారా? లేక ట్రంపు సుంకాల భారం నుంచి మన ఆర్థికవ్యవస్థను కాపాడేందుకు. అంతర్జాతీయ శ్రామిక సంస్థ ప్రకారం దేశంలో 2024లో బలహీనమైన ఉపాధి అవకాశాలున్నాయని ధరలు ఎక్కువగాను ఆదాయాలు తక్కువగాను వినియోగ వస్తువుల డిమాండ్ పడిపోయిందని ఫలితంగా పెట్టుబడులు కూడా తగ్గిపోతున్నాయని తెలియజేసింది. 2014లో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రపంచీకరణ వలన అద్భుతమైన ఫలితాలు మన ఆర్థికవ్యవస్థలో లభిస్తాయని ఎక్కువ గానే ఆశ పెట్టుకున్నారు. మనదేశంలో తయారీ రంగంలో ఏటా14 శాతం వృద్ధి రేటును అందిస్తామని 2022 నాటికి దేశంలో తయారీరంగంలో10కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఆశలు కల్పించారు. కానీ తయారీ రంగంలో వృద్ధి రేటుఆరు శాతం వరకు కూడా పెరగలేదు. అటు అమెరికా ప్రెసిడెంట్ సుంకాల వలన ఇటు దేశంలో మనప్రధాని పన్నుల విధానం వలన దేశ ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. ●



# ప్రజావాక్కు

### డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసాలు

ప్రస్తుతం పెరుగుతున్న సైబర్‌నేరాలలో 'డిజిటల్ అరెస్టు' ఒక కొత్త వల. నేరగాళ్లు తాము ప్రభుత్వ అధికారులు, సీబీఐ లేదా సైబర్ పోలీసులు అని నటిస్తూ బాధితులకు కాల్ చేస్తారు. తప్పుడు కేసుల్లో నిందితులమని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయని భయపెడతారు. వెంటనే జరిమానా చెల్లించాలని, లేకపోతే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తారు. కొన్నిసార్లు పర్సనల్ డాక్యుమెంట్లు పంపమని, బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వమని ఒత్తిడి తెస్తారు. ఇలా నిర్దోషుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు దోచుకుంటున్నారు. నిపుణులు హెచ్చరిస్తూ, ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. గుర్తింపుకార్డు చూపించినానేరుగా నమ్మకూడదు. ఎప్పుడూ బ్యాంక్ సమాచారం, పాస్‌వర్డ్‌లు పంచకూడదు. అనుమానం కలిగితే సంబంధిత అధికారిక వెబ్‌సైట్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్ ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### దేశాన్ని తూలనాడటం మానుకోవాలి

పార్లమెంట్‌లో అపోజిషన్ నాయకుడైన రాహుల్ గాంధీని కాబోయే ప్రధానమంత్రి వరుసలోని వారని అంటారు. ఈయనకు దేశ రాజకీయాలపై మంచి పట్టు ఉన్నదని తెలుసున్న విషయమే. కాని ఎక్కడ ఏలా మాట్లాడాలో ఇంకాచాలాతెలుసుకోవాలి. పరంపరగా వచ్చిన కాంగ్రెసు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న రాహుల్ ఇంకా రాజకీయాలలో పరిపక్వతచెందాల్సింది చాలా ఉంది. ముఖ్యంగా ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు మాతృదేశంపై కువిమర్శలు చేయ కూడదు కదా! గతంలో ఎంతోమంది ప్రభుత్వ వ్యతిరేక రాజకీయులు ఇతర దేశాలకు వెళ్ళినా దేశాన్ని, అప్పటి ప్రభుత్వాన్ని తులనాడలేదే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఉపాధి హామీ మంచి ఉపకరణం

తెలంగాణ అంటే ఒకనాడు పల్లెర్లు మొలిసిన భూములు కనిపించేవి. ఇప్పుడు పచ్చని పసరికలు కనబడుతున్నాయి. దానికి ప్రధాన కారణం ప్రాజెక్టులతో పాటు విరివిగా కురుస్తున్న వర్షపాతం అయితే ప్రభుత్వ లెక్కల ప్రకారమే తెలంగాణలో బీడు భూమి5శాతం అయితే ఉపాధి హామీని ఉపయోగించి ఆ బీడు భూమిని సాగులోకి తెవొచ్చు.

- భారత అవినాష్, జనగామ

### పెరుగుతున్న మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియుల ఆగడాలు శృతిమించిపోతూ వున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యం మత్తులోవాహనాలు నడపొద్దని అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. దీనికితోడు అధికారుల తనిఖీలు అంతంతమాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటి పడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు. ప్రధానంగా రహదారులను సైతంఅడ్డాగా మార్చుకొని మరీ తాగుతున్నారు. మద్యం దుకాణాలవద్ద పర్మిట్‌రూం అందుబాటులో ఉన్నా.. చాలావరకు వినియోగించుకోవడం లేదు. అధికారుల తనిఖీలు అంతగా లేకపోవ డంతో ఈ తతంగంగా సాగిపోతోంది.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### ఆర్టీసీ బస్సు చార్జీలు తగ్గించాలి

జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌లో బస్సు చార్జీలు రెండు మూడు స్టాపులకు ఐదునుండి పది రూపాయల చొప్పున పెంచింది. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం అవుతుంది. నెలకు అదనంగా ఐదువందల రూపాయలపై చిలుకుపడే అవకాశంఉంది. ఇప్పుడు ఉన్న చార్జీలలో యాభైశాతం పెంచారు. కావునా వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రప్రభుత్వం పెంచిన చార్జీలు తగ్గించాలి. ఇంట్లోమహిళలకు ఉచితబస్సు ఇచ్చిపురుషులకు చార్జీలు పెంచడం సరికాదు. కుటుంబంపైనే భారం పడే అవకాశం ఉంది. గతంలో కూడా బస్సు చార్జీలు పెంచారు. ఇప్పుడు కూడా పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### విభజించు పాలించు

ఆంగ్లేయులు నేర్పిన సమయపాలనకు, అత్యంత విలువనిచ్చిన గాంధీజీని తుపాకితో కాల్చిచంపిన కిరాతకుడైన గాడ్సేను హీరోగా అభివర్ణిస్తూ, అతనిని పొగుడుతూ అతను ఆరోజు గాంధీను ఎందుకు కాల్చాడో అతని మనోగతం తెలిపే అతను వ్రాసిన లేఖను ఇప్పుడు సుప్రీంకోర్టు అనుమతితో బహిర్గతం చేస్తూ, కొత్త విషయం అంటూ చెత్త విషయాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో దుర్మార్గమైన భావజాలం గలఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తయిందని ఆ సంస్థ పేరుమీద ఒక వంద రూపాయల నాణెం విడుదల చేయడంలో ఔచిత్యం ఏమిటో.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెల్ల బంగారం.. రైతు శ్రమకు గ్లోబల్ గౌరవం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తిదినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (నీతివీ) ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు,ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదు, అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం పత్తిపంట ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత,ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్తాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలుపత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతి పెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తిసాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360-400 లక్షల గింజల బేళ్ల పత్తిఉత్పత్తి



అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్,తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. 'మేడ్ ఇన్ ఇండియా కాటన్' అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తిపంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగాఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థికవ్యవస్థలో కీలక స్తంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటివనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటిఅంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన 'కాటన్4' ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాడ్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్,పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాల పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. 'కాటన్ ఈజ్ లైఫ్' అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగాఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ "రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణఈ అన్ని కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి. అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదు, అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం. ●

### ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం..

### పదవి చేపట్టిన నెలకే ప్రధాని

# సెబాస్టియన్ రాజీనామా!



**ప్యారిస్, అక్టోబరు 6:** ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్నూ తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు. గత నెల జాతీయ అసెంబ్లీ జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. తర్వాత రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. సోమవారం మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది. కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.

# ఆఫ్రికా నుంచి డ్రగ్స్ అక్రమ రవాణా

## ప్రమాదకరంగా కొనసాగిస్తున్న స్మగ్లర్లు

## సినిమా ఫక్కీలో డ్రగ్స్ మాఫియా దందాలు



**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఆఫ్రికా దేశాలకు చెందిన డ్రగ్స్ మాఫియా డాన్‌లు తమ దేశాల నుంచి మాదకద్రవ్యాలను స్మగ్లర్ల ద్వారా ప్ర మాదకర పరిస్థితుల్లో భారత్‌కు రవాణా చేస్తున్న తీరు పోలీసులు, డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆఫ్రికా దేశాలైన దక్షిణాఫ్రికా, టాంజానియా, కెన్యా సహా ఇంకొన్ని దేశాలకు చెందిన బీద వారిని ఒక పద్ధతి ప్రకారం ఎంచుకుని వారి కడుపు, మల ద్వారాల వద్ద ప్రమాదకరమైన కొకైన్, హెరాయిన్ వంటి డ్రగ్స్‌ను వుంచి భారత్‌కు పంపుతున్న అక్కడి డ్రగ్స్ డాన్‌లు ఇక్కడి సర్కారీ విభాగాలకు కొ త్త సవాళ్లు విసురుతున్నారు. వాస్తవానికి ఈ పద్ధతులు కొత్తవి కాకున్నా ఏదైనా తేడా వస్తే డ్రగ్స్ తరలిస్తున్న స్మగ్లర్ల ప్రాణాలు పోవడం ఖాయంగా చెప్పాలి. ఒకవేళ పోలీసులకు దొరికిపోతే జీవితాంతం భారత్‌లోని జైళ్లలో మగ్గాల్సి వుంటుంది. ఇలా గడచిన పదేళ్ల కాలంలో 200 మంది వరకు ఆఫ్రికా దేశాలకు చెందిన స్మగ్లర్లు భారత్‌లోని పలు జైళ్లలో మగ్గుతుండగా వీరిలో వంద మంది శిక్షలు అమలైన వారున్నారు. కాగా పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్లలో మంది మహిళలు వుండడం గమనార్హం. మరోవైపు ప్రమాదకరంగా డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేస్తున్న స్మగ్లర్ల శరీరాల్లో వుంచిన డ్రగ్స్‌ను వెలికి తీసే ందుకు పోలీసులు వారిని నాలుగైదు రోజుల పాటు ఆసుపత్రుల్లో వుంచాల్సి వస్తోంది. డ్రగ్స్ మాఫియా ఆగడాలు, అడ్డగోలు వ్యవహారాలు సినిమా తరహాలో చిత్ర విచిత్రంగా వుంటున్నాయి. తమ ఏజెంట్ల కడుపులో లేదా శరీరంలోని మరేదైనా భాగంలో మాదకద్రవ్యాలను దాచి వుంచుతారు. ఆ తరువాత తమ ఏజెంట్లను తాము పంపా ల్సిన చోటుకు నిర్ణీత వ్యవధిలో పంపు తారు. అయితే కొన్నిసార్లు నిర్ణీత సమయంలో స్మగ్లర్లు చేరకపోతే వారి ఆరోగ్యం పాడై ఉన్నచోటే మరణిస్తుంటారు. ఈ తరహా టెక్నిక్‌లను ఇప్పుడు ఆఫ్రికా కు చెందిన మాదకద్రవ్యాల డాన్‌లు అనుసరిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా తమ తమ దేశాలలో బీద వారిని ముఖ్యంగా మహిళలు, మ ధ్య వయస్సు వారిని ఎంచుకుని వారికి దండిగా డబ్బులు ఇస్తారు. ఆ కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరిని ఎంచుకుని వారి కడుపులో మాదకద్రవా ్యలను నోటి ద్వారా మింగించడం లేదా ఆపరేషన్లు చేసి కడుపులో దాచి వుంచుతారు. దీని తరువాత ఆ వ్యక్తులను ఆఫ్రికా దేశాల నుంచి దుబాయ్ మీదుగా భారత్‌లోని పలు నగరాలకు పంపుతుంటారు. ఇక్కడ వీరు రాగానే డ్రగ్స్ మాఫియా డాన్‌ల అనుచరులు రహస్య ప్రాంతానికి తీసుకు వెళ తారు. అనంతరం తమకు బాగా పరిచయం వున్న వైద్యుల ద్వారా ఆపరేషన్లు చేయించి వారి కడుపులో వున్న డ్రగ్స్‌ను వెలికితీస్తారు. దీని తరువాత సదరు వ్యక్తులను వారం పది రోజుల పాటు ఆసుపత్రుల్లోనే వుంచి వైద్యం అందించి కోలుకున్న తరువాత తిరిగి వారి దేశాలకు పంపిస్తారు. ఇలా ఒకసారి భారత్‌కు ప్రమాదకరంగా డ్రగ్స్ తీసుకు వచ్చినందుకు ఆఫ్రికా దేశస్తులకు మూడు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు అందుతుంది. ఇదే సమయంలో ఏదైనా తేడావచ్చి ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు పది లక్షల రూపాయల వరకు అందజేస్తారు. ఇంత డబు ్బలు ఆ దేశంలోని బీదవారికి జాక్‌పాట్ తగిలినంతగా చెప్పాలి. ఇలా ప్రమాదకరంగా కడుపులో డ్రగ్స్‌ను దాచుకుని ప్రయాణాలు చేస్తున్న వారు రెం డు లేదా మూడు రోజుల వ్యవధిలోనే డ్రగ్స్‌ను బయటకు తీయకుంటే మరణించడం ఖాయంగా చెప్పాలి. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ము ంబాయితో బెంగళూరు, చెన్నై శంషాబాద్ విమానాశ్రయాలలో తరచూ శరీరాలలో హెరాయిన్, కొకైన్ సహా పలు రకాల డ్రగ్స్‌ను మాత్రలు, లేదా పొ ట్లాల రూపంలో దాచుకుని వస్తూ ఇక్కడ కస్టమ్స్ అధికారులకు దొరికిపోతున్న తీరు డ్రగ్ మాఫియా ఆగడాలు ఏ స్థాయికి చేరాయో ఊహించుకోవ చ్చు. శంషాబాద్ విమానాశ్రయంలో ఏడాదిన్నర క్రితం టాంజానియాకు చెందిన ముగ్గురు వ్యక్తులు కడుపులో హెరాయిన్ దాచి వుంచి హైదరాబాద్ కు రాగా అప్పటికే వారి ప్రయాణం మూడు రోజులు దాటడంతో తీవ్ర అస్వస్తతకు లోనవడం, సరిగ్గా నడవలేక పోవడంతో డిఆర్ఐ అధికారులు అ నుమానించి వెంటనే విమానాశ్రయంలోనే స్కానింగ్ చేయగా వారి కడుపులో డ్రగ్స్ వున్న విషయం రట్టయ్యింది. ఇందులో మొదటి వ్యక్తి కడుపులో 57 మాత్రలు, రెండవ వ్యక్తి కడుపులో 108 మాత్రలు వున్నాయి. వీరిద్దరిని వారం రోజుల పాటు ఆసుపత్రిలో వుంచి చిన్నపాటి ఆపరేషన్లు చేసి కడుపులోని మాదకద్రవ్యాలను వెలికితీశారు.

# లక్షల స్కాలర్‌షిప్ లభించినా వీసా తిరస్కరణ

## అమెరికా వెళ్లాలనుకున్న భారత్ విద్యార్థికి అనూహ్యా అనుభవం




**కొలంబియా, అక్టోబరు 6:** అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న భారతీయ విద్యార్థులను ఆందోళనకు గురిచేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం చదివేందుకు ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 88 లక్షలు) భారీ స్కాలర్‌షిప్ సాధించిన భారత విద్యార్థికి అమెరికా ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. చదువు పూర్తయ్యాక అతను తిరిగి భారత్‌కు వెళ్లడనే అనుమానంతో స్టూడెంట్ వీసాను నిరాకరించింది. భారత్‌కు చెందిన 27 ఏళ్ల కౌశిక్ రాజ్, కొలంబియా యూనివర్సిటీలో జర్నలిజం కోర్సులో ప్రవేశానికి ఎంపికయ్యాడు. దీనికి తోడు సుమారు రూ. 88 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌ను కూడా సాధించాడు. దీంతో తన కల నెరవేరినట్లేనని భావిస్తున్న తరుణంలో అమెరికా వీసా ఇంటర్వ్యూ తర్వాత అతనికి నిరాశే ఎదురైంది. అధికారులు అతని వీసా దరఖాస్తును తిరస్కరించారు. చదువు పూర్తయిన తర్వాత కౌశిక్ తిరిగి తన సొంత దేశానికి వెళతాడన్న నమ్మకం తమకు కలగడం లేదని వీసా తిరస్కరణ పత్రంలో అధి కారులు స్పష్టంగా పేర్కొన్నారు. అమెరికా నిబంధనల ప్రకారం, స్టూడెంట్ వీసా (ఎఫ్1) కోసం దరఖాస్తు చేసుకున్నవారు తమ చదువు తాత్కాలికమేనని, ఆ తర్వాత తమ దేశానికి తిరిగి వెళ్లేందుకు బలమైన కుటుంబ, సామాజిక బంధాలు ఉన్నా యని నిరూపించు కోవాల్సి ఉంటుంది. కౌశిక్ విషయంలో ఈ నిబంధన నెరవేరలేదని అధికారులు తేల్చిచెప్పారు. ఈ అనూహ్య పరిణామంపై కౌశిక్ రాజ్ స్పందించాడు. నా కుటుంబం, బంధువులు అందరూ భారత్‌లోనే ఉన్నారు. అయినా నాకు వీసా నిరాకరించడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నాడు. వీసా అధికారులు తన సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించడం వల్లే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అతను అనుమానం వ్యక్తం చేశాడు. గతంలో తాను జర్నలిస్టుగా పనిచేసినప్పుడు రాసిన కథనాల లింకులను సోషల్ మీడియాలో పంచుకున్నా నని, వాటిని చూసిన అధికారులు తాను అమెరికాలో స్థిరపడటానికే వస్తున్నానని అపార్థం చేసుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ నిర్ణయంపై అప్పీల్ చేసుకునే అవకాశం లేదని, కావాలంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అమెరికా వీసా అనేది ఒక అవకాశం మాత్రమే కానీ, హక్కు కాదని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ పరిణామం అమెరికాలో ఉన్నత విద్య కోసం ప్రయత్నిస్తున్న ఇతర భారతీయ విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.



## బిజెపి ఎంపి ఖగేన్ ముర్ముపై

# దాడి!

**కోల్‌కతా, అక్టోబరు 6:** పశ్చిమబెంగాల్ లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన బీజేపీ ప్రతినిధి బృందం పై సోమవారంనాడు దాడి జరిగింది. జల్‌పాయ్‌గురి జిల్లాలో బీజేపీ ప్రతినిధుల కాన్వాయ్‌పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో మాల్దా ఉత్తర్ ఎంపీ ఖగెన్ ముర్ము తీవ్రంగా గాయపడ్డారు. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ సైతం గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. దాడిలో ఈ ఇద్దరు నేతలు ప్రయాణిస్తున్న వాహనాలు సైతం దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు వెళ్తున్న తమ పార్టీ ప్రతినిధి బృందంపై దాడి వెనుక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఉందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ఆరోపించారు. టీఎంసీ గూండాలు నార్త్ మాల్దాకు రెండుసార్లు ఎంపీగా ఉన్న ఖగెన్ ముర్ముపై దాడి చేశారు. కోల్‌కతా కార్నివాల్‌లో మమతా బెనర్జీ మునిగిపోయారు. టీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏమాత్రం వరద సహాయక చర్యలను పట్టించుకోవడం లేదు. బీజేపీ నేతలు, కార్యకర్తలు మాత్రమే బాధితులను ఆదుకుంటున్నారు. టీఎంసీ బెంగాల్‌లో క్రూరత్వం రాజ్యమేలుతోందని సామాజిక మాధ్యమం ఎక్స్ ఖి ఆయన పేర్కొన్నారు. మాల్దా ఉత్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి ఎంపీగా ఆయన రెండోసారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2006 నుంచి 2019 వరకూ హబీబ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన సేవలందించారు.

# బీహార్ ఎన్నికలకు 11 మందితో ఆప్ జాబితా



**పాట్నా, అక్టోబరు 6:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఎపి) సోమవారం విడుదల చేసింది బీహార్‌లో ఆప్ పోటీ చేస్తుండటం ఇదే మొదటిసారి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ ఈసారి బీహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ప్రకటించారు. ఈ విషయాన్ని ఆప్ ఢిల్లీ విభాగం చీఫ్, సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా ఆ తర్వాత ధ్రువీకరించారు. ఆప్ అభ్యర్థులు వీరే.. ఆప్ ప్రకటించిన 11 మంది అభ్యర్థులలో డాక్టర్ మీరాసింగ్-బెగుసరాయ్ (బెగుసరాయ్), యోగి చౌపల్-కుషేశ్వర్‌స్థాన్ (దర్భంగా). అమిత్‌కుమార్‌సింగ్-తరియ (సారణ్), భాను భారతీయ-కస్బా (పూర్ణియా), సౌభద యాదవ్-బేనిపట్టి (మధుబని), అరుణ్‌కుమార్ రజక్-ఫుల్వారి షరీఫ్ (పాట్నా), డాక్టర్ పంకజ్‌కుమార్-బంకీపూర్ (పాట్నా), ఆష్రాఫ్ ఆలం-కిషన్ గంజ్ (కిషన్‌గంజ్), అఖిలేష్ నారాయణ్ ఠాకూర్-పరిహార్ (సీతామర్హి), అశోక్‌కుమార్‌సింగ్-గోవింద్‌గంజ్ (మోతిహారి), మాజీ కెప్టెన్ ధర్మరాజ్‌సింగ్-బక్సర్ (బక్సర్) ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్-2025ను ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరుగనుంది. నవంబరు 14న కౌంటింగ్ జరుగుతుంది కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 2020లో మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి.

# సంక్షిప్తంగా..

### దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఐఎన్ఎస్ సహ్యాద్రి



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారతీయ యుద్ధ నౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి దక్షిణ చైనా సముద్రంలో మోహరిస్తున్నారు. గడిచిన రెండు వారాల్లో ఆ వివాదాస్పద జలాల్లో భారతీయ యుద్ధ నౌక సంచరించడం ఇది రెండో సారి. ప్రస్తుతం ఐఎన్ఎస్ సహ్యాద్రి మూడు రోజుల పాటు మలేషియాలో ఉన్నట్లు నేవీ ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ చైనా సముద్రంలో ఈస్టర్న్ ఫ్లీట్ ను డిప్లాయ్ చేస్తున్నారని, ఇండోపసిఫిక్ ప్రాంతంలో కూడా యుద్ధ నౌకల మోహరింపును బలపేతం చేస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. ఐఎన్ఎస్ సహ్యాద్రి బాధ్యతాయుతంగా ఆపరేషనల్ డిప్లాయ్‌మెంట్‌లో పాల్గొన్నదని, ఇండోపసిఫిక్ సముద్ర ప్రాంతంలో సెక్యూర్టీ భాగస్వామి బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్లు నేవీ పేర్కొన్నది. రెండు వారాల క్రితమే మరోయుద్ధ నౌక ఐఎన్ఎస్ నిస్తార్ ఇండో పసిఫిక్ రీచ్‌లో పాల్గొన్నది. పది రోజుల పాటు ఆ ఈవెంట్ జరిగింది. సింగపూర్ వేదికగా జరిగిన పసిఫిక్ రీచ్ విన్యాసాల్లో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ దేశ నౌకలు కూడా పాల్గొన్నాయి.

### దుర్గామాత నిమజ్జన ర్యాలీలో ఘర్షణలు, పలువురికి గాయాలు

**కటక్, అక్టోబరు 6:** ఒడిశాలోని కటక్ నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా చెలరేగిన హింసతో అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలో 36 గంటల పాటు కర్ఫ్యూ విధించి, 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను, సోషల్ మీడియాను నిలిపివేశారు. శాంతిభద్రతలను పునరుద్ధరిం చేందుకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వ హిస్తున్నారు. దుర్గా నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం మొదలైంది. ఈ వాగ్వాదం కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు రాళ్లు, సీసాలతో దాడులు చేసుకోవడంతో ఆ ప్రాంతం రణరంగంగా మారింది.

ఈ హింసాత్మక ఘటనలో ఎనిమిది మంది పోలీసుల సహా మొత్తం 25 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడాలి: ఢిల్లీ సిఎం



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగిస్తున్నది బ్రాహ్మణులేనని, వారి సంక్షేమం కోసం ప్రతి ప్రభుత్వం పనిచేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా అన్నారు. ఢిల్లీలోని పీతంపురలో శ్రీ బ్రాహ్మణ సభ నిర్వహించిన అఖిల భారత బ్రాహ్మణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభలో రేఖా గుప్తా మాట్లాడుతూ, "సమాజంలో ఎవరైనా విజ్ఞాన దీపాలను వెలిగిస్తున్నారంటే అది మన బ్రాహ్మణ సమాజమే. వారు శాస్త్రాలనే కాదు, శస్త్రాలను కూడా పూజిస్తారు. నేటి సమాజాన్ని, దేశాన్ని కాపాడాలంటే శాస్త్ర, శస్త్రాలు రెండూ ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. బ్రాహ్మణులు ఎల్లప్పుడూ జ్ఞానాన్ని పంచుతూ, ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మంచిని పెం చుతూ సమాజ హితం కోసం పాటుపడ్డారని ఆమె కొనియాడారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, బ్రాహ్మణులను ముందుకు తీసుకెళ్లేందుకు వారి సంక్షేమానికి కట్టుబడి ఉండాలని ఆమె సూచించారు.

### వైద్యవిద్యార్థినిపై పదే పదే లైంగిక దాడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పార్టీ పేరుతో హోటల్‌కు పిలిచి, 18 ఏళ్ల ఎంబీబీఎస్ విద్యార్థినిపై ఒక యువకుడు, అతడి స్నేహితులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ దారుణాన్ని వీడియో తీసి, నెలరోజుల పాటు ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు అత్యాచారం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు. వాయవ్య ఢిల్లీలోని ఆదర్శ్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. హర్యానాలోని జింద్‌కు చెందిన బాధితురాలు ఢిల్లీలో హాస్టల్‌లో ఉంటూ ఎంబీబీఎస్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన 20 ఏళ్ల యువకుడు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరికీ ముందునుంచే పరిచయం ఉంది. సెప్టెంబర్ 9న తన ఇద్దరు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుందామని నమ్మించి బాధితురాలిని హోటల్ గదికి పిలిచాడు. అక్కడ ఆమెకు ఇచ్చిన కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపారు. ఆమె స్పృహ కోల్పోయాక ప్రధాన నిందితుడు అత్యాచారం చేయగా, మిగిలిన ఇద్దరు ఆ దారుణాన్ని వీడియో తీసి, ఆ తర్వాత వారు కూడా లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

### ఎవరెస్టుపై మంచు తుపాను.. చిక్కుకుపోయిన 1000 మంది

**బీజింగ్, అక్టోబరు 6:** ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతం ఎవరెస్టుపై మంచు తుపాను బీభత్సం సృష్టించింది. దీంతో వేల అడుగుల ఎత్తులో దాదాపు 1000 మంది పర్వతారోహకులు మంచు శిఖరంపై చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు స్థానికులతో కలిసి అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. టిబెట్‌లో ఎవరెస్టు పర్వతం తూర్పువాలు వైపు శుక్రవారం సాయంత్రం నుంచి దట్టంగా మంచు కురుస్తోంది. ఆదివారానికి అది మంచు తుపానుగా మారింది. దీంతో దాదాపు 1000 మంది క్యాంప్ సైట్ల వద్ద చిక్కుకుపోయారు.



వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 350 మందిని రక్షించి క్యుడాంగ్ అనే చిన్న టౌన్‌షిప్‌కు తరలించారు. ఎవరెస్టుపైకి వెళ్లే మార్గాల్లో భారీగా మంచు చరియలు పడి దారులు మూసుకుపోయాయి. దీంతో వాటిని తొలగించేందుకు వందలాది మంది స్థానికులు, రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. సాధారణంగా ఈ వైపు నుంచే పర్వతారోహకులు, హైకర్లు ఎక్కువగా ఎవరెస్టు పైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తారు. ఇప్పుడు చైనాలో సెలవులు కావడంతో ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంది. అదే సమయంలో మంచు తుపాను సంభవించడంతో వీరంతా పర్వతంపై చిక్కుకుపోయారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో హైకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది హైకర్లు హైపోథెర్మియా బారిన పడినట్లు రెస్క్యూ బృందం వెల్లడించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శనివారం నుంచి ఎవరెస్టు పైకి వెళ్లేందుకు అనుమతులు నిలిపివేశారు. సాధారణంగా అక్టోబరులో ఈ మంచు పర్వతంపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉంటాయి. మరోవైపు, నేపాల్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే.



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సోమవారం నాడు బద్రీనాథ్‌ను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడి నివాసంలో తేనీరు సేవించిన దృశ్యం

### ద్వారపాలకుల బంగారు తాపడం మాయం!

## సిట్ దర్యాప్తునకు ఆదేశించిన కేరళ హైకోర్టు

**తిరువనంతపురం, అక్టోబరు 6:** కేరళలోని సుప్రసిద్ధ శబరిమల దేవాలయంలోని ద్వారపాలకుల విగ్రహాల బంగారం మాయ మవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. బంగారు పూత పూసిన రాగి పలకల నుంచి బంగారం మాయమవడంపై కేరళ హైకోర్టు తాజాగా సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు విజిలెన్స్ బృందం ఈ విషయంపై తన ప్రాథమిక దర్యాప్తుపై మధ్యంతర నివేదిక సమర్పించిన అనంతరం కేరళ హైకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తును గోప్యంగా నిర్వహించాలని, నివేదికను నేరుగా కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. దీని కోసం స్పెషల్ కమిషనర్ నుంచి కానీ, కోర్టు నుంచి కానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. కానీ ఈ రాగి పలకలు చెన్నైలోని ఓ సంస్థకు చేరేసరికి వీటి బరువు 38.258 కేజీలు మాత్రమే ఉంది. అంటే 4.54 కేజీల బంగారం తగ్గిపోయింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం కూడా వివాదానికి



దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన, వివరణ లేని వ్యత్యాసం అని పేర్కొంది. వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది. 2019లో ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మరమ్మతులు చర్యలు చేపట్టింది. అయితే, వారు స్పెషల్ కమిషనర్‌కు గానీ, కోర్టుకు గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ బంగారు రేకులను తొలగించడం వివాదానికి కారణమైంది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంపై అసెంబ్లీలో కూడా తీవ్రస్థాయిలో వాగ్వాదాలు జరిగాయి. శబరిమలైలో బంగారం మిస్ కావడంపైయుడిఎఫ్ సభ్యులు అసెంబ్లీలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. దీనితో స్పీకర్ ఎఎన్ షంసీర్ సభను రేపటికి వాయిదావేసారు.

## ఎమ్జీఆర్ విగ్రహాం ధ్వంసం

### యధాస్థానంలో ఏర్పాటు చేసిన స్థానికులు

**చెన్నై, అక్టోబర్ 6:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకె వ్యవస్థాపకుడు ఎంజి రామచంద్రన్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మధురై జిల్లా తిరుప్పం కుంద్రం నియోజకవర్గంలోని అవనియాపురంలో ఈ సంఘటన జరిగింది. ప్రసిద్ధ జల్లికట్టు అరేనా సమీపంలో ఉన్న 3.5 అడుగుల ఎంజిఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. పీఠం నుంచి ఆ విగ్రహాన్ని పెకలించడదాన్ని సోమవారం ఉదయం స్థానికులు గమనించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న అన్నా డిఎంకె నేతలు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. కూలిన ఎంజిఆర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై నిరసన తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అవనియాపురం పోలీసులకు పార్టీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ఈ సంఘటనను ఖండించారు. ఎంజిఆర్ కీర్తి, విధానాలను ఎదుర్కోలేని వారు ఈ పిరికి చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# బిసి పిటిషన్‌పై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

## పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ల పిటిషన్‌కు కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్ స్పందిస్తూ సుప్రీం తీర్పు శుభపరిణామమన్నారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని తెలిపారు. 8న హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అన్ని వర్గాలు సహకరించాలని మహేష్‌గౌడ్ కోరారు. బిజెపి, బిఆర్‌ఎస్‌లు చేస్తున్న కుట్రలను బిసిలు అర్థం చేసుకోవాలని అన్నారు. బిసి బిడ్డల నోటి దగ్గర ముద్దను లాక్కోవద్దని హితవు పలికారు. బిఆర్‌ఎస్ నేతలు కుల సంఘ నాయకుని ముద్ర వేసుకుని కోర్టుకు వెళ్తున్నారని తెలిపారు. బిసిల రిజర్వేషన్ల పెంపును అడ్డుకునే ఉత్సాహాన్ని బిసిలు గమని స్తున్నారని మహేష్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతి స్తున్నామని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. హైకోర్టు పిటిషన్‌లో నేను ఇంప్లీడ్ అయ్యాను అంటూ మాజీ పిసిసి అధ్యక్షుడు వి హనుమంతరావు గాంధీభవన్‌లో విలేఖరులకు తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు.

రిజర్వేషన్లు అడ్డుకొని బిసిల పొట్ట కొట్టొద్దని వేడుకొన్నారు సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేష్ అన్నారు. బిసి బిడ్డలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇస్తే కొందరు తట్టుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బిసిలకు రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధిగా ఉందన్నారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ గాంధీభవన్‌లో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు రెట్టించిన ఉత్సాహం తో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మాధవ్ రెడ్డి గోపాల్ రెడ్డి, పిటిషన్ల వెనుక కేటిఆర్ హస్తం ఉందని ఆరోపించారు. 42శాతం రిజర్వేషన్లు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ను సవాల్ చేస్తూ గోపాల్ రెడ్డి సుప్రీంకోర్టు కు పోయాడుసుప్రీంకోర్టు ఆయన పిటిషన్ ను తిరస్కరించిందని సుప్రీంకోర్టు తీర్పు విజయం గా భావిస్తున్నామని అన్నారు. 8వ తేదీన హై కోర్టు తీర్పు కూడా అనుకూలంగా వస్తుందని జోస్యం చెప్పారు. గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన జీవో చట్టబద్ధమైనదని భావిస్తున్నామని అన్నారు.

# టిజిపిఎస్‌సి సభ్యులుగా చంద్రకాంత్‌రెడ్డి, విశ్వప్రసాద్ బాధ్యతల స్వీకారంన

## ప్రమాణం చేయించిన కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపి ఎస్‌సి) సభ్యులుగా కొత్తగా నియమితులైన సి.చంద్రకాంత్ రెడ్డి, విశ్వ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వారితో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం ప్రమాణస్వీకారం చేయించారు. సెప్టెంబర్ 22న ముగ్గురు కొత్త సభ్యులను టిజిపిఎస్‌సి సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 198ని జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో ప్రొఫెసర్ ఎల్‌బి లక్ష్మీకాంత్ రాథోడ్ సెప్టెంబర్ 24న టిజిపిఎస్‌సి సభ్యులుగా బాధ్యతలు తీసుకున్నారు. కాగా మరో ఇద్దరు సభ్యులైన సి చంద్రకాంత్ రెడ్డి, విశ్వ ప్రసాద్‌లు సోమవారం కమిషన్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వారితో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ యాదయ్య, పాలవాయి రజనీ కుమారి, ప్రొఫెసర్ ఎల్‌బి లక్షీ ్మకాంత్ రాథోడ్‌తోపాటు కమిషన్ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు.

# ఎసిబి కస్టడీకి ఎడిఇ అంబేద్కర్

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టయిన విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్‌ను ఎసిబి అధికారులు సోమవారం నాడు తమ కస్టడీలోకి తీసుకున్నారు. శివార్లలోని ఇబ్రహీంబాగ్‌లో ఏడీఈగా పనిచేసిన అంబేద్కర్‌ను ఇటీవలే ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించడం విదితమే. ఈయన ప్రస్తుతం ఇదే జైల్లో వుండగా నాంపల్లి ఎ సిబి కోర్టు అనుమతితో ఎసిబి అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. మొదట ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత నేరుగా బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలోకి తరలించారు. మొదటి రోజు అంబేద్కర్‌ను ఆరు గంటల పాటు విచారించారని తెలిసింది. అంబేద్కర్ 200 కోట్ల రూపాయలకు పైగా అక్రమాస్తులను కూడబెట్టడంతో ఇవన్నీ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై ఎసిబి అధి కారులు దృష్టి సారించారు. అంబేద్కర్‌ను గురువారం వరకు ఎసిబి అధికారులు విచారించనున్నారు.

# ఆర్ట్ గ్యాలరీని సమర్థంగా వినియోగించుకోవాలి

## సాంస్కృతిక కళాసారథి కార్యకలాపాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** పర్యాటక, సాంస్క ృతిక శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు సోమవారం ఆర్ట్ గ్యాలరీ సాంస్క ృతిక కళాసారథి సంస్థల అధికారులతో మాదాపూర్‌లోని ఆర్ట్ గ్యాలరీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్ట్ గ్యాలరీని సమర్థవంతంగా వినియోగిం చుకోవాల్సిన అవసరం ఉందని, దాని నిర్వ హణను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఆర్ట్ గ్యాలరీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చిత్రకారులు, కళాకారులు దీనిని మరింత సద్వినియోగం చేసుకునేలా, కళాప్రియులు, ప్రజలు, పర్యాటకులు ఎక్కువగా సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఈవెంట్లు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. సాంస్క ృతిక కళాసారథుల గురించి మాట్లాడుతూ, వారి వేతనాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాకారుల సేవలకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ ధర్మమని, కళాసారథి కార్యాలయంలో ఉన్న ఆడియో-వీడియో స్టూడియోలో సౌండ్ ప్రూఫింగ్ పనులను తక్షణమే చేపట్టాలని, అందుకోసం అవసరమైన కన్సల్టెంట్ నిపుణుడి సేవలను వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అంతకుముందు మంత్రి జూపల్లి ఆర్ట్ గ్యాలరీ, సాంస్క ృతిక కళాసారథి కార్యాలయాలను సందర్శించారు. ఈ సమీక్షలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మీ,భాషా, సాంస్క ృతిక శాఖ డైరెక్టర్ నరసింహా రెడ్డి, సాంస్క ృతిక కళాసారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

# సిజెఐపై దాడి యత్నానికి సిపిఐ, సిపిఎం, టిఎస్‌యుటిఎఫ్ ఖండన

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బిఆర్ గవాయ్‌పై దాడి ప్రయత్నాన్ని సిపిఐ, సిపిఎం, టిఎస్ యూటిఎఫ్ ఖండించాయి. సీజేఐ బీఆర్ గవాయిపై న్యాయవాదైన కిషోర్‌దాస్ చెప్పు విసిరి దాడి చేయడాన్ని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అతన్ని వెంటనే కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పు లివ్వడం, వ్యాఖ్యానాలు చేసే వైఖరి ఉంటుందన్నారు. కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న వైఖరి వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని జాన్‌వెస్లీ మండిపడ్డారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక శక్తులను అవమానించే ఘటన. కుల అసమానతలు, మతోన్మాద రాజకీయాలు, మూఢ విశ్వాసాన్ని పెంచి పోషించే విధంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తన భావజాలాన్ని వ్యాప్తి చేస్తుందని... గతంలో బీజేపీ నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేశారు. సీజేఐ గవాయ్‌పై దాడి యత్నాన్ని సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె నారాయణ ఖండించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై ఒక న్యాయవాది చెప్పు విసిరిన సంఘటనను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇది ఒక వ్యక్తి తప్పుడు ప్రవర్తన మాత్రమే కాదని.. ఆర్.ఎస్.ఎస్ సిద్ధాంతాలకు చెందిన రైట్‌వింగ్ శక్తులు పెంచిపోషిస్తున్న అసహన సంస్కృతికు ప్రతీక అని మండిపడ్డారు. రాజ్యాంగ సంస్థలను అవమానపరచడం, న్యాయవ్యవస్థను బెదిరించడం లక్ష్యంగా ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నమే ఇదన్నారు. సిపిఐ అభిప్రాయం ప్రకారం, న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఒక స్వతంత్ర స్తంభం. న్యాయమూర్తులపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనన్నారు. జస్టిస్ బి ఆర్ గవాయ్‌పై దాడి ప్రయత్నాన్ని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్ యూటిఎఫ్) తీవ్రంగా ఖండించింది. కుల దురహంకారం, మత అసహనమూ నేడు దేశమంతటా రాజ్యమేలు తున్నాయని, రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల ఏమాత్రం గౌరవం లేని అనాగరిక, అసాంఘిక శక్తులు విచ్చలవిడిగా విజృంభిస్తున్నాయని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మండిపడ్డారు.

# నారాయణపేట ఘటనపై తక్షణమే విచారణ జరిపించాలి

## బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతంరావు

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా, మద్దూర్ మండల కేంద్రంలోని ఓ కంటి ఆసుపత్రి నిర్వాహకుడు రాసిన 17 పేజీల సూసైడ్ నోట్ స్థానికంగా భయాందోళనకు గురిచేసిందని, ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గౌతం రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు ప్రకారం దౌల్తాబాద్ మండలం బోడమర్రి తాండాకు చెందిన రమేశ్ నాయక్ గత నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడం, కుటుంబాన్ని తీవ్ర ఆందోళనలో ముంచిందన్నారు. ఈ దారుణ ఘటనను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా డిజిపి కార్యాలయం సీరియస్‌గా తీసుకుని అన్ని సాక్షాధారాలను సేకరించి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. మద్దూరు నివాసి వర్ద రాంచంద్రయ్య సూసైడ్ నోట్, పాత్లవత్ రమేశ్ నాయక్ వివరాల ప్రకారం, ఈ ఘటనలో ఆత్మహత్యకు ప్రేరేపించడం, శారీరక హింస, మోసం, బ్లాక్‌మెయిల్, కిడ్నాప్, భయపెట్టడం, బలవంతపు మతమార్పిడి (లవ్ జిహాద్), ఎస్సీ/ఎస్టీ దూషణలు, హవాలా/నకిలీ బంగారు నాణేల లావాదేవీలు వంటి తీవ్ర నేరపూర్వక చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటన రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా, ఆర్థిక మోసాలకు పాల్పడేలా ఉంది. కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా హత్యకేసు పరిధిలోకి తీసుకొని విచారణ చేపట్టాలని కోరుతున్నాం. అందుకే, కేసును పారదర్శకంగా, న్యాయపరంగా లోతైన దర్యాప్తు జరిపి, నిందితులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి.

# ఎల్లారెడ్డిలో మైనర్‌ఇరిగేషన్ నిర్లక్ష్యం

## వరదలు సంభవించి తీవ్రనష్టం కలగడానికి బిఆర్‌ఎస్ పాలనే కారణం

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** ఎల్లారెడ్డిలో మైనర్ ఇరిగేషన్ వ్యవస్థలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే వరదలు సంభవించి రైతులు నష్టపోయారని ఎల్లరెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టాన్ని చవిచూసిందని ఆవేదన చెందారు. రైతుల పంటలు మునిగి నాశనం కాగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. ఈ కష్టకాలంలో ప్రజల బాధలో పాలుపంచుకోవాల్సిన సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పార్టీని మట్టికలిపిస్తాం" అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని విమర్శించారు. కష్టాల్లో ఉన్న రైతుల దుఃఖాన్ని రాజకీయ లాభం కోసం వినియోగించడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి నియోజ కవర్గంలో వరదల ప్రధాన కారణం మైనర్ ప్రాజెక్టులు మరియు మైనర్ ఇరిగేషన్ వ్యవస్థల పట్ల గత ప్రభుత్వ నిర్లక్ష్యం. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీష్ రావు చిన్న ప్రాజెక్టుల అభివృద్ధి పట్ల అసలు దృష్టి పెట్టలేదని ఆరోపించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్ సిల్ట్ రిమూవల్, స్ట్రెంథెనింగ్ పనులు సమయానికి చేయకపోవడం వల్లే ఈ వరదలు భారీ నష్టం కలిగించాయని విమర్శించారు. సుమారు 10,000 ఎకరాల పంటలు నష్టపోయాయి. పోచారం ప్రాజెక్ట్ పూర్తిగా కొట్టుకుపోయే పరిస్థితి నుండి మా పోచారం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడి మట్టి సంచులు నింపి, త్రిలింగేశ్వర స్వామి దయతో కాపాడుకున్నారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీష్ రావు చూపిన శ్రద్ధను ఎల్లారెడ్డి ప్రాంతంలోని మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై చూపలేదు. మాజీ ఎమ్మెల్సీ కవిత కూడా కాళేశ్వరం అవినీతి, హరీష్ రావు పాత్ర గురించి బహిరంగంగా వెల్లడించిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు మీరు నన్ను మీ కార్యక్రమానికి ఆహ్వానించి ఉంటే, నేను వచ్చి ఎల్లారెడ్డి ప్రజలకు మీరు చేసిన ద్రోహాన్ని చూపించి ఉండేవాడిని చెప్పారు.

# మాదిగలంటే చులకన భావం సరికాదు

## మంత్రి అడ్లూరిపై పొన్నం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** మంత్రి అడ్లూరి లక్షఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరం అని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలంటే అంతా చులకన భావం ఉండటం ఎంతవరకు కరెక్టో పొన్నం ప్రభాకరే ఆలోచిం చుకోవాల్సిన అసరం ఉందన్నారు. ఇవాళ లక్ష ్మణ్‌ను దున్నపోతు అనాల్సినంత అవసరం ఏముంది? అసలు ఎందుకు అనాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలన్నారు. ఈ విషయంపై తాను పొన్నంకు రెండు సార్లు ఫోన్ చేస్తే ఆయన స్పందించలేదన్నారు.పొన్నం ప్రభాకర్ తనకు మంచి మిత్రుడేనని కానీ మాదిగ మంత్రిని ఎలా ఎందుకు అనాల్సి వచ్చిందని నిలదీశారు.తాము దళితుల సమస్యపై మంత్రి అడ్లూరి వద్దకు వెళ్లామని, పొన్నం వ్యాఖ్యలకు మంత్రి అడ్లూరి కంటతడిపెట్టుకునేంతలా బాధపడుతున్నారని అన్నారు. లక్ష ్మణ్ నిర్వహిస్తున్న ప్రెస్ కాన్ఫరెన్స్ కు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ముందుగా వెళ్లి ఆయన్ను దున్నపోతు అని మాట్లాడటం ఏంటని మండిపడ్డారు. వ్యక్తిగతంగా మాదిగల తరఫున ఈ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన సురేందర్, దామోదర్, మహేష్, భారతి నాలుగు కుటుంబాలకు 50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇటికె రాజు, రాజలింగం, గ్యార శ్రీనివాస్, బొంకూరి సురేందర్, బండారు శ్రీనివాస్, భీమా శంకర్, పొన్నాల యాదయ్య, జనార్ధన్, విష్ణుకుమార్, కావేరి పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు, ఇటికె రాజు తదితరులు

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

## జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు ఉపాధి పని రోజుకు రూ.307 చొప్పున 90 రోజులకు రూ.27,630 ఖాతాల్లో జమ

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కీలక మార్పులు చేసింది. ఉపాధి హామీతో అనుసంధానించి, లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, జాబ్‌కార్డు ఉన్నవారికి 90 రోజుల పని కల్పిస్తుంది. రోజుకు రూ.307 చొప్పున అదనంగా రూ.27,630 అందుతాయి. మరుగుదొడ్డికి రూ.12 వేలు. ఇంటి నిర్మాణ దశల వారీగా పనిదినాలు కేటాయిస్తారు. ఈ చర్యలతో ఇళ్లు వేగంగా పూర్తవడంతో పాటు, పేదలకు అదనపు ఆర్థిక భరోసా లభిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో కీలక మార్పులు చేసింది. లబ్ధిదారులకు తీపికబురు చెబుతూ.. ఈ పథకాన్ని ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీని ద్వారా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయంతో పాటు, జాబ్‌కార్డు కలిగిన లబ్ధిదారులకు అదనంగా 90 రోజుల పని కల్పించనుంది. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయం నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుంది. ఉపాధి హామీ అనుసంధానం ద్వారా, జాబ్‌కార్డున్న లబ్ధిదారులకు రోజుకు రూ.307 చొప్పున కూలీ లభిస్తుంది. ఈ విధంగా గరిష్ఠంగా 90 రోజులకు రూ.27,630 వారి ఖాతాల్లో అదనంగా జమ చేస్తారు. దీంతో పాటు, స్వచ్ఛ భారత్ పథకం కింద మరుగుదొడ్డి నిర్మించుకుంటే మరో రూ.12 వేల ఆర్థిక సహాయం కూడా అందుతుంది.ఉపాధి హామీ కింద కల్పించే 90 రోజుల పనిదినాలను ఇంటి నిర్మాణంలోని దశల ఆధారంగా కేటాయిస్తారు. ఇంటి బేస్‌మెంట్ స్థాయి వరకు 40 రోజులు, లెంటల్ స్థాయి వరకు 30 రోజులు, నిర్మాణం పూర్తయ్యాక 20 రోజుల పనిని కల్పిస్తారు. ఒకవేళ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బేస్‌మెంట్ వరకు పనులు పూర్తయితే.. మిగిలిన పనిదినాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగించేందుకు వెసులుబాటు కల్పించారు. వేతనాల చెల్లింపుల కోసం, నిర్మాణ పనుల్లోని మూడు స్థాయిల్లో లబ్ధిదారుడి చిత్రాలు తీసుకొని వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. నిర్మాణం పూర్తైన తర్వాత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించగానే లబ్ధిదారు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. అయితే ఇందిరమ్మ లబ్ధిదా రులకు ఇంటి నిర్మాణ పనులు మినహా ఇతర ఉపాధి హామీ పనులు కేటాయిం చరాదని స్పష్ట మైన ఆదేశాలు జారీ అయ్యాయి. సెప్టెంబరు 15న వచ్చిన ఆదేశాల మేరకు అధికా రులు పరిశీలించగా.. చాలామంది లబ్ధిదారులకు ఇప్పటికే జాబ్‌కార్డులు ఉన్నట్లు తేలింది. జాబ్ కార్డు లేనివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఆమోదించేలా చర్యలు తీసుకుంటారు. కొత్తగా పెళ్లయిన మహిళకు ఇల్లు మంజూరైతే.. అప్పటికప్పుడు ఎంపీడీవో ద్వారా జాబ్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చర్యలతో ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తవడంతో పాటు, పేద ప్రజలకు అదనపు ఆర్థిక భరోసా లభిస్తుంది.

# రెవెన్యూ భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చండి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** 30 నుంచి 40 సంవత్సరాల నుంచి రెవెన్యూ శాఖ తరపున వివిధ అవసరాల కోసం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుతం వాటి పరిస్థితి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను పలు విభాగాలకు ముఖ్యంగా ఇరిగేషన్, ఫారెస్ట్ శాఖలకు కేటాయించిందని అయితే రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులలో మార్పులు చేర్పులు జరగడం తో పాటు కొన్ని రద్దుకూడా అయ్యాయని ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాలలో అటవీ శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత, అదేవిధంగా అటవీ శాఖ రెవెన్యూ శాఖకు కేటాయించిన భూమి ఎంత అనే వివరాలను రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారుచేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల అటవీ భూమి కేటాయించేందుకు ప్రతిపాదించారని ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కేశవపురం త్రాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1030 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదలాయింపునకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి ,అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, పిసిసిఎఫ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వండి

## ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** హైదరాబాద్, సికిందనాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలోని 179 మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకునేవారికి అవసరమైన సమాచారాన్ని వెంటనే సంబంధిత ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వారు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని, వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం అబ్కారీ భవన్ లో హైదరాబాద్, సికిందరాబాద్ పరిధిలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీములతో సమీక్ష నిర్వహించారు. మద్యందుకాణాలకు సంబంధించిన రిజర్వేషన్లు, రెండేళ్లలో మద్యం సెల్స్ వివరాలను దరఖాస్తు దారులకు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునేవారికి దరఖాస్తుల నమూనాలో ఏరకమైన తప్పిదాలు లేకుండాఎక్సైజ్ సిబ్బంది సహకారం అందించాలన్నారు. దరఖాస్తులు నింపడం పూర్తిచేసిన అనంతరం అబ్కారీ భవన్‌లోని మూడు, నాలుగు అంతస్తుల్లో ఉన్న కౌంటర్‌లో దాఖలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# రిజర్వేషన్లపై కేసులు వేసి బిసిలను అవమాన పరచవద్దు

## ఎంపి ఆర్.కృష్ణయ్య



బిసి భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడు తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో గుజ్జ కృష్ణ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** ఎప్పటికైనా బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కేసులు వేసి తోటి సోదరులైన బీసీలను అవమాన పరచవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు,రాజ్యసభ సభ్యుడి ఆర్.కృష్ణయ్య కోరారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో గోపాల్‌రెడ్డి వేసిన కేసును కొట్టివేసిందన్నారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ మాధవరెడ్డి వేసిన కేసును ఛాలెంజ్ చేస్తూ తాను హైకోర్టులో ఇంప్లీట్ కేసు వేశానని చెప్పారు. సోమవారం బిసిభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.'ఈ కేసు ఈనెల 8న విచారణ రానుంది. మాజీ అడ్వకేట్ జనరల్ ప్రసాద్ వాదించమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు పెంపు జీవో నెంబర్ 9కు బలమైన ఆధారాలు ఉన్నాయి. రాజ్యాంగపరంగా, చట్టపరంగా, న్యాయపరంగా బలమైన ఆధారాలు ఉన్నాయి.గతంలో 1990లో మండల కమిషన్ ఉద్యమం సందర్భంగా రిజర్వేషన్లను వ్యతిరేకించిన వారికి ఏ గతి పట్టిందో ఒకసారి చరిత్ర చూసుకోవాలి. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని తరిమి తరిమి కొట్టారు. గ్రామాలలో కూడా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని గ్రామాల నుంచి వెళ్ళగొట్టారు. అనవసరంగా రిజర్వేషన్లను వ్యతిరేకించి గ్రామాలలో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి-6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారు. జనాభా లెక్కలు తీసి న్యాయ బద్ధం చేశారు. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారు"అన్నారు. 'జనాభా లెక్కలు ఉన్నవి. అసెంబ్లీ చట్టం చేశారు. అలాగే సుప్రీం కోర్టు అగ్రకులకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50 శాతం సీలింగ్ ఎత్తివేసింది. పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50 శాతం సీలింగ్‌ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు అభిప్రాయం కూడా ఉన్నది. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చింతల్‌లో చదరపు గజం భూమి రూ. 1.14 లక్షలు

## హౌసింగ్ బోర్డుకు రూ.44.24 కోట్ల మేర ఆదాయం

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో మరోసారి రికార్డు స్థాయి ధరలకు కొనుగోలు చేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్ లోని నివాస భూముల విక్రయాల నిమిత్తం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో చదరపు గజం భూమి ధర రూ.1,14,000 (లక్షా పద్నాలుగు వేలు) పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ ఐజి ఓపెన్ ప్లాట్ కు ఆఫ్ సెట్ ప్రైజ్ గా రూ.80 వేలు నిర్ధారించగా బహిరంగ వేలంలో చ.గజం రూ. 1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు.వాచ్ ఐ జి లోనే మరో 389 చ.గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ ను చదరపు గజానికి లక్ష రూపాయల ధర పలికిందన్నారు.సోమవారం మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.44.24 కోట్ల మేర ఆదాయం వచ్చింది.27 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో చదరపు గజానికి సగటున రూ.91,947 ధరకు కొనుగోలు చేశారని ఆయన తెలిపారు.కెబిహెచ్ బి ,గచ్చిబౌలి పరిసరాల్లోని భూములకే అధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చింతల్ ప్రాంతంలో కూడా చదరపు గజం ధర లక్ష రూపాయలు దాటడం విశేషం.నగరంలోని అన్ని ప్రాంతాల్లో నివాస భూములకు మంచి డిమాండ్ ఉందనడానికి ఇది నిదర్శన మంటున్నారు.



## ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను పరామర్శించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు6:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం బెంగళూరుకు వెళ్లారు. ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను పరామర్శిం చేందుకు సిఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు, సుప్రీంకోర్టులో విచారణ అంశాలు ఖర్గేతో సిఎం రేవంత్ చర్చించినట్టుగా తెలిసింది. ఇటీవల ఏఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆయన బెంగళూరులోని ప్రఖ్యాత ఎంఎస్ రామయ్య ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొంది డిశ్చార్ అయ్యారు. ఖర్గే శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో బాధపడుతుండగా ఆయన గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు వైద్యులు పేస్ మేకర్ ఇంప్లాట్ సర్జరీ చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలతో ఆయనను పరామర్శించేందుకు సిఎం బెంగళూరుకు వెళ్లారు. తిరిగి రాత్రి 10.30 గంటలకు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు సిఎం రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చారు.

## సిజెఐపై దాడి ఘటనకు మంత్రి సీతక్క ఖండన

**హైదరాబాద్,అక్టోబర్ 6, ప్రభాతవార్త :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి ఘటనను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. ఇది క్షణికావేశంలో జరిగిన దాడి కాదని, పథకం ప్రకారం కుట్రపూరితంగా చేసిన దాడి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్ అని, దాని ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టే అని ఆమె పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిపై దాడి చేయడం భారత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఇలాంటి దాడులు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీతక్క డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం మన అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను ప్రసాదించిందని, ఆ విలువలను కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు.

### దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసిన ఘటన: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ గవాయ్‌పై దాడి, దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసిన ఘటన అని ఎస్సి, ఎస్టి, మైనారిటీ సంక్షేమ శాఖలమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన దేశ న్యాయవ్యవస్థ గౌరవాన్ని అవమానపరచే దుష్టచర్యగా అభివర్ణించారు. భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిన పత్రం అని, ఆ రాజ్యాంగాన్ని కాపాడే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. న్యాయవ్యవస్థపై దాడి అనేది ప్రజాస్వామ్య పునాదులపై దాడితో సమానమన్నారు. దేశానికి మార్గదర్శకులైన న్యాయమూర్తుల భద్రతకు భంగం కలిగించడం అసహ్యాకరమైన చర్య అని మంత్రి పేర్కొన్నారు. దేశ గౌరవం, న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతినేలా చేసే ప్రయత్నాలను కఠినంగా అణచివేయాలని మంత్రి అడ్లూరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న పలువురు అధికారులు

## సామర్థ్యాల బలోపేతానికి రిఫ్రెషర్ శిక్షణ

### విద్య, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళితంపై దృష్టి

**హైదరాబాద్ (అత్తాపూర్) అక్టోబరు6,ప్రభాతవార్త:** రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ జాతీయ సంస్థ (ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్), నీతి ఆయోగ్ సహకారంతో, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సోమవారం ఎన్ఐఆర్‌డిపిఆర్‌జి డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్ ప్రారంభించారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ మాట్లాడుతూ 2023లో నీతి ఆయోగ్ ప్రారంభించిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్, దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాక్‌లను కన్వర్జెన్స్, డేటా ఆధారిత, గుర్తించబడిన 40 సూచికలలో సంతృప్త విధానంతో కేంద్రీకరించడం ద్వారా మార్చడం లక్ష్యంగా పెట్టుకుందని కీ పెర్ఫార్మింగ్ ఇండికేటర్స్ సంతృప్తతను సాధించే దిశగా పురోగతిని వేగవంతం చేయడానికి బ్లాక్ లెవల్ ఆఫీసర్లు, ఇతర కీలక కార్యకర్తల సామర్థ్యాలను బలోపేతం చేయడానికి రిఫ్రెషర్ శిక్షణ రూపొందించబడిందని ఎన్ఐఆర్‌డిపిఆర్ ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమ్మిళిత అనే ఐదు ముఖ్యమైన రంగాలపై దృష్టి సారించి ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నెల 6న తొమ్మిది వేదికల్లో ఒకేసారి ప్రారంభమై నవంబరు 20 వరకు కొనసాగుతుంది. ప్రారంభ సెషన్‌లో, ఎన్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ దార్శనికతను క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలలోకి అనువదించడంలో ఫీల్డ్ ఫంక్షనరీల కీలక పాత్రను నొక్కి చెప్పారు. ఆయా బ్లాక్‌లలో విశేషమైన విజయాలు సాధించడానికి పాల్గొన్న అధికారుల మునుపటి ప్రయత్నాలను అభినందించారు.

## ఎప్‌సెట్ బైపిసి కౌన్సెలింగ్‌కు 11,224 మంది దరఖాస్తు

### నేటి నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఎప్ సెట్-2025 ద్వారా.. బి ఫార్మసీ, ఫార్మా-డి, బయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి కౌన్సెలింగ్‌ను ఆదివారం నుంచి ప్రారంభించగా.. ఇప్పటి వరకు 11,224 మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను అప్‌లోడ్ చేస్తూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ఈ నెల 8 వరకు అవకాశం కల్పించారు. నేటి(మంగళవారం) నుంచి 9 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 8 నుంచి 10 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 13లోపుగా మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 13, 14 తేదీల్లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

# పత్తి కొనుగోళ్లలో తొలగిన ప్రతిష్టంభన

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త :** పత్తి కొనుగళ్లకు సంబంధించిన ఏర్పడిన ప్రతిష్టంభన తొలగిపోయిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పత్తి రైతులకి ఇబ్బంది కలగకుండా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. హైదరాబాద్ సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జిన్నింగ్ మిల్లర్లు నష్టపోకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఇక్కడ కూడా జిన్నింగ్ మిల్లర్లు వెంటనే టెండర్లలో పాల్గొని జాప్యం లేకుండా కొనుగోళ్ల ప్రారంభించాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలిగే చర్యలను ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. మార్గదర్శకాల విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించడానికి స్వతంత్ర ఏజెన్సీ ద్వారా తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు ఈ లోపు మొబైల్ యాప్ మరియు స్లాట్ బుకింగ్ యాప్ పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు సిసిఐతో సమన్వయం చేసుకుని రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.

**ఆయిల్ ఫామ్ హబ్‌గా తెలంగాణ**

పామాయిల్ హబ్‌గా తెలంగాణ మారాలని మంత్రి తుమ్మల అన్నారు. మరో సమావేశంలో మాట్లాడుతూ ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా ఆయిల్ ఫెడ్, ప్రైవేట్ ఆయిల్ ఫామ్ కంపెనీలు పనిచేయాలని చెప్పారు. ఆయిల్ ఫామ్ సాగుపై కంపెనీల నిర్లక్ష్యం సరికాదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 2.72 లక్షల ఎకరాల్లో 73,696 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారని వెల్లడించారు. వచ్చే మూడు సంవత్సరాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పది లక్షల ఎకరాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తోటల యాజమాన్యం పై అన్ని కంపెనీలు దృష్టి పెట్టాలని కొత్త తోటల గెలలు దిగుబడులు తగ్గకుండా పర్యవేక్షణ చేయాలని, నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని సూచించారు.



## స్వాజిలాండ్ రాజుగారి వైభోగమే వేరు

### 15 మంది భార్యలు, 35 మంది సంతానం

### ప్రైవేటు జెట్‌లో దుబాయి పర్యటన!

**దుబాయి, అక్టోబరు 6:** ఆయనో చిన్నదేశానికి రాజు ఆదేశం కటిక దరిద్రంలో అల్లాడిపోతుంటే ఆ రాజుగారి ఆస్తులు మాత్రం 100 కోట్లడాలర్లకు ఎక్కడా తగ్గలేదు. ఆయనకు 15 మంది భార్యలు, వారికి 35 మంది సంతానంఆయన ఫారిన్‌ట్రిప్‌కు వస్తే ప్రత్యేక విమానంలో రావాల్సిందే. ఆయనే ఆఫ్రికా ఖండంలోని చిన్నదేశం ఎస్వాటిని అంటే ఇపుడు స్వాజిలాండ్‌గా పిలుస్తున్న దేశానికి రాజుగా కొనసాగుతున్నారు. రాజు ఎంస్వాటి-3 దుబాయి ఎయిర్‌పోర్టులోకి రాగానే భారీ కోలాహలం నెలకొంది. ఆయనకున్న సంతానం, భార్యలను చూసి దుబాయి ప్రముఖులు సైతం విస్తుపోయారు. సాంప్రదాయ చిరుతపులి చర్మం డిజైన్‌లో ఉన్న దుస్తులు రాజు ధరిస్తే ఆయన మహారాణులు మాత్రం రంగురంగులాఫ్రికన్ దుస్తులతోమెరిసిపోయారు. రాయల్ కాన్వాయ్ కోసం మూడు టెర్మినళ్లను విమానాశ్రయ అధికారులు నిలిపివేసారు. భద్రతా కారణాలపై ప్రత్యేక ఏర్పాట్లుచేసారు. 1986లో బాధ్యతలు స్వీకరించిన ఎంస్వాటి-3 రాజు ప్రపంచంలోనే ధనికరాజుల్లో ఒకరు. ఎంస్వాటి తండ్రి సొభుజా-2 కూడా తక్కువేమీ కాదు. ఆయనకు 125 మంది భార్యలు, 210 మంది పిల్లలకు తండ్రిగా రికార్డుసాధించారు. ఏటా రిగే 'రీడ్ డ్యాన్స్' అనే శతాబ్దాలనాటి పురాతన సాంప్రదాయ ఉత్సవంలో కొత్త భార్యను రాజు ఎంచుకుంటారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఐసియులో ప్రమాదం

### అగ్నికి ఆరుగురు ఆహుతి, మరో ఐదుగురికి సీరియస్

**జైపూర్, అక్టోబరు 6:** రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ (ఎస్ఎంఎస్) ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం తెల్లవారు జామున ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఆరుగురు అగ్నికి ఆహుతి అయ్యారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దుర్ఘటన విషాదం నింపుతోంది. ఈ ప్రమాదం ఆసుపత్రిలోని ట్రామా సెంటర్ రెండవ అంతస్తు న్యూరో ఐసీయూ వార్డులో జరిగినట్టు చెబుతున్నారు. స్టోర్‌రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి.. కొన్ని క్షణాల్లోనే వేగంగా వ్యాపించాయని చెబుతున్నారు. మంటలకు ఫైళ్లు, రక్త నమూనా గొట్టాలు, వైద్య పరికరాలు, మంచాలు పూర్తిగా కాలిపోయాయి. ట్రామా సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ అనురాగ్ ధాకడ్ మాట్లాడుతూ.. మంటలు చెలరేగిన వెంటనే విద్యుత్ వ్యవస్థలు పనిచేయకపోవడంతో ఆక్సిజన్ సరఫరా ఆగిపోయిందని అన్నారు. రోగులు ఇప్పటికే కోమాలో ఉండటంతో పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. ప్రమాదం సమయంలో ట్రామా సెంటర్‌లోని రెండు ఐసీయూల్లో కలిపి 24 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వారిలో 11 మంది ట్రామా ఐసీయూలో, 13 మంది సెమీఐసీయూలో ఉన్నారని డాక్టర్ అనురాగ్ వివరించారు. మరణించిన వారిలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. గాయపడిన బాధితుల్లో కొందరికి శ్వాస సమస్యలు మరికొందరికి తీవ్రమైన కాలిన గాయాలు ఉన్నాయన్నారు. వారిని ప్రస్తుతం ఆసుపత్రిలోని ప్రత్యేక వార్డుకు తరలించి, మెరుగైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇక సమాచారం అందిన వెంటనే ఫైర్ సర్వీస్ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. మొత్తం ఐదు ఫైరింజన్లు, పది మంది అగ్నిమాపక సిబ్బంది సుమారు ఒక గంట పాటు ప్రయత్నించి మంటలను అదుపులోకి తెచ్చారు.

## ఎర్రకోటను మసకబారుస్తున్న ఢిల్లీ కాలుష్యం!

### కట్టడం పటిష్టతకు ముప్పు - నిపుణుల హెచ్చరిక

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశ రాజధాని ఢిల్లీకి తలమానికంగా నిలిచే చారిత్రక ఎర్రకోట తన సహజ సౌందర్యాన్ని కోల్పోయే ప్రమాదంలో ఉంది. నగరంలోని తీవ్ర వాయుకాలుష్యం కారణంగా 17వ శతాబ్దపు ఈ అద్భుత కట్టడం తన ఎర్రటి రంగును కోల్పోయి నల్లగా మారుతోంది. భారత్, ఇటలీ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలోని విషపూరిత గాలి ఎర్రకోట రాతి గోడలను రసాయనికంగా దెబ్బతీస్తోందని ఈ పరిశోధన తేల్చి చెప్పింది. వాహనాల పొగ, పరిశ్రమలు, నిర్మాణ రంగం నుంచి వెలువడే ధూళి కణాలు గాలిలో కలిసి కోట గోడలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల బ్లాక్ క్రస్ట్స్ ఏర్పడుతున్నాయి. ఈ పొరలలో జిప్సం, క్వార్ట్జ్‌తో పాటు సీసం, రాగి, జింక్ వంటి ప్రమాదకరమైన భార లోహాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2021 నుంచి 2023 వరకు సాగిన ఈ అధ్యయన వివరాలను జూన్ 2025లో హెరిటేజ్ అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించారు. ఈ నల్లటి పొరలు కేవలం కట్టడం రంగును మార్చడమే కాకుండా, దాని పటిష్టతను కూడా దెబ్బతీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను ఇలాగే వదిలేస్తే, గోడలపై ఉన్న సున్నితమైన, అపురూపమైన శిల్పకళ శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రకోటకే కాకుండా ఢిల్లీలోని హుమాయూన్ సమాధి వంటి ఇతర చారిత్రక కట్టడాలకు కూడా భవిష్యత్తులో ఇదే ముప్పు పొంచి ఉందని అధ్యయనం స్పష్టం చేసింది.



## ఆర్టీఐ నూతన లోగోను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు6:** 20వ జాతీయ ఆర్టీఐ(రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్) వారోత్సవాల సందర్భంగా సోమవారం రాష్ట్ర సమాచార కమిషన్ బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఆర్టీఐ నూతన లోగోను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పివి శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, మెర్ల వైష్ణవిలు ఉన్నారు.

## అత్తను హతమార్చిన కోడలు

### అనుమానం రాకుండా అంత్యక్రియలకు ఏర్పాట్లు

**వనపర్తి క్రైమ్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో నేరాలు పలు విధాలుగా చేయబడుతున్నవి అలాంటి వాటిలో ఒకటైన అత్తను హతమార్చిన కోడలు ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. డిఎస్పి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం సుమారు ఒంటిగంట సమయంలో నిందితురాలైన దొడ్డి బొగురమ్మ తన అత్త దొడ్డి ఎల్లమ్మను రోజువారీ ఖర్చులకు కోడలిని పదేపదే డబ్బులు అడుగుతూ విసిగిస్తుందనే నెపంతో ఇంటి చుట్టుపక్కల ఎవరు లేని సమయంలో చేతి కర్రతో కోడలు దొడ్డి బొగురమ్మ దాడి చేసి ఇంట్లో ఉన్న ఇనుప పెంకుతో బలంగా తన అత్త తలపై కొట్టింది. స్పృహ కోల్పోయిన అత్త మంచంపై విగత జీవిగా పడిపోయింది. ఎల్లమ్మ చనిపోయిందని నిర్ధారించుకొని ఈ విషయం ఎవరికీ తెలియకుండా మృతురాలి ఒంటిపై ఉన్న రక్తపు మరకలను శుభ్రం చేసి బంధువులకు కుటుంబ సభ్యులకు అత్త ఎల్లమ్మ సహజంగా మరణించిందని నమ్మ పలికింది. ఆదివారం అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తున్న క్రమంలో మృతురాలి కుమార్తెలు తమ తల్లి ఒంటిపై రక్తపు గాయాలను చూసి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టగా అత్తను తానే హత్య చేశానని ఒప్పుకున్నట్లు వెంకటేశ్వరరావు వెల్లడించారు.

## నేడు అంబేద్కర్, ఫూలే విగ్రహాల ఎదుట బసిలు గళం విప్పాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 6, ప్రభాతవార్త:** బిసిల రిజర్వేషన్‌లపై రెడ్డి జాగృతి సంస్థ హైకోర్టులో వేసిన ఫిటిషన్‌ను 24 గంటల్లోగా విరమించుకోవాలని, లేని పక్షంలో రాజకీయ శత్రువుగా పరిణించవలసి వస్తుందని, వచ్చే 2028 ఎన్నికల్లో ఒక్కరిని కూడా గెలవనీయబోమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కోర్టుల్లో ఫిటిషన్లు వేస్తూ బిసిలను రాజ్యాధికారంలోకి రానీయకుండా రెడ్డి సామాజిక వర్గం కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. బిసిలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం, ప్రజా పోరాటం నిర్వహిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తక్కువ జనాభా ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తే చట్టబద్దత ఉన్నట్లు, బిసిల జనాభాకు తగ్గించి 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తే చట్ట విరుద్దమంటున్నారని, ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. బిసి బిల్లుపై రాష్ట్ర గవర్నర్ సంతకం పెట్టకపోవడం రాజ్యాంగ విరుద్దమని, ప్రజలతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నారని, తక్షణమే సంతకం పెట్టాలని కోరారు. లేని పక్షంలో గవర్నర్ బిసిల వ్యతిరేకిగా ముద్రపడుతుందని జాజుల అన్నారు. బిసిల హక్కులను అడ్డుకోవడమే గవర్నర్ పని అయితే తాము న్యాయం కోసం చివరి వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ నెల 8వ తేదీన హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ అంతటా బిసిలు పూలే, అంబేద్కర్ విగ్రహాల ఎదుట గళం విప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## బిసి రిజర్వేషన్లపై అన్ని పార్టీలు ఏకం కావాలి

### సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం

**హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త:** సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బీసీల రిజర్వేషన్ల పెంపు పై పార్టీలన్నీ జెండాలు వదిలి ఒక్కతాటిపై రావాలని వక్తలు అన్నారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సామాజిక తెలంగాణ ఇంటలెక్చవల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జస్టిస్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీమనోహర్, దేవుళ్ల సమ్మయ్య తదితరులు

చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీ మనోహర్, సమ్మయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యమనాయకులు బత్తుల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో ల ద్వారా బీసీలకు రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదని చట్టం చేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. భౌగోళిక తెలంగాణ నుంచి సామాజిక తెలంగాణ వైపు నడవాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్‌పై విరక్తి ప్రభావంతో గెల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలోని కామారెడ్డి బి.సి. డిక్లరేషన్ అమలు విషయంలో పూర్తి నిర్లక్షం వహించిందన్నారు.

ప్రధానంగా కులగణన జరిగిన తీరు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమీషన్ పని తీరుతెన్నులు, తదుపరి సర్వేపై నిపుణుల కమిటీ మొదలగు అన్ని స్థాయిల్లో ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా, పూర్తి చిత్తశుద్ధితో వ్యవహరించినట్లు నిరూపించుకోలేక పోయిందన్నారు. అదే విధంగా ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో, అందులో 42 శాతం బిసి రిజర్వేషన్ విషయంలో తీసుకున్న చర్యలు లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఒక వైపు జాప్యం, మరో వైపు న్యాయ స్థానాలు జోక్యం చేసుకునే పరిస్థితులేర్పడ్డాయన్నారు. హైకోర్టు ముందు, ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు కులగణన సర్వే నివేదిక, డెడికేటెడ్ కమీషన్ నివేదిక, నిపుణుల కమిటీ నివేదిక ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు.



డిజిపితో భేటీ అయిన పోలీసు క్లస్టర్ రెజ్లింగ్ క్లస్టర్ జట్ల సభ్యులు

## డిజిపితోపోలీసు క్లస్టర్ రెజ్లింగ్ క్లస్టర్ జట్ల సభ్యుల భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు క్లస్టర్ రెజ్లింగ్ క్లస్టర్ జట్ల సభ్యులు సోమవారం డిజిపి శివధర్ రెడ్డిని కలిశారు. ఈ జట్లలో వ్రెస్లింగ్, ఆర్మ్ వ్రెస్లింగ్, బాక్సింగ్ క్రీడాకారులు వున్నారు. గత సెప్టెంబర్ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు హరియాణాలోని మధుబన్ లో 74వ అఖిల భారత పోలీసు వ్రెస్లింగ్ క్లస్టర్ ఛాంపియన్ షిప్ జరిగింది. వ్రెస్లింగ్ జట్టు నుంచి పాల్గొన్న రాచకొండ కానిస్టేబుల్ జస్వంత్ కాంస్య పతకం గెలుపొందారు. ఆర్మ్ వ్రెస్లింగ్ మహిళా కేటగిరిలో మహబూబ్‌నగర్ జిల్లా కానిస్టేబుల్ రాధిక కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐజి రమేష్‌తో పాటు కోచ్‌లు కూడా పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ కోసం భూములు లాక్కుంటే ప్రతిఘటన

### హెచ్‌ఎండిఎ కార్యాలయం వద్ద భూనిర్వాసితుల ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల అనుమతి లేకుండా భూమిని తీసుకుంటే ముఖ్యమంనరతి ఇంటిని ముట్టడిస్తామన్నారు. గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్‌పై ప్రభుత్వం తన వైఖరి ప్రకటించకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై సోమవారం హైదరాబాద్లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) ధర్నా నిర్వహించింది. ధర్నాలో నిర్వాసితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలైన్‌మెంట్ మార్పు, భూసేకరణకు వ్యతిరేకంగా భూనిర్వాసితులు నినాదాలు చేశారు. ఈసందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. 2013 చట్టంలోని షెడ్యూల్ 1లో చూపిన విధంగా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల యాజమానులు, ధనికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే అలైన్‌మెంట్ ప్రభుత్వం మార్పులు చేస్తుందని విమర్శించారు. పేదల భూముల నుంచే వెళ్లేలా అలైన్ మెంట్ మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్‌మెంట్‌ను మారుస్తున్నారని విమర్శించారు, పోలీసులను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు ప్రకటించి హద్దులు పెడుతున్నారని అన్నారు. ఎకరా రూ.10 కోట్లు, రూ. ఐదు కోట్లు ఉంటే ప్రభుత్వం రూ. పది లక్షలు, రూ.16 లక్షలు, రూ.20 లక్షలు పరిహారం ఇస్తున్నదన్నారు. రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి తీసుకున్నా సహించేది లేదన్నారు. గ్రామసభలు జరిపి రైతుల ఆమోదం ఉంటేనే తీసుకోవాలని జాన్‌వెస్లీ రాష్ట్ర సర్కార్‌ని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్ తర్వాత రింగ్ రైలు వస్తుందంటున్నారనీ, దానికోసం భూసేకరణ అవసరమవుతుందని వివరించారు. ఆ భూములన్నీ వ్యవసాయ యోగ్యమైనవనీ, పంటలు పండుతాయని అన్నారు. రైతులతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, రాష్ట్ర




కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, బి ప్రసాద్, కొండమడుగు నర్సింహ్మా, ప్రజాసంఘాల నాయకులు కోట రమేష్, ఎం శోభన్‌నాయక్ పాల్గన్నారు.

### పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో విషాదం

## ఎసిపి గుండెపోటుతో మృతి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), అక్టోబరు 6, ప్రభాతవార్త:** పుష్ప2 తొక్కిసలాట ఘటనపై ఏకంగా హీరో అల్లు అర్జున్‌పై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టి వార్నింగ్ ఇచ్చిన ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. సుదీర్ఘ కాలం పాటు డిపార్ట్మెంట్లో వివిధ హోదాల్లో ఆయన కొనసాగారు. తలపై మూడు సింహాలే దైవం నమ్మి నిరంతరం ప్రజా సేవ, ప్రజల భద్రత కోసం నిత్యం కృషి చేసిన వ్యక్తి విష్ణుమూర్తి అని సహచరులు కొనియాడారు. కాగా, హైదరాబాద్ లోని తన నివాసంలో ఆదివారం రాత్రి విష్ణుమూర్తి గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. పోలీసు శాఖలో ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ




ఎసిపి సబ్బతి విష్ణుమూర్తి(ఫైల్)

పలువురు ఆయనకు నివాళులర్పిస్తున్నారు. నాడు ప్రెస్‌క్లబ్‌లో అల్లుఅర్జున్‌పై పెట్టిన ప్రెస్‌మీట్‌లో ఏసీపీ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. డబ్బు మదంతో బడాబాబులు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ముద్దాయిగా ఉన్న అల్లు అర్జున్ వ్యక్తి ప్రెస్మీట్ పెట్టి తన తప్పేం లేదని చెబుతున్నాడని కామెంట్ చేశారు. పోలీసులనే బద్నాం చేస్తూ ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నాడని ఆరోపించారు. తన పని రాజ్యాంగానికి, చట్టానికి లోబడి ఉందో.. లేదో ముందు తెలుసుకోవాలని, పాలు తాగే పిల్లవాడు అల్లు అర్జున్ కాదని విష్ణుమూర్తి అన్నారు. అల్లు అర్జున్ తన పరిధిని దాటి మాట్లాడకూడదని కామెంట్ చేశారు. ఒకవేళ పరిధి దాటి ప్రవర్తిస్తే ప్రజలు ఇబ్బంది పడతారని ఫైర్ అయ్యారు. అర్జెంట్ ఉంది కాబట్టి బందోబస్తు కావాలంటే సాధ్యం కాదని.. ప్రొసీజర్ ప్రకారమే వెళ్లాలని చెప్పామని అన్నారు. కాగితం ఇచ్చి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పి వెళ్లిపోతే అయిపోతుందా.. తమకు రూల్స్ ఉండవా..? అని ప్రశ్నించారు. పోలీసులను బూతులు తిడుతున్నారని, రాజకీయ నేతలు నోరు జారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బందోబస్తులో ఉంటే తాము ఒక్క 10 నిమిషాలు వదిలేసిపోతే సెలబ్రెటీల బతుకులు ఆగమైతాయనే విషయాన్ని గుర్తుంచుకోలన్నారు. తాము మనుషులమేనని, తమకు ఆకలి, దప్పిక, ఫ్యామిలీ ఉంటుందని విష్ణుమూర్తి ఆ సమావేశంలో చెప్పుకొచ్చారు.

# 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ మూవీ..!




**రెబల్ స్టార్ ప్రభాస్**

"రాజా సాబ్" ట్రైలర్ కు బ్లాక్ బస్టర్ రెస్పాన్స్, ఇక మిగిలింది బాక్సాఫీస్ రికార్డ్స్ వేటే ఒబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా మూవీ "రాజా సాబ్" ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఈ సినిమా మీద అప్పటికే స్కై రేంజ్ ఎక్స్ పెక్టేషన్స్ ఉండగా..ట్రైలర్ రిలీజ్ తర్వాత ఈ అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. ట్రైలర్‌లో రెండు డిఫరెంట్ షేడ్స్ లో ప్రభాస్ కనిపించిన తీరు రెబల్ ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసింది. టెర్రిఫిక్ రాజా సాబ్ క్యారెక్టర్ తో పాటు వింటేజ్‌లుక్‌లో ప్రభాస్ వెర్సటైల్‌గా కనిపించి ఆకట్టుకున్నారు.రాజా సాబ్ ట్రైలర్‌లో కనిపించిన వరల్డ్ క్లాస్ మేకింగ్ క్వాలిటీ పీపుల్

## 'రాజాసాబ్' ట్రైలర్‌కు బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్

మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ స్టాండర్డ్స్ ను చూపించింది. దర్శకుడు మారుతి ప్రభాస్ తో వన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ అనిపించే సినిమా రూపొందించినట్లు రాజా సాబ్ ట్రైలర్ ప్రూవ్ చేస్తోంది. తనకు ఇష్టమైన రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో తన ఫేవరేట్ హీరో ప్రభాస్ ను మారుతి వెర్సటైల్‌గా చూపించారు. తమన్ బీజీఎంలోని వేరియేషన్స్ రాజా సాబ్ ట్రైలర్ కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి.ముగ్గురు హీరోయిన్స్ మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ రాజాసాబ్‌కు కావాల్సినంత గ్లామర్ ను యాడ్ చేస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి9న థియేటర్స్ లోకి రాబోతున్న రాజా సాబ్ కోసం టాలీవుడ్ బాక్సాఫీస్ ఎదురుచూస్తోంది. ప్రేక్షకులతో పాటు ట్రేడ్ వర్గాల్లోనూ రాజా సాబ్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులు రాజాసాబ్ ను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేందుకు వెయిట్ చేస్తున్నారు .

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్** హీరోగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన అవైటెడ్ చిత్రం 'ఓజి". మన తెలుగు సినిమా నుంచి ఎలాంటి ఓపెనింగ్స్ అందుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఒక్క సరైన సినిమా పడితే పవర్ స్టార్ పవర్ ఏంటో చూపించిన సినిమా ఇది. ఇలా 150 కోట్లకి పైగా ఓపెనింగ్స్ తో మొదలైన మోత ఇపుడు టాలీవుడ్‌లో ఈ ఏడాది హైయెస్ట్ గ్రాసర్ గా నిలిచి దుమ్ము లేపింది. దీనితో ఓజి చిత్రం




భారీ గ్రాసర్ గా ఇప్పుడు నిలిచింది అని చెప్పాలి. ఈ ఏడాదిలో తెలుగు నుంచి బిగ్గెస్ట్ గ్రాసర్ గా 303 కోట్లకి పైగా గ్రాస్ తో వెంకీ మామ సంక్రాంతికి వస్తున్నాం నిలిచింది.

మరి దానిని క్రాస్ చేసి ఓజి సరికొత్త గ్రాసర్ గా నిలిచి అదరగొట్టింది అని మేకర్స్ నుంచి వచ్చిన అప్డేట్ తో కన్ఫర్మ్ అయ్యింది.లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ ఓజీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రెస్పాన్స్ అందుకుందో అందరికీ తెలిసిందే.

పవర్ స్టార్‌ను ఎలాగైతే చూడాలని అభిమానులు కోరుకున్నారో అలాగే చూపెట్టాడు దర్శకుడు సుజీత్. ఇక ఓజీతో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల సునామీ సృష్టించాడు పవన్ కళ్యాణ్.

11 రోజుల ముగిసే సరికి ఈ మూవీ వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.308 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు కలెక్ట్ చేసినట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. దీంతో ఈ సినిమా రూ.300 కోట్ల క్లబ్‌లోకి అధికారికంగా ఎంట్రీ ఇచ్చింది. ఈ వసూళ్లతో 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ తెలుగు సినిమాగా ఓజీ సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.

పవన్ పవర్‌ఫుల్ యాక్షన్‌కు థమన్ సాలిడ్ సంగీతం అండగా నిలిచింది. ఇమ్రాన్ హాష్మి, ప్రియాంక మోహన్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రొడ్యూస్ చేశారు .

# తెర



## డైట్ పై రాశి ఖన్నా క్రేజీ కామెంట్స్ !

గ్లామర్ హీరోయిన్ రాశిఖన్నా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పింది. ముఖ్యంగా తాను గతంలో లావు ఉండేదాన్ని అని ఆమె తెలిపింది. ఈ విషయం గురించి రాశిఖన్నా ఇంకా మాట్లాడుతూ.,చిన్నప్పట్నుంచి నాకు ఫుడ్ అంటే ఇష్టం. పరాఠా, మఖాన్ బాగా తినేదాన్ని. అందుకే లావుగా ఉండేదాన్ని. సినిమాల్లోకి వచ్చిన తర్వాత స్క్రీన్‌పై అందంగా కనిపించాలి. మొదట్లో నాకు ఇది అర్థం కాలేదు. ఆ తర్వాత అర్థమైంది అని రాశి ఖన్నా తెలిపింది.రాశి ఖన్నా ఈ విషయం గురించి ఇంకా మాట్లాడుతూ,నాకు నేనే లావుగా కనిపించాను. తగ్గాలని నిర్ణయించుకున్నాను. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మెల్లగా తగ్గాలనుకున్నాను. జిమ్ కు వెళ్లడం ప్రారంభించాను. ఇప్పుడు నా జీవితంలో జిమ్ ఓ భాగమైపోయింది. ఐతే, స్లిమ్ గా మారే క్రమంలో నేను డైట్ మార్చలేదు. చిన్నప్పట్నుంచి ఏవి తింటున్నానో, వాటినే ఇప్పుడు కూడా తింటున్నానని, కానీ అన్నీ కొంచెం కొంచెం తింటున్నానని రాశి ఖన్నా చెప్పుకొచ్చింది.

## 'వాషింగ్టన్ సుందర్' తొలిసాంగ్ రిలీజ్



సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'వాషింగ్టన్ సుందర్' తొలిసాంగ్ రిలీజ్ సత్య వినుగొండ, అనుశ్రీ, శీతల్ భట్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్' యస్.యస్. మూవీ కార్పొరేషన్ బ్యానర్ పై బిపేట ప్రేమ్ కుమార్ సమర్పణలో నిర్మిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ సిద్ధపడుతున్నారు. సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి నందన్ రాజ్ బొబ్బిలి చక్కటి సంగీతాన్ని అందించారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మొదటి సాంగ్‌ని సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు సత్య వినుగొండ మాట్లాడుతూ,చిన్నప్పుడు తన సొంత ఊరును వదిలిపెట్టి పారిపోయిన కుర్రాడు మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఆ ఊరికి ఎందుకొచ్చాడు? వచ్చిన ఆ కుర్రాడు ఆ ఊరికి ఏం చేశాడు? మళ్లీ తన సొంత ఊరును వదిలి హైదరాబాద్‌కు ఎందుకు వెళ్ళిపోయాడు? అనేదే 'వాషింగ్టన్ సుందర్' సినిమా కథ. ఈ సినిమాకి ప్రధానంగా సంగీతం హై లైట్ కానుంది. నందన్ రాజ్ బొబ్బిలి చక్కని సంగీతాన్ని అందించారు. ఈ చిత్రంలో నటించిన చక్కటి నటీనటులు అందరూ తమా తమ పాత్రల్ని సమర్థవంతంగా పోషించారు. సినిమా ఆద్యంతం హాయిగా సాగుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది. ఈ 'వాషింగ్టన్ సుందర్'. పక్కాగా మాస్‌తో మేళవించిన చక్కటి ఎంటర్ టైనర్ అని చెప్పొచ్చు. నిర్మాణానంతర పనులన్నీ పూర్తి చేసుకొని అతిత్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అని తెలిపారు. ఈ సినిమాకి డీఓపీ : మధు బసిరెడ్డి, శ్రీనివాస్ విన్నకోట, ఎడిటర్ : మేనగ శ్రీను, కోరియోగ్రఫీ : గణేష్ మాస్టర్, ఫైట్స్ : నందూ, డిఐ : యమ్ బి ప్రకాష్. 5.1 కాళీఎస్.ఆర్ అశోక్, సహ నిర్మాతలు : అంజయ్య దన్నారం, జీవన్ రెడ్డి పోతులూరి, అనిల్‌కుమార్ గుజ్జరి.

## సూర్యతేజ బర్త్ డే రోజు 'మన ఊరి ప్రేమాయణం' లోగో లాంచ్

టాలీవుడ్ హీరోవిక్టరీ వెంకటేష్ వీరాభిమాని అయిన సూర్యతేజ పసుపులేటి కథానాయకుడిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి కెరటంలా దూసుకొస్తున్నారు. ఆయన హీరోగా స్వీయ నిర్మాణ దర్శకత్వంలో 'మన ఊరి ప్రేమయాణం' అనే చిత్రం తెరకెక్కుతోంది. అలమేలుమంగమ్మసమర్పణలో రూపొందుతున్న ఈచిత్రానికి సంబంధించిన టైటిల్,లోగోని హీరో సూర్యతేజ పసుపులేటి జన్మదినోత్సవం సందర్భంగా ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమం లో ప్రఖ్యాత సీనియర్ నటుడు సుమన్ లాంఛ్ చేశారు. ఈ సందర్భ ంగా జరిగిన కార్యక్రమంలో నిర్మాత కె.ఎన్ రాజు, డీఓపీ ఎడిటర్ ఉదయ్‌కుమార్ జి. ప్రముఖ నిర్మాత రామసత్యనారాయణ మూవీ టీమ్ తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సూర్యతేజ పసుపులేటి మాట్లాడుతూ, 'మన ఊరి ప్రేమయాణం' ఓ చక్కటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా రూపొందింది. అన్నివర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ప్రేక్షకులకు కనువిందు చేయను న్నాయి. నా జన్మదినోత్సవం సందర్భంగా ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత సీనియర్ నటుడు హీరో సుమన్ టైటిల్, లోగోని లాంఛ్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే నిర్మాతలుకె.ఎన్‌రాజు, రామ సత్యనారాయణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడం మరచిపోలేను. హీరోగా వస్తున్న నన్ను ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలుప ుకుంటున్నాను. ఇక సినిమా విషయానికొస్తే. ఇంటిల్లిపాదినీ ఆకట్టుకునే చిత్రమిది. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరూ తమతమ పాత్రలకు పూర్తిన్యాయం చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే అంశాలతో ఈ 'మన ఊరి ప్రేమ యాణం' తెరకెక్కింది. ఎక్కడా రాజీ పడకుండా.. ప్రేక్షకులు శబాష్ అనేలా అన్ని హంగులతో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ సినిమా చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు, నిర్మాత, దర్శకత్వం : సూర్యతేజ పసుపులేటి, నిర్మాత: కె.ఎన్ రాజు, డీఓపీ : ఎడిటర్ : ఉదయ్‌కుమార్ జి. సంగీతం : శ్రీ వెంకట్,



## బ్యాడ్‌బాయ్ టీజర్ రిలీజ్



**హీరో నాగశౌర్య** కంప్లీట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్‌బాయ్ కార్తీక్‌లో పవర్ ఫుల్ పాత్రలో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఆయన బర్త్ డే సందర్భంగా విడుదలైన అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేశారు. నూతన దర్శకుడు రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి. మేకర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ నాగ శౌర్యను రగ్గడ్, ఇంటెన్స్ స్టైలిష్ న్యూ అవతార్‌లో ప్రజెంట్ చేస్తుంది. యాక్షన్ సన్నివేశాలు, హైఆక్టేన్ మూమెంట్స్‌తో మాస్ పాత్రలో పరిచయం చేస్తోంది. ఈ టీజర్‌లో శౌర్యతో పాటు విధి, సముద్రఖని, నరేష్ వికె, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రంలో ఇంటెన్స్ డ్రామా, హ్యూమరస్ కామెడీ కలగలిసి ఉన్నాయి. నాగశౌర్య స్క్రీన్ ప్రెజెన్స్, షార్ప్ డైలాగ్ డెలివరీ, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్ అదిరి పోయింది. వెన్నెల కిషోర్ క్యారెక్టర్ మంచి హ్యూమర్ ని ప్రామిస్ చేస్తోంది. దర్శకుడు రామ్ దేసినా అద్భుతమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను అందించారు. రసూల్ ఎల్లోర్ డైనమిక్ సినిమాటోగ్రఫీ బ్రిలియంట్ గా వుంది. హారిస్ జయరాజ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ ఎమోషన్‌ని మరింత ఎలివేట్ చేసింది. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ ప్రొడక్షన్ వాల్యూస్ అద్భుతంగా వున్నాయి.

బ్యాడ్ బాయ్ కార్తీక్ త్వరలో బిగ్ స్క్రీన్స్ లోకి రానుంది. నటీనటులు: నాగశౌర్య, విధి, సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిషోర్‌తదితరులు.

## 'ట్రాన్ ఆరెస్' సరైన సమయంలో వస్తుంది

డిస్నీ రాబోయే సైఫై చిత్రం ట్రాన్: ఆరెస్ ఈ వారంలో థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. దీని ప్రధాన థీమ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కావడంతో, లీడ్ యాక్టర్ జారెడ్ లెటో ఈ చిత్రం 'సరైన సమయంలో' వస్తుందని నమ్ముతున్నారు.లండన్ ప్రీమియర్ సమయంలో జారెడ్ డిజిటల్ స్పైతో మాట్లాడుతూ, "ఒక విధంగా చూస్తే, ఎఐ ఒక పెద్ద సంభాషణగా మారిన సరైన సమయంలో వస్తుంది. మేము ఈ సినిమా పై 910 సంవత్సరాల క్రితం పని చేయడం మొదలుపెట్టాము. అప్పుడు ఎఐ గురించి ఎవరూ మాట్లాడేవారు కాదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ దాని గురించి మాట్లాడుతున్నారు. ప్రతి ఒక్కరూ దాన్ని ఉపయోగిస్తున్నారు. వారు తెలిసినా లేదా తెలియకపోయినా, అది మన జీవితాల్లో ఏదో ఒక రూపంలో భాగమైపోయింది. కాబట్టి ఈ సినిమా ఈ సమయంలో వస్తుండటం ఆసక్తికరంగా ఉందని నేను భావిస్తున్నాను" అని చెప్పారు.

జారెడ్ దాదాపు ఒక దశాబ్దం పాటు ఈ ప్రాజెక్ట్‌తో సంబంధం ఉన్నవారు. అతని కోస్టార్ జోడీ టర్నర్‌స్మిత్ ఈ చిత్రం ఎఐఎథిక్స్ అన్వేషణ ప్రొడక్షన్ సమయంలో మరింత సమయోచితంగా మారిందని పేర్కొన్నారు. జోడీ మాట్లాడుతూ, "మేము దీన్ని ఒకటిన్నర సంవత్సరాల క్రితం షూట్ చేశాము. దీన్ని ఒక విధంగా ముందుగా చూసేలా చేశారు అని వివరించారు.

"సినిమా మొదట్లో ఉన్నప్పుడు మేము ఎఐ సంభాషణలో లేము. అంటే, జారెడ్ దాదాపు ఒక దశాబ్దం పాటు ఈ బౌల్డర్‌ను కొండ మీదకు నెట్టుతున్నాడు. కానీ వారు ఈ సినిమాను ప్రస్తుతం, సంబంధితంగా ఉన్న సంభాషణలో ఉంచడంలో విజయవంతమయ్యారు. అది నిజంగా అద్భుతం అన్నారు.జోడీ మరింత చెప్పుతూ "ప్రపంచస్థితిలో ఎఐకి, మాకు ఏ జవాబులు లేవు. కానీ మేము ప్రశ్నలో జీవిస్తున్నాము. మేము ప్రజలను మాతో పాటు ఎథిక్స్ గురించి, ఎఐని మానవ కేంద్రీకృతంగా ఎలా ఉంచాలి అనే ప్రశ్నలో ఉండమని అడుగుతున్నాము." ఆమె" అది అంతా డూమ్, గ్లూమ్ కావాల్సిన అవసరం లేదు అని చెప్పారు. మానవులు ఎఐని "ప్రపంచాన్ని మంచిగా మార్చడానికి ఉపయోగించగలిగితే అన్నారు.ఈ టెక్నాలజీ ఎవాన్ పీటర్స్ నటించిన జూలియన్ డిల్లింజర్ వంటి ఎథిక్స్ లేని వ్యక్తి చేతిలో ఉంటే ఏమవుతుంది. కాబట్టి ఇది గొప్పది, సంబంధితమైనది, ప్రస్తుతమైనది, ముఖ్యమైనది.జారెడ్ లెటో, జోడీ టర్నర్‌స్మిత్, గ్రెటాలీ, ఎవాన్ పీటర్స్, హసన్ మిన్హాజ్, జెఫ్ బ్రిడ్జెస్ నటించిన ట్రాన్. ఆరెస్ 2025 అక్టోబర్ 10న ఇండియన్ థియేటర్లలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది.



## 'సీతా పయనం' నుంచి ప్రిన్స్ ధ్రువ ఫస్ట్ లుక్



మల్టీ ట్యాలెంటెడ్ అర్జున్ సర్జా దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ సీతా పయనం. శ్రీరామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్య,అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ రోజు ధ్రువ సర్జా బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఆయన ఫుల్ ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. ధ్రువ సర్జాని యాక్షన్ హల్క్ ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్ అదిరిపోయింది.ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పాటలు చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్‌రాజ్, కోవైసరళ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఓపి: జి బాలమురుగన్, ఎడిటర్ : అయూబ్ ఖాన్, డైలాగ్స్: సాయిమాధవ్ బుర్రా.తారాగణం: ఐశ్వర్యఅర్జున్, నిరంజన్, సత్యరాజ్, ప్రకాష్‌రాజ్, కోవై సరళ, అర్జున్, ధ్రువసర్జా.సాంకేతికబృందం:కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, దర్శకత్వం: అర్జున్‌సర్జా,బ్యానర్: శ్రీరామ్. ఫిల్మ్స్ : ఇంటర్నేషనల్: సంగీతం: అనుప్ రూబెన్స్‌డిఓపి: జి బాలమురుగన్‌ఎడిటర్: అయూబ్ ఖాన్ డైలాగ్స్: సాయి మాధవ్ బుర్రా సాహిత్యం: చంద్ర బోస్, కాసర్లశ్యామ్,పీఆర్వో: వంశీశేఖర్ : డిజిటల్ మార్కెటింగ్: ఫస్ట్ షో.

## 'ది ప్యారడైజ్ ' కోసం రాఘవ్ జూయాల్ రెడీ !




**ఇప్పుడు** నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది ప్యారడైజ్ ' చిత్రంలో కూడా రాఘవ్ విలన్ గా నటిస్తున్నాడు. ప్రస్తుతం ది ప్యారడైజ్ షూటింగ్ జోరుగా సాగుతోంది. తాజాగా శ్రీకాంత్ ఓదెల తో రాఘవ్ జూయాల్ స్క్రిప్ట్ రీడింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. రా సీన్స్ ను చూసి రాఘవ్ చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ఇక రాఘవ్ జూయాల్ త్వరలో ఈ సినిమా సెట్స్ లో చేరడానికి రెడీగా ఉన్నాడు.కాగా, రాఘవ్ జూయాల్, తన పాత్ర గురించి మాట్లాడుతూ.. దర్శకుడు శ్రీకాంత్ పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇక ఈ చిత్రంలో మోహన్ బాబు కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ మరియు స్పానిష్ భాషలలో ఈ సినిమా విడుదలవుతోంది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 26, 2026న థియేటర్లలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రానికి అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

# చేదోడు వాదోడుగా... !



వ్యవసాయంలో పురుషులతో సమానంగా పనిచేస్తారు మహిళలు. కానీ వారి పనికి ప్రాధాన్యం తక్కువ. కొన్నేళ్లుగా ఆ పద్ధతిని మారుస్తూ స్త్రీలూ ఈ రంగంలో తమదైన ప్రతిభను కనబరుస్తున్నారు. అలాంటి వారిలో ఒకరు రేఖా కుజూర్. మహిళల్ని ఆర్థికంగా శక్తిమంతం చేయాలనే ప్రభుత్వ ఆశయానికి ముందే... ఛత్తీస్‌గఢ్, కోర్బా జిల్లాలోని బొట్లీ గ్రామంలో ఈ పురోగతి మొదలైంది. దానికి కారణం రేఖనే.

ఈమెకు ముగ్గురు పిల్లలు. పెద్ద అమ్మాయిని రాయ్‌గఢ్‌లోని ఓ కళాశాలలో చేర్చి... అక్కడికి సమీపంలోని వనాన్‌చల్ గ్రామానికి మకాం మార్చారు. ఊరుకాని ఊరిలో కుటుంబాన్ని పోషించడానికి భర్త పడుతున్న కష్టాన్ని చూసి... తనకు చేదోడుగా ఉండాలనుకున్నాడు. అందుకు వ్యవసాయాన్ని సాధనంగా ఎంపిక చేసుకున్నారు. ఐదుఎకరాల భూమిలో సాగు మొదలు పెట్టారీమె. జీతం సరిపోక అప్పు కోసం చేయాల్సిన పరిస్థితి తెలిసిన వారు కూడా డబ్బులడుగుతాం మొహం చాటేసేవారు. ఈ అరకొర జీతాలతో ఇల్లు గడవడం కష్టమని అర్థమైంది. అందుకని పనిచేయాలనుకున్నా. అప్పుడే నాబార్డ్ తోటల పెంపకం ప్రారంభించింది. 2014లో మామిడి మొక్కల్ని నాటాను. పొదుపు గ్రూపులో రూ.లక్ష రుణం తీసుకుని అంతర పంటలుగా బత్తాయి, నిమ్మ, సీతాఫలం, జీడి మొక్కల్ని వేశాను. ఇలా ఎనిమిది నుంచి తొమ్మిది పంటలు ఏకకాలంలో పండిస్తున్న మహిళగా నాకు గుర్తింపు వచ్చింది. ఆ స్ఫూర్తితోనే సాగు తరగతులకు హాజరై... కూరగాయలు పండించడాన్నీ తెలుసుకున్నా. ఆ నైపుణ్యంతో ఆకుకూరలు, టొమాటో, అల్లం, పచ్చిమిర్చి, వంకాయ వంటి వాటిని సాగు చేయడం మొదలుపెట్టారు. నా భర్త సహాయంతో పశుపోషణ కూడా ప్రారంభించా, మేకల పెంపకంతో మొదలై... ఇప్పుడు కోళ్లు, గొర్రెలూ, బాతులూ, పందులూ వరుసగా పెంచుతున్నా. ఇంటి వెనకున్న చిన్న చెరువులో చేపల్ని కూడా పెంచుతున్నా. కొద్ది కాలంలోనే అన్నీ మంచి ఫలితాలను ఇచ్చాయి. ఇప్పుడు నా కుటుంబానికి సరిపడా ఆహారాన్ని నేనే పండించగలుగుతున్నా. మిగిలింది అమ్మి, ఆదాయం పొందుతున్నా. వీటన్నింటి కోసం రేయింబవళ్లు శ్రమించా. నా భర్త, పిల్లలు వీలున్నప్పుడు సహాయం చేసేవాళ్లు అనే రేఖకు అక్కడి ప్రభుత్వం ఉత్తమ మహిళా రైతు పురస్కారంతో సత్కరించింది. అంతేకాదు, కొత్తగా ఆర్థిక స్వావలంబన కోసం ప్రయత్నించాలనుకునే మహిళలకు ఈమె విజయాన్నే పాఠంగా చెపుతున్నారు నాబార్డ్ అధికారులు. ఆమె గ్రామంలోనే కాకుండా, చుట్టుపక్కల గ్రామాలూ, జిల్లాల మహిళలకూ వ్యవసాయంలో మెలకువలను నేర్పుతున్నారు. ◻

# ఖైదీల్లో మానసిక మార్పు కోసం !



**పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు. నేరం చేసి జైలు జీవితం గడుపుతున్న చాలామంది ఖైదీలు ఇలాంటి పశ్చాత్తాప భావనకే లోనవుతారు. తాము చేసిన తప్పును సరిదిద్దుకొని సమాజంలో తలెత్తుకొని జీవించాలనే ఇలాంటి ఖైదీలకు పునరావాసం కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తున్నారు 83 ఏళ్ల అరుణా సరీన్.** ఏళ్లకేళ్లుగా జైల్లో మగ్గుతోన్న ఖైదీల్లో సత్ప్రవర్తన నింపేందుకు గత పాతికేళ్లుగా వారికి యోగా పాఠాలు చెబుతున్నారామె. ఈ విధంగానే రోజూ ఉదయం మూడు గంటల పాటు తానూ జైల్లోనే గడుపుతున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 50 వేల మంది ఖైదీల్లో సానుకూల మార్పు తీసుకొచ్చిన ఈ యోగా టీచర్ స్ఫూర్తిదాయక ప్రయాణం మీకోసం..!

ఖైదీల పునరావాసంలో భాగంగా.. శిక్ష కాలంలో వారికి వివిధ వృత్తి నైపుణ్యాలు నేర్పించడం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, జీవనోపాధి అవకాశాలను చూపించడం.. శిక్షణ పొందుతున్నారు. ఈ కోరనే వాళ్లలో సత్ప్రవర్తనను పెంపొందిస్తూ.. సమాజంలో తలెత్తుకునేలా చేయడం దీని ముఖ్యోద్దేశం. ఇలా నాలుగ్గోడల మధ్య మగ్గుతున్న ఖైదీలకు యోగా పాఠాలు చెప్పడం కూడా ఇందులో ఓ భాగమే! గత పాతికేళ్లగా ఈ పనిలోనే నిమగ్నమయ్యారు అరుణ.



**......అలా తొలిసారి జైలుకెళ్లా!**
అయితే ఈ మధ్యలోనే తన భర్త మరణించడంతో మానసిక వేదనకు గురైన అరుణ.. ఈ ధ్యాన ప్రక్రియతోనే ఈ బాధ నుంచి బయటపడ్డానంటోంది.

యోగా, ధ్యానం.. వంటి వ్యాయామాలు మన మానసిక ఆరోగ్యాన్ని ఎలా పెంచుతాయో నా భర్త చనిపోయినప్పుడు అనుభవపూర్వకంగా తెలుసుకున్నా. ఈ బాధ నుంచి బయటపడి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌లో యోగా టీచర్‌గా పనిచేస్తున్న శాఖ.. ఈ సంస్థ ఢిల్లీకి చెందిన ఓ టీచర్ జబల్ వచ్చింది. ఈ సమయంలోనే స్థానికంగా ఉన్న జైల్లో యోగా తరగతులు నిర్వహించారు. నన్ను తనతో చేరమని ప్రోత్సహించారు. అలా జైల్లోకి అడుగుపెట్టడం, ఖైదీల్ని కలుసుకోవడం అదే తొలిసారి. ఆ వాతావరణం నన్ను భయపెట్టలేదు సరికదా.. అక్కడికెళ్లాక ఒక రకమైన ఆత్మీయ భావన నాకు కలిగింది. ఆపై యోగా తిరిగే సెషన్ పూర్తి చేసుకొనివచ్చేశాం. ఇలా ఖైదీల్లో స్ఫూర్తి నింపే ఈ ప్రయత్నం సాకెంతో నచ్చింది. ఆంటోన్న అరుణ.. ఖైదీలకు యోగా పాఠాలు చెప్పడానికి ఈ సందర్భమే ప్రేరణ అని అంటున్నారు.

**రోజూ మూడు గంటలు..** ప్రస్తుతం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నిర్వహిస్తున్న 'ప్రిజన్ ప్రోగ్రామ్'లో భాగమైన అరుణ.. ఈ నేపథ్యంలోనే మధ్యప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న జైళ్లలోని ఖైదీలకు యోగా పాఠాలు నేర్పుతున్నారు. తొలుత జబల్‌పూర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ సెంట్రల్ జైలులోని ఖైదీలకు యోగా పాఠాలు బోధించాను. ఇప్పుడు ఈ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 జైళ్లలోని ఖైదీలకు యోగాతో పునరావాసం కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సాధారణంగా ఉదయాన్నే చాలామంది గుడికి వెళ్తారు.. కానీ నేను జైలుకు వెళ్తాను. ఆదివారాలు, ప్రభుత్వ సెలవులు మినహాయిస్తే.. రోజూ దాదాపు మూడు గంటల పాటు ఖైదీలతోనే సమయం గడుపుతా. ఈ విధంగానే వాళ్లతో వివిధ రకాల యోగాసనాలు సాధన చేయిస్తా. అలాగే ధ్యానం, శ్వాస సంబంధిత వ్యాయామాలు.. వంటివీ 3 నేర్పిస్తా. అందరిలో ఒత్తిడి, యాంగ్జైటీ, ఆందోళనలను దూరం చేస్తుంది. మానసిక ఆరోగ్యాన్నీ " పెంపొందిస్తాయి. అంటున్నారు అరుణ.

**వేలాది మంది రాతలు మార్చి..!** 'ఆర్ట్ ఆఫ్ లివిఖింగ్ చేపట్టిన 'ప్రిజన్ ప్రోగ్రామ్' దేశవ్యాప్తంగానే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్న లక్షలాది మందిలో స్ఫూర్తి నింపుతోంది. వీళ్లలో సుమారు 50 వేల మందికి తన యోగా పాఠాలతో చేరువయ్యారు అరుణ. అయితే ఈ శిక్షణలో చాలామంది మంచి మార్పులు తీసుకొచ్చినట్లు అనుభవపూర్వకంగా చెబుతున్నారీ యోగా టీచర్. ◻

# ఇంటర్వ్యూలో ఇలా వద్దు..



కొంతమందికి ఇంటర్వ్యూ అంటేనే భయం, ఆందోళనలతో చెమటలు పడుతుంటాయి. మరి ఈ సమస్య నుంచి బయట పడేదెలా అంటారా.. ఈ చిట్కాలు మీ కోసమే.

✦ చాలామంది ఇంటర్వ్యూకి కొన్ని రోజుల ముందే అన్నీ చదువుకుని, ప్రాక్టీస్ అయి సిద్ధంగా ఉంటారు. తీరా భయంతో తెలిసిన ప్రశ్నలకీ సమాధానం తప్పుగా చెబుతుంటారు. తరవాత అయ్యో నాకు తెలుసు కదా అనుకుంటారు. దీనికి కారణం వారు మానసికంగా సన్నద్ధం కాలేకపోవడమే. ఇలాంటి సందర్భంలోనే మన బలహీనతలను బలంగా ఉపయోగించుకోగలగాలి. మీకు అంతగా ఇబ్బందిగా ఉంటే నేను అసౌకర్యంగా ఫీలవుతున్నాను అని వారికి చెప్పండి. వారే అర్థం చేసుకుంటారు. లేదా ఇంటర్వ్యూకి వెళ్లే ముందు ఒకసారి అద్దం ముందు సాధన చేయండి. కాస్త భయం పోతుంది.

✦ ఇంటర్వ్యూకి సమయపాలన చాలా ముఖ్యం. ఆలస్యంగా వెళితే మీకు టైమ్ మేనేజ్‌మెంట్ లేదు అనుకుంటారు. ఈ సమయపాలనను బట్టే ఈ ఉద్యోగానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో వారికి తెలుస్తుంది. అందుకే ఎప్పుడైనా ఇంటర్వ్యూకి 15 నిమిషాల ముందు చేరుకోవడం మంచిది. అంతేకాదు, కొన్ని కంపెనీలు దుస్తుల కోడ్ పెడుతుంటాయి. వాటిని తప్పకుండా అనుసరించాలి. ఎందుకంటే మన డ్రెసింగ్‌ని బట్టీ కొన్నిసార్లు ఉద్యోగానికి ఎంపిక చేసే అవకాశం ఉంటుంది.

✦ ఇంటర్వ్యూలో ప్రవర్తన కూడా చాలా ముఖ్యం. కొంతమంది కంగారులో ఫోన్ ఆన్‌లో పెట్టి ఇంటర్వ్యూ గదిలోకి వెళ్తుంటారు. అదేమో అప్పుడే మోగుతుంది. నిర్లక్ష్యంగా పరిగణిస్తారు జాగ్రత్త! ఆదేకాదు అవతలివారు మాట్లాడుతున్నప్పుడు మీరు దిక్కులు చూసినా, అతిగా నవ్వినా క్రమశిక్షణ లేదు అనుకుని రిజెక్ట్ చేస్తారు. కాబట్టి లోనికి వెళ్లేముందే అన్నీ సరిచూసుకోండి. ఇంటర్వ్యూ చేసేవాళ్లపట్ల మర్యాదగా ప్రవర్తించాలి. ◻

# నోరూరించే సొరకాయ రొట్టె

గుజరాతీల వంటకాలకు ఒక ప్రత్యేక రుచి పరిమళం ఉంటాయి. వాళ్లు ఆరోగ్య సూత్రాలు పాటించడం కొంచెం ఎక్కువే. అందుకే వీలైనప్పుడల్లా మట్టి పాత్రల్లో వండటానికి ప్రయత్నిస్తారు. అన్నిటినీ మించి కారం తక్కువగా వాడతారు. కూరలూ, చిరుతిళ్లూ.. ఏవీ స్పైసీగా ఉండకపోగా కొంచెం తియ్యగానే ఉంటాయి. గుజరాత్‌లో ఇష్టంగా తినే పదార్థాల్లో 8హాండవో' ఒకటి. ఇది సొరకాయతో చేసే రొట్టె. తమ తమ ఇష్టాన్ని బట్టి ఇతర దుంపలు, కూరగాయలు జతచేస్తారు. ఇంతకీ ఈ వంటకం ఎలా చేస్తారంటే..బియ్యం, కందిపప్పు, శనగపప్పు, మినపప్పు, పెసరపప్పులను నానబెట్టి గ్రైండ్ చేయాలి. అందులో కాస్త పెరుగు, కొన్ని నీళ్లు పోసి ఇడ్లీ పిండిలా తయారు చేయాఇ. సొరకాయ, క్యారెట్‌ల తరుగు, అల్లం, పచ్చిమిర్చి ముద్ద, పాలకూర, కొంత్తిమీర, ఉప్పు, కారం, పంచదార, బేకింగ్ సోడా, నిమ్మరసం..వీటన్నిటినీ పిండిలో కలిపి, అవెన్ బేక్ చేసి.. తాలింపు వేస్తే ఘుమఘుమలాడే 'హాండవో' తయారైపోతంఉది. వింటనే నోరూరుతోంది? అయితే మీరూ చేసి చూడండి. ◻



# కండ బలానికి..



బరువు పెరగకూడదు. కండ మాత్రం పెరగాలి అనుకుంటున్నారా? అయితే మీరు ఈ మజిల్ ఫుడ్ గురించి తెలుసుకుందాం..

**అవిసులు:** శరీరం కొవ్వుతో నిండిపోయి ఓ ఆకృతింటూ లేకుండా బరువు పెరిగే వారు తగ్గే క్రమంలో అవిసె గింజలకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులని పంచే ఒమెగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు ఉంటాయి. ఈ గింజలతో చేసే స్మూతీలు, లడ్డూలు మేలు చేస్తాయి.



**పెరుగు :** పెరుగే కదా అని తక్కువ అంచనా వేయొద్దు. జీర్ణశక్తి పెరగాలన్నా, బరువు తగ్గాలన్నా, ప్రొటీన్ అందాలన్నా పెరుగు తినడమే మేలైన మార్గం.



**బీన్స్:** శాకాహారులకు బి విటమిన్ మొదలుకుని ప్రొటీన్లు, పీచుని అందించి చక్కని కండ బలాన్ని అందించే ఆహారం బీన్స్ గింజలు.

**చికెన్ :** మసాలాలు వేసి వేపుళ్ల రూపంలో ఉన్న చికెన్‌ని కాకుండా.. మసాలా తగ్గించి సలాడ్ పద్ధతిలో తింటే మంచిది. కండబలం పెరుగుతుంది.

**గుడ్లు:** ఆరు నగ్రాముల ప్రొటీన్‌తో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచే జింక్, క్యాల్షియం, లూటిన్, జియాంతిన్ వంటివన్నీ పుష్కలంగా అందిస్తుంది గుడ్డు. ◻



# ఫోన్ ఎంతసేపు ఇచ్చారు ?



'అమ్మా బోర్ కొడుతోంది'.. ఈ మాట వినగానే చాలామంది 'కాసేపు టివి చూసుకో' అనేస్తారు. స్క్రీన్ చూపించడం ఇష్టం లేని తల్లులైతే ఆటలు ఆడుకోమనో, బొమ్మలు గీయమనో చెబుతారు. సరేనని వెళతారా..మళ్లీ కొద్ది సేపటికే 'బోర్' అంటూ విసిగిస్తారు. మనల్ని పని చేసుకోనివ్వడం లేదనో..బాగా అల్లంరి చేస్తున్నారనో చివరికి ఫోన్ టీవిలకు సరేనంటే ఇక ఆ లోకంలో పడి తిండీ నిద్రనీ మర్చిపోతారు. ఇది కాస్త ఊహ తెలిసిన వారి పరిస్థితి.

**ఇక ఏ షాపింగ్‌కో..** రెస్టరంట్‌కో వెళితే.. అకనకడా ఫోన్, ట్యాబ్ ఒళ్లో పెట్టుకుని తలని దాంట్లో దూర్చేసే చిన్నరులే ఎక్కువగా కనిపిస్తారు. ప్రశాంతంగా భోజనం చేయనిస్తారు. కాసేపు విసిగించకుండా ఉంటారని అలా వాటిని చేతిలో పెడతాం. కానీ రంగుల తెరపై ఆడిపాడేఆ బొమ్మలు పిల్లల మెదళ్లపై ఎంత దుష్ప్రభావం చూపుతాయో తెలుసా? ఒకసారి ఫోన్ తీసుకుని చూడండి. కోపంతో చిందులేస్తారు. ఏడ్చీ గోల చేసేస్తుంటారు. గోల ఆపుతారని తిరిగి ట్యాబ్ చేతిలో పెట్టగానే మ్యాజిక్ చేసినట్టుగా గోలంతా మాయం అంటే అది వారిని కంట్రోల్ చేస్తోందనేగా అర్థం?

**మనదే కాదు..** ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి మెడికల్ కమ్యూనిటీ వాళ్లు, పాలసీ మేకర్స్ కూడా దీన్నో సమస్యగా చూస్తున్నారు. స్వీడన్ ప్రభుత్వంమైతే పిల్లల స్క్రీన్ సమయం మీద నియమావళినీ రూపొందించిందట. దాని ప్రకారం రెండేళ్లలోపు వారికి ఫోన్ ఇవ్వడానికి లేదు. పెద్దపిల్లలైనా పరిమితికి మించి డిజిటల్ స్క్రీన్ చూపించడం నిషిద్ధమే! ఇవి పిల్లల ఆలోచనలను కట్టేయడమే కాదు..నిద్రకి దూరం చేస్తాయి. డిప్రెషన్‌కీ దారితీస్తాయి. అందుకే అది దూరమైతే కోపం, గోడవ చేయడం, ఏడవడం, ఎదుటివారిని కొట్టడం వగైరా! నిజానికి ఇది పిల్లల్లో ఇతరులపై దాడిచేసే గుణాన్నీ ప్రేరేపిస్తోందట. కాబట్టి బలవంతంగానైనా దూరంగా ఉంచండి అటోంది 'యేనిసెఫ్' ఏడ్చినా, బోర్ కొడుతోందన్నా వాళ్లనలా వదిలేయమంటోంది.

ఈ చర్య కోపాన్నీ చిరాకునీ భరించడం నేరునపతుందట. బోర్ కొట్టడమూ మంచిదేనట. వాళ్లలోంచి సృజనాత్మకతను బయటకు తీస్తుందట. ఇది చెప్పినంత సులువు కాదు. కానీ చేయక తప్పదు. చేస్తారా మరి? ◻

# సిందూర హనుమ



ఒకనాడు ఆంజనేయస్వామి.. ఆశీర్వాదం కోసం సీతమ్మతల్లి వద్దకు వచ్చాడు. సీతమ్మ పాదాలపై శిరస్సు ఉంచి నమస్కరించి తలపైకెత్తి చూడగా... ఎంతో ప్రకాశవంతమైన సీతమ్మ నుదిటిన కుంకుమను, పాపిడి మొదట్లో సిందూరం ఉండటాన్ని గమనించాడు. దాంతో హనుమ 'పాపిడిలో అలా సిందూరం ఎందుకు పెట్టుకున్నావు తల్లీ?' అని సీతాదేవిని అడిగాడు. అప్పుడు సీతమ్మ 'నా నాథుడు శ్రీరామచంద్రుని క్షేమం కోసం పెట్టుకున్నాను. ఇలా నుదిటిన సిందూరం ధరిస్తే నా ప్రభువుకి రక్షణ కవచంలా ఉంటుంది. ఆయనకు ఏ కష్టం రాకుండా కాపాడుతుంది' అని చెప్పింది. శ్రీరామునికి ప్రియమైన భక్తుడు హనుమ.. రాముని కోసం తన సర్వస్వం ధారపోసేవాడు. 'రామయ్య రక్ష కోసం సీతమ్మ తల్లి పాపిట సిందూరం ధరించింది, మరి నా దేహం అంతా రామమయమే కదా! నేనేమి చేయాలిఖి అనుకుని శరీరమంతా దట్టంగా సిందూరం పూసుకుని శ్రీరాముని వద్దకు వెళ్లి నమస్కరించాడు. హనుమంతుడి తీరు చూసి రామయ్య నవ్వుతూ 'ఇదంతా ఏమిటి హనుమా?' అని అడిగాడు. దానికి తానెందుకు అలా చేసిందీ వివరించాడు హనుమంతుడు. ఆ జవాబుకి ముచ్చటపడిన శ్రీరాముడు.. 'హనుమా! నా రక్షణ కోసం నువ్వు దేహమంతా సిందూరం రాసుకున్నావు కాబట్టి.. నిన్ను సిందూరంతో పూజించిన వారికి నేను రక్షగా నిలిచి ఉంటాను' అని వరమిచ్చాడు.

ఆధ్యాత్మికం

# నూనె తక్కువా.. రుచి ఎక్కువ



కూరలూ, టిఫిన్ల తయారీలో **నూనె తక్కువగా వాడాలి.** రుచి మాత్రం అదిరిపోవాలి అనుకుంటున్నారా.. అలాంటప్పుడు ఎలాంటి సంకోచం లేకుండా ఈ సీసాలను వాడుకోవచ్చు. వీటితో స్ప్రేచేస్తే నూనె బిందువులు పడీపడనట్లుగా.. అలా అలా పడతాయి. వంటకాలను నూనెలో ముంచి తీయాల్సిన అవసరమే ఉండదు. ఓ పక్క ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకుంటునే మరోపక్క ఎప్పటిలా రకరకాల రుచులనూ ఆస్వాదించొచ్చు. పైగా వీటిని వాడటం, శుభ్రం చేసుకోవడం కూడా తేలికే. చూడచక్కని ఈ సీసాలు వంటింట్లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించకుండా ఓ పక్కన ఒదిగిపోతాయి కూడా ◻

# చిన్న విషయాలూ మర్చిపోతున్నారా?



రోజూ మనం కలిసి మాట్లాడే స్నేహితురాలే అయినా ఉన్నట్టుండి ఒక్కోసారి తన పేరు వెంటనే గుర్తు రాదు. నచ్చిన సినిమాని ఎన్నో సార్లు చూస్తుంటాం. అయినా హీరోయిన్ పేరు అడిగితే టక్కుల చెప్పలేకపోతాం. కొన్ని సందర్భాల్లో అయితే ఇంటి తాళం చెవి ఎక్కడ పెట్టామో కూడా గుర్తు రాదు. చాలామందికి ఇలాంటి పరిస్థితి ఏదో ఒక సందర్భంలో ఎదురవుతుంది. ఇలా చిన్న చిన్న విషయాలను సైతం మరచిపోవడానికి వృత్తిపరమైన ఆందోళన, ఒత్తిడి వంటివి కారణమవుతాయంటున్నారు నిపుణులు. ఇలాంటి మతిమరుపును దూరం చేసుకోవాలంటే రోజుఆరీ జీవనశైలిలో కొన్ని అంశాల్ని అలవాటుగా మార్చుకోవాలంటున్నారు.

**పజిల్స్‌తో పదును..** రోజూ పత్రికలు చదవడం చాలామందికి ఉండే అలవాటు. అయితే చాల పత్రికల్లో సుడోకు, పిజిల్స్ పొడుపు కథలు, ఆజిక్‌తో ముడిపడి ఉండే ప్రశ్నలు.. వంటివి కూడా ప్రచురిస్తాం. కానీ ఇవన్నీ పిల్లల కోసమనో లేదంటే అంతగా ఆలోచించేఓపిక లేదనో వాటిని వదిలేస్తుంటారు చాలామంది. కానీ ఈ పజిల్స్ పూర్తి చేస్తున్నప్పుడు మన మెదడు చాలా చురుకుగా పనిచేస్తుంది. ఎక్కడ ఎ పదం నింపామో కూడా గుర్తుపెట్టుకుంటుంది. అందుకే రోజూ ఏదో ఒక సమయంలో వీటిని సాధన చేయడం ద్వారా మతిమరుపును దూరం చేసుకొని జ్ఞాపకశక్తిని పెంచుకో వచ్చంటున్నారు నిపుణులు.



**యోగా...** మతిమరపుకి మరో ప్రధాన కారణం తీవ్రమైన ఒత్తిడి. ఆఫీసులో పని భారం అధికంగా ఉన్నా లేదంటే ఏ పనైనా సరిగ్గా పూర్తికాకపోయినా.. ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ పనులు చేయాల్సి వచ్చినా.. మన మెదడుపై ఒత్తిడి పడుతుంది. ఈ క్రమంలో చాలా విషయాల్లో మనకు తెలియకండడానే మతిమరుపు వస్తుంటుంది. దీనికి యోగా చక్కటి పరిష్కారం అంటున్నారు. నిపుణులు. యోగా సాధన చేయడం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఫలితంగా మనలో ఒత్తిడి తగ్గిపోతుంది. దీనితో పాటు ధ్యానం కూడా ఒత్తిడిని దూరం చేసి ఏకాగ్రతను పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.

**తగినంత నిద్ర.....** నిద్ర మెదడుకు పూర్తి విశ్రాంతినిస్తుంది. అందుకే సరిపడినంత సేపు నిద్రపోకపోతే మెదడు పనితీరు తగ్గిపోతుంది. ఫలితంగా సమయానికి ఏమీ గుర్తురావు. అలాగేమెదడు కూడా ఒత్తిడికి గురవుతుంటుంది. కాబట్టి రోజూ ఏడెనిమిది గంటలు కచ్చితంగా నిద్రపోవాలి. దీనివల్ల ఉదయం లేవగానే మనసుకు ఉల్లాసంగా, శరీరానికి ఉత్సాహంగా అనిపిస్తుంది. మద్ధకం దూరమై మెదడుకూ ప్రశాంతత చేకూరుతుంది. ఇవన్నీ మతిమరుపును దూరం చేసేవే! అంతేకాదు.. ఉదయాన్నే నిద్ర లేచే వారిలోనూ మెదడు చురుగ్గా పనిచేస్తుందని పలు అధ్యయనాల్లోనూ వెల్లడైంది.

**రివర్స్ చేద్దాం...** మీరు చేతికి వాచీ ఎలా పెట్టుకుంటారు? టైం చూడటానికి వీలుగా అంటారా? అయితే ఈసారి అలా కాకుండా వాచీని తిరగేసి పెట్టుకోండి. ఎందుకంటే ఇది మన జ్ఞాపకశక్తిన్ని పెంచుతుందట. తిరగేసి వాచీ పెట్టుకున్నప్పుడు మెదట్లో సమయం తెలుసుకోవడానికి కాస్త ఇబ్బంది పడతాం.కానీ అలవాటయ్యే కొద్దీ సమయం చూడడం సులభమవుతుంది. అంటే ఏదశలో వాచీ పెట్టుకున్నా సమయాన్ని గుర్తించగలిగే సామర్థం మెదడుకు అలవడుతుంది. తద్వారా మెదడు చురుకుదనం పెరుగుతుంది. రోజూ వ్యాయామం చేయడం, కాఫీ, టీలకు దూరంగా ఉండడం, నక్రియేటివిటీని పెంచుకోవడం వంటి అలవాట్ల వల్ల కూడా మెదడు చురుకై మతిమరుపు సమస్య దూరమవుతుందంటున్నారు నిపుణులు. ◻



## డబ్ల్యూటిసి పాయింట్లలో..
# భారత్‌కు తప్పని నిరాశ
### వెస్టిండీస్‌పై గెలిచినా మెరుగుపడని ప్లేస్

**న్యూఢిల్లీ:** తొలి టెస్టులో వెస్టిండీస్ పై ఘన విజయం సాధించినా కూడా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత స్థానం మెరుగుపడలేదు. భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఆధిపత్యం చెలాయించింది. వెస్టిండీస్ మూడు రోజులు కూడా మైదానంలో ఉండకుండా చేసింది. దీంతో, శుభ్‌మాన్ గిల్ కెప్టెన్‌గా భారత్ తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసింది. అయితే, ఈ అద్భుతమైన విజయం ఉన్నప్పటికీ, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత జట్టు ఎటువంటి ఆధిక్యాన్ని పొందలేకపోయింది. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఇది టీమ్ ఇండియా ఆరవ మ్యాచ్. గతంలో, భారత జట్టు ఇంగ్లాండ్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడి, రెండింటిలో గెలిచి, అదే సంఖ్యలో ఓడిపోయింది. ఒక మ్యాచ్ డ్రా అయింది. ఇప్పుడు, వెస్టిండీస్‌ను ఓడించడం ద్వారా, టీమ్ ఇండియా 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో తన మూడవ విజయాన్ని సాధించింది. ఈ విక్టరీతో, భారత




జట్టు విజయ శాతం 46.67 నుంచి 55.56కి పెరిగింది. అయితే, పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. ఇక ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో వెస్టిండీస్ పేలవమైన ప్రదర్శన కనబరిచింది. ఇంకా ఒక్క విజయం కూడా నమోదు చేయలేదు. నాలుగు మ్యాచ్‌లు ఆడి అన్నింటిలోనూ ఓడిపోయింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. ఇంతలో, ఇంగ్లాండ్ ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో స్టాండింగ్స్ లో నాల్గవ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ కూడా రెండు మ్యాచ్‌లు ఆడి ఇంకా ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. అయినప్పటికీ ఒక డ్రా కారణంగా ఐదవ స్థానంలో ఉంది. నిజానికి, ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా, శ్రీలంక భారత జట్టు కంటే ముందున్నాయి. రెండు జట్లు భారత జట్ట కంటే మెరుగైన విజయ శాతాన్ని కలిగి ఉన్నాయి. వెస్టిండీస్‌ను ఓడించిన తర్వాతకూడా, టీమ్ ఇండియా విజయశాతంలో ఆస్ట్రేలియా, శ్రీలంకను అధిగమించ లేకపోయింది. ఆస్ట్రేలియా ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడి మూడింటినీ గెలుచుకుంది. ఫలితంగా 100 విజయ శాతం వచ్చింది. మరోవైపు, శ్రీలంక రెండు మ్యాచ్‌లలో ఒక విజయం, ఒక డ్రాతో 66.67 విజయ శాతంతో రెండవ స్థానంలో ఉంది.


## అల్ ఐన్ మాస్టర్స్: భారత్‌కే సింగిల్స్, డబుల్స్ టైటిళ్లు

**న్యూఢిల్లీ:** అల్ ఐన్ మాస్టర్స్ 2025, మహిళల సింగిల్స్ మరియు పురుషుల డబుల్స్ టైటిళ్లను భారత్ షట్లర్లు కైవసం చేసుకున్నారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అంసకరుణన్ మరియు ఎంఆర్ అర్జున్ విజయం సాధించడంతో రైజింగ్ స్టార్




శ్రీయాన్షి తొలి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అబుదాబిలో సోమవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 100 ఈవెంట్ అయిన అల్ ఐన్ మాస్టర్స్‌లో భారత షట్లర్లు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఖలీఫా బిన్ జాయెద్ స్టేడియంలో జరిగిన 49 నిమిషాల హోరాహోరీ పోరులో 18 ఏళ్ల శ్రీయాన్షి వలిశెట్టి 15-21, 22-20, 21-7 తేడాతో స్వదేశీయురాలు తస్నిమ్ మీర్‌ను ఓడించి అద్భుతమైన పునరాగమనం చేసింది. ఇది 20 ఏళ్ల మాజీ జూనియర్ ప్రపంచ నంబర్ 1 పై మూడు మ్యాచ్‌లలో శ్రీయాన్షి సాధించిన తొలి విజయంతో పాటు, తొలి బిఎఫ్‌డబ్ల్యూ సూపర్ 100 టైటిల్‌ను నమోదు చేసింది. ప్రస్తుతం ప్రపంచ 61వ ర్యాంక్‌లో ఉన్న శ్రీయాన్షి తొలి గేమ్‌లో 4-0 ఆధిక్యంతో మ్యాచ్‌ను బలంగా ప్రారంభించింది. తస్నిమ్ 21-15తో ఓపెనర్‌ను కైవసం చేసుకోవడానికి పోరాడింది. కానీ శ్రీయాన్షి రెండవ గేమ్‌ను 22-20తో తృటిలో గెలిచి పోటీని నిర్ణయాత్మక మ్యాచ్‌గా మార్చింది. చివరి గేమ్‌లో వలిశెట్టి శ్రీయాన్షి ఆధిపత్యం చెలాయించింది, 7-7తో టైను 21-7తో ఓడించింది. ఇక పురుషుల డబుల్స్‌లో, భారత జంట హరిహరన్ అంసకరుణన్-ఎంఆర్ అర్జున్ ఇండోనేషియాకు చెందిన ఐదవ సీడ్ రేమండ్ ఇంద్ర-నికోలస్ జోక్విన్‌లను 35 నిమిషాల్లో 21-17, 21-18 తేడాతో ఓడించారు. అలాగే పురుషుల సింగిల్స్‌లో, మాజీ ప్రపంచ నంబర్ 1 కిదాంబి శ్రీకాంత్ ప్రచారం సెమీఫైనల్లో ముగిసింది. మలేషియాకు చెందిన షోలే ఐడిల్ చేతిలో 4-21, 21-11, 19-21 తేడాతో ఓడిపోయాడు.

ఆట



## అనిసిమోవాకు
# చైనా ఓపెన్ కిరీటం

**న్యూఢిల్లీ:** ఫామ్‌లో ఉన్న అనిసిమోవా చైనా ఓపెన్ కిరీటాన్ని గెలుచుకుంది. బీజింగ్‌లో జరిగిన చైనా ఓపెన్ ఫైనల్లో లిండా నోస్కోవాను ఓడించి, అమండా అనిసిమోవా తన కెరీర్‌లో రెండవ డబ్ల్యూటిఎ 1000 టైటిల్‌ను సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఒడిదుడుకుల నుండి కోలుకుంటూ అనిసిమోవా 6-0, 2-6, 6-2 తేడాతో నోస్కోవాను ఓడించింది. ఫిబ్రవరిలో ఖతార్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవడంతో పాటు, ఆ తర్వాత వింబుల్డన్ మరియు యుఎస్ ఓపెన్‌లలో ఫైనల్ ఫినిషింగ్‌లతో అనిసిమోవా ఈ సీజన్‌లో కూడా తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తోంది. కాగా క్వార్టర్ ఫైనల్స్‌లో జాస్మిన్ పావోలినిని ఓడించి, సెమీ ఫైనల్లో తన స్వదేశీయురాలు కోకో గౌఫ్‌ను 6-1, 6-2 తేడాతో ఓడించి టాప్ 10 క్రీడాకారిణులపై వరుసగా విజయాలుసాధించింది. ఫైనల్స్‌లో గౌఫ్‌తో జరిగిన మ్యాచ్‌లో అనిసిమోవా ఆపిన చోటు నుంచి పుంజుకుంది, కేవలం 23 పరుగులు మాత్రమే చేసి మొదటి సెట్‌ను కైవసం చేసుకుంది. అక్కడ ఆమె కేవలం 12 పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ప్రత్యర్థి తడబడుతుండగా, ఆమె రెండవ సెట్ యొక్క 11 నిమిషాల ప్రారంభ గేమ్‌లో అనిసిమోవా బద్దలు కొట్టి రెండవ సెట్‌ను కైవసం చేసుకుంది. 20 ఏళ్ల చెక్ విజేతగా కనిపించినప్పుడు, అనిసిమోవా ఆరవ గేమ్‌లో బ్రేక్ చేసి 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆమె మరో బ్రేక్‌తో టైటిల్‌ను కైవసం చేసుకుంది, బ్యాక్‌హ్యాండ్‌తో దానిని మూసివేసింది.

## అబియా పారా బ్యాడ్మింటన్‌లో..
# ప్రమోద్‌కు ట్రిపుల్ స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** ఏస్ ఇండియన్ పారా షట్లర్ ప్రమోద్ భగత్ 1వ అబియా పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్-2025లో తన అత్యుత్తమ ఫామ్‌ను ప్రదర్శించి మూడు బంగారు పతకాలను సాధించాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 టైటిల్‌ను భగత్ గెలుచుకున్నాడు. అబియాలో సోమవారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ పోరులో మంటు కుమార్‌ను 21-7, 9-21, 21-9 తేడాతో ఓడించాడు. వ్యూహాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ భగత్ రెండవ గేమ్‌ను కోల్పోయిన తర్వాత బలంగా పుంజుకుని మూడు గేమ్‌లలో విజయం సాధించాడు. ఆ తర్వాత అతను సుకాంత్ కదమ్‌తో కలిసి పురుషుల డబుల్స్‌లో పెరూకు చెందిన గెర్సన్ జైర్ వర్గాస్ లోస్టానౌల్-డయానా రోజాస్ గోలాక్‌లను వరుస సెట్లలో 21-13, 21-17 తేడాతో ఓడించి మరో స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఇక భగత్ మూడవ స్వర్ణం మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యు5 విభాగంలో వచ్చింది. ఆరతి పాటిల్‌తో కలిసి మరో ఉత్తేజకరమైన ఫైనల్ విజయాన్ని సాధించాడు. ఇక భారత్‌కే చెందిన షట్లర్లు వివిధ విభాగాల్లో రాణించారు. పురుషుల సింగిల్స్ డబ్ల్యూహెచ్2లో నూరుల్ హుస్సేన్ ఖాన్ రజతం గెలుచుకోగా, మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో ఉమా సర్కార్ రజతం గెలుచుకుంది. మహిళల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్‌యు5లో ఆరతి పాటిల్ మరియు ఉమా సర్కార్ ద్వయం కాంస్యం సాధించింది.




## ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్..
# నేపాల్‌పై భారత్ అద్భుతమైన విజయం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ జట్టు అద్భుత ప్రదర్శనతో ప్రారంభించింది. గౌహతిలో తొలి రోజు సోమవారం జరిగిన ఉత్కంఠభరితమైన ఓపెనర్ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ నేపాల్‌పై ఆధిపత్యం చెలాయించగా, శ్రీలంక జట్టు యుఎఇపై విజయం సాధించింది. రెండవ సీడ్ అయిన భారత్ గ్రూప్ బీ ఓపెనర్‌లో 45-18, 45-17తో సులభంగా విజయం సాధించింది, అయితే శ్రీలంక జట్టు యుఎఇ చేసిన ప్రయత్నాలు




తిప్పికొట్టి 30-45, 45-34, 45-44తో గెలిచింది. 14 సార్లు ఛాంపియన్లుగా నిలిచిన చైనా, మాజీ ఛాంపియన్లు ఇండోనేషియా, దక్షిణ కొరియాలతో సహా అన్ని ఇతర అగ్ర దేశాలు తమ ప్రత్యర్థులను రెండు వరుస సెట్లలో ఓడించి తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాయి. మాజీ ప్రపంచ జూనియర్ నంబర్ 1 బాలుర డబుల్స్ జత భార్గవ్ రామ్ అరిగెల, విశ్వ తేజ్ గొబ్బూరు కబీర్ కెసి, సుప్రీమ్ పంటపై 9-3 తేడాతో విజయం సాధించి భారతదేశం తరపున బంతిని ముందుకు తీసుకెళ్లారు.

అలాగే బాలికల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, ఆసియా అండర్19 ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత తన్వి శర్మ వారి వారి సింగిల్స్ మ్యాచ్‌లలో క్లినికల్‌గా రాణించగా, సూర్యాంశ్ రావత్, రౌనక్ చౌహాన్ పెద్ద సవాళ్లను సైతం ఎదుర్కొన్నారు. ఇక చైనా 45-14, 45-10 తేడాతో ఘనాను, కొరియా 45-22, 45-29 తేడాతో హంగేరీని, చైనీస్ తైపీ బ్రెజిల్‌ను 45-24, 45-19 తేడాతో, ఇండోనేషియా 45-27, 45-40 తేడాతో ఫిలిప్పీన్స్‌ను ఓడించాయి.

## ఐపిఒ ద్వారా లలితా జ్యుయెలరీ మార్ట్ రూ.1700 కోట్లు
# సేకరణకు సెబి అనుమతి

**విశాఖపట్నం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** చెన్నైకి చెందిన లలితా జ్యువెలరీ మార్ట్, ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ) ద్వారా రూ.1700 కోట్లు సేకరించేందుకు మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) నుంచి అనుమతి పొందింది. కంపెనీ ఈ యేడాది జూన్ 6న సెబీకి తమ ఐపిఒ పత్రాలను దాఖలు చేసింది. ప్రమోటర్ కిరణ్ కుమార్ ఐపిఒ ద్వారా రూ.1200 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా జారీ, మరో రూ.500 కోట్ల విలువైన షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉండనున్నాయి. దేశంలో కొత్త దుకాణాలను ఏర్పాటు చేసేందుకు మూలధన వ్యయానికి నిధులు సమకూర్చేందుకు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం. రూ.1014.50 కోట్ల వరకు తాజా ఇష్యూ ద్వారా రానుంది. లలితా జ్యువెలరీ మార్ట్ 1985లో చెన్నైలోని టి.నగర్ ప్రాంతంలో తన మొదటి స్టోర్‌ను ప్రారంభించింది, ఇది పట్టు మరియు ఆభరణాల రిటైల్ అవుట్‌లెట్‌లకు కేంద్రంగా ఉంది. ప్రధానంగా బంగారు ఆభరణాలను విక్రయిస్తోంది. వెండి వస్తువులు, వజ్రాల ఆభరణాలుకూడా ఉన్నాయి. ఇది దక్షిణ భారత మార్కెట్‌కు సేవలు అందిస్తోంది,బిఐఎస్ హాల్‌మార్క్ చేసిన ఆభరణాలతో 56 స్టోర్‌ల ద్వారా పనిచేస్తుంది, వీటిలో 22 ఆంధ్రప్రదేశ్‌లో, 20 తమిళనాడులో, ఏడు కర్ణాటకలో, ఆరు తెలంగాణలో, ఒకటి పుదుచ్చేరిలో ఉన్నాయి, గత ఏడాది డిసెంబర్ 31నాటికి మొత్తం 6,09,408 చదరపు అడుగుల కార్యాచరణ ప్రాంతంలో విస్తరించి ఉన్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ పేర్కొంది. సిఎజిఆర్ పేర్కొన్న క్రిసిల్ నివేదిక ప్రకారం 2022 నుంచి 2024 ఆర్థిక సంవత్సరం, డిసెంబరు 31, 2024తో ముగిసిన తొమ్మిది నెలల్లో దేశంలోని కీలకమైన వ్యవస్థీకృత ఆభరణాల ఆటగాళ్లలో ఇది స్టోర్‌కు అత్యధిక నిర్వహణ ఆదాయాన్ని కలిగి ఉన్నట్టు సంస్థ పేర్కొంది.వినియోగదారులను ఆకర్షించే విధంగా పలు పథకాలను అమలుచేస్తోంది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, 420,261 మంది వినియోగదారులు నమోదు చేసుకున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ వివరించింది. ఇది తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో తిరుముడివక్కం (కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న), కాంచీపురంలోని మరైమ్మలై (దాని పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ, అసిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తోంది. రెండు తయారీ సౌకర్యాలను నిర్వహిస్తోంది. డిసెంబర్ నుంచి చెన్నైలోని తిరుముడివక్కంలో దాని తయారీ కేంద్రం కార్యకలాపాలను ప్రారంభించినట్టు వివరించింది. గత ఏడాది డిసెంబర్ 31 నాటికి, ఇది 563 చేతివృత్తిదారులను నియమించుకుంది.(కంపెనీ ద్వారా 474 చేతివృత్తిదారులు, అసిత జ్యువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 89 చేతివృత్తిదారులను నియమించింది). కంపెనీ దేశంలోని అతిపెద్ద ఆభరణాల దుకాణాల్లో ఒకటి విజయవాడలో నిర్వహిస్తున్నట్టు లలితా జ్యువెలరీ మార్ట్ యాజ మాన్యం పేర్కొంది. ఇది మొత్తం 1,00,000 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణంలో విస్తరించి ఉంది.


## అదానిగ్రూప్ ఎసిసి కంపెనీకి
# ఐటిశాఖ భారీ జరిమానా



**ముంబయి, అక్టోబరు 6:** భారత్ కార్పొరేట్‌రంగంలో అగ్రామి బిలియనీర్ అయిన గౌతమ్ ఆదాని కంపెనీలు ఆదానిగ్రూప్ సిమెంట్ కంపెనీ ఎసిసికి ఆదాయపు పన్ను ఝలక్ ఇచ్చింది. రెండు వేరువేరు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.23.07 కోట్ల జరిమానా వేసింది. ఈ ఉత్తర్వుల కాపీలు కంపెనీకి ఈనెల 1వ తేదీనే అందాయి. అయితే వీటి ప్రభావం కంపెనీ కార్యకలాపాలపై ఉండబోదని, ఈ ఉత్తర్వులను సవాల్‌చేస్తున్నట్లు ఎసిసి వెల్లడించింది. ఆదానిగ్రూప్‌లో విలీనం కంటే ముందుకాలానికి సంబంధించినవని చెప్పింది. 2015-16, 2018-19 సంవత్సరాలకు సంబంధించి ఈ జరిమానాలు ఆదాయపు పన్నుశాఖ విధించింది. 2014-15లో కంపెనీ చేసిన 49.25 కోట్ల ఖర్చు క్లెయిమ్‌ను ఐటిశాఖ ఆమోదించలేదు. ఫలితంగా పన్ను 14.22 కోట్లు జరిమానాగా విధించింది. తప్పుడు ఆదాయ వివరాలు అందించిందని వర్గీకరించింది. రెండోజరిమానా పరంగా 2018-19 అసెస్‌మెంట్ సంవత్సరంలో ఆదాయపు పన్ను 12.79 కోట్ల ఖర్చు క్లెయిమ్‌చేసినా తిరస్కరించింది. ఆదాయం తక్కువ చూపించిందని రూ.8.85 కోట్లు జరిమానా వేసింది. ఈజరిమానా సంబంధిత చెల్లింపుపన్నులో 200శాతం రేటుతో విధించింది. ఈ రెండు ఉత్తర్వులను మేం అప్పీలుచేస్తామని వెల్లడించింది. నిర్ణీత గడువులోపు పన్నుకమిషనర్‌వద్ద అప్పీలు దాఖలుచేస్తామని, జరిమానా డిమాండ్లపై స్టే కోరతామని వెల్లడించింది. ఎసిసి సిమెంట్స్ ఆదాని గ్రూప్‌లో ఒకటిగా ఉంది. అంబూజా సిమెంట్స్ ఎసిసిలో 50శాతం కంటే ఎక్కువ వాటాతో ఉంది. స్విస్‌కంపెనీ హోల్సిమ్‌నుంచి అంబూజా సిమెంట్స్‌ను 6.4 బిలియన్ డాలర్లకు కొనుగోలుచేసింది. ఎసిసి ఆదానిగ్రూప్‌లో విలీనానికి ముందే ఈ జరిమానాలు విధించిన అసెస్‌మెంట్‌సంవత్సరాలనం కంపెనీ స్పష్టంచేస్తున్నా ఆదానికి మాత్రం మళ్లీ అప్పీలుకు వెళ్లక తప్పని పరిస్థితి ఎదురయింది.

# చుక్కల్లోకి చేరిన పసిడి

### 10గ్రాములు ధర సగటున రూ.1.23 లక్షలు పైనే
### ఒక్కరోజులోనే రూ.1370 పెరుగుదల
### అదే బాటలో వెండికూడా...



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** అమెరికా షట్‌డౌన్, ప్రపంచ ఆర్థికమార్కెట్లలో అనిశ్చితులు, ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల కుదింపు వంటి అంశాలతో ఇన్వెస్టర్లు మొత్తం బంగారం మార్కెట్ వైపు దృష్టిమరల్చారు. దీనికితోడు ఈక్విటీ మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్లు కూడా అనిశ్చితి నేపథ్యంలో ఇప్పటివరకూ 1.20 లక్షల కోట్లు విత్‌డ్రాచేసారని వినికిడి. ఒక్క నెలలోనే 60వేలకోట్లకుపైగా విత్‌డ్రాచేసారంటే గోల్డ్‌మార్కెట్ వైపు ఇన్వెస్టర్లు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కరెన్సీ మార్కెట్‌లో కూడా భారత్ రూపాయి భారీగా క్షీణతను ఎదుర్కొంటున్నది. దీనితో గత చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు పెరిగాయి. దేశంలో సగటున పదిగ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరలు 1.23 లక్షలరూపాయలుగా పలుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లలోకూడా బులియన్‌ధరలు ఔన్స్ ఒక్కింటికి 3949.58 డాలర్లుకుపైబడింది. హైదరాబాద్‌లో పదిగ్రాముల 24 క్యారెట్లు రూ.9700 పెరిగి 1,23,420 రూపాయలుగా నడిచింది. 22 క్యారట్ల ధరలు కూడా రూ.1250 పెరిగి రూ.1,10,700గా ఉంటే 18 క్యారెట్ల బంగారంధర కూడా రూ.1030 పెరిగి రూ.90,850గా నడిచింది. చెన్నైలో బంగారం ధరలు చూసినట్లయితే 10 గ్రాముల 24 క్యారెట్లు రూ.1,20,660గా ఉంటే 22 క్యారెట్లుధరలు రూ.1,10,600గాఉంది. ఇక18క్యారెట్లు రూ.91,600గా నమోదయింది. అలాగే ముంబయిలో 10 గ్రాముల 24 క్యారెట్లగోల్డ్ ధరలు రూ.1,20,770గా ఉంది. 22 క్యారెట్లుధరలు 1,10,700గాను, 18 క్యారెట్ల పదిగ్రాముల ధరలు రూ.1030పెరిగి రూ.90,580గా నడిచింది. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంధరలు రూ.1,30,300గా నడిస్తే 22 క్యారెట్లు ధరలు రూ.1,10,700 గా నడిచింది. 18 క్యారెట్లధరలు రూ.90,580గా నమోదయింది. బెంగళూరు మార్కెట్లు పదిగ్రాములు 1,20,820గాను, 22 క్యారెట్లు 1,10,750గాను, 18 క్యారెట్లు 90,630గాను కొనసాగింది. ఆభరణాల వ్యాపారిని ముంబయి తర్వాత అత్యంత బిజీ మార్కెట్ అయిన అహ్మదాబాద్‌లో 24 క్యారెట్లు రూ.1,20,820గాను, 22 క్యారెట్లు రూ.1,10,750గాను, 18 క్యారెట్లు ధరలు రూ.90,630గాను నమోదయింది. వెండిధరలు కూడా కిలో ఒక్కింటికి 1.54 లక్షలుగా కొనసాగింది.

దేశరాజధానిలో అయితే 1.57,400గా నడిచింది. వెండి ఒక్కరోజులోనే 7400 పెరిగి పీక్‌స్థాయికి చేరింది. గత వారాంతంలో1.50 లక్షలున్న వెండి సోమవారానికి అకస్మాత్తుగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోకూడా ఔన్స్ ఒక్కింటికి వెండి 48.75 డాలర్లు పెరిగింది.



## టిమ్‌కుక్ తదుపరి యాపిల్ సిఇఒ ఎవరు?

**సియాటెల్, అక్టోబరు 6:** యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ వారసుడిపై టెక్కీ సర్కిళ్లలోజోరుగాచర్చలు సాగుతున్నాయి. వచ్చేనెలలో 65 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న టిమ్‌కుక్ వారసుడిగా ప్రస్తుతం యాపిల్ హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ బాధ్యతలు చూస్తున్న ఉపాధ్యక్షుడు జాన్‌టర్నస్ పేరు వినిపిస్తోంది. యాపిల్‌తో టర్నస్‌కు 24ఏళ్లు అనుబంధం ఉంది. ఆయన వయసు ప్రస్తుతం 50 ఏళ్లు. సిఇఒగా 2011లో టిమ్‌కుక్ ఛార్జితీసుకున్నపుడు కూడా ఆయనకు 50 యేళ్లే. యాపిల్ సంస్థలో కీలకనిర్ణయాలు తీసుకునే అతికొద్దిమంది వ్యక్తుల్లో టర్నస్ ఒకరు. లండన్‌లో ఐఫోన్ 17 ఈవెంట్‌లో ఐఫోన్ ఎయిర్‌ను ఆయనే మార్కెట్‌కు వదిలారు. యాపిల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లందరినీ చూస్తే ఆయనే పిన్నవయస్కుడు.మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌యాపిల్ సిఓఓ సబిహ్‌ఖాన్‌పేరుతో పాటు రిటైల్‌హెడ్ డీర్డ్రేఒబ్రెయిన్‌లపేర్లుకూడా ఉన్నాయి. కొంతకాలం అడ్‌హాక్ సిఇఒగా నియమించి ఆతర్వాతనే శాశ్వత ప్రతిపాదికన సిఇఒ నియామకంవైపుకూడా చూస్తున్నట్లు తెలుస్తోంది.

# మార్కెట్లకు కార్పొరేట్ ఫలితాల దన్ను!
### సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలజోరు..

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. కార్పొరేట్‌త్రైమాసిక పలితాలపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ పెట్టారు. నిఫ్టీ 25,070కిపైబడి ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటి, హెల్త్‌కేర్, ప్రైవేటు బ్యాంకు స్టాక్స్ భారీగాపెరిగాయి. ఆర్బీఐ గత వారం తన పాలసీ విధానాలను ప్రకటిస్తూ జిడిపి అంచనాలను 6.8శాతంగా ప్రకటించింది. అలాగే ద్రవ్యోల్బణం అంచనాను కూడా 3.1 నుంచి 2.6శాతంగా ఉంటుందని ప్రకటించడంతో సూచీల్లో జోరుపెరిగింది. బిఎస్ఇ సెన్సెక్స్ 582.95 పాయింట్లు పెరిగి 81,790.12 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 183.40 పాయింట్లుపెరిగి 25,077.65 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు 1.9శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ 1.98, బజాజ్ ఫైనాన్స్ 1.95, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం చొప్పున సూచీల్లో పెరిగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.68శాతం లాభపడితే స్మాల్‌క్యాప్‌సూచీ 0.20శాతం వెనుకబడింది. మార్కెట్లలో బిఎస్ఇ పరంగా 1827 కంపెనీలు లాభపడితే 2453 కంపెనీలు క్షీణించాయి. మొత్తం 173 కంపెనీలు స్థిరంగా కొనసాగినట్లు తేలింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 88.82వద్ద ముగిసింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ పరంగా 1.57శాతం లాభపడింది. పదిగ్రాములు 1,19,957గా నడిచింది. యుఎస్ పదేళ్ల బాండ్ల రాబడులు 1.04శాతంపెరిగి 4.163 శాతంగా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 1.11 డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 65.64 డాలర్లుగాకొనసాగింది. యూరోపియన్ మార్కెట్లలో సూచీలు కొంతమేర లాభాల్లోనే కొనసాగాయి. ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ ఆకస్మిక రాజీనామాపైనా దృష్టిపెట్టాయి.ఆసియా మార్కెట్లు సైతం భారీగాపెరిగాయి జపాన్ కొత్తప్రధానిగా సానై తకైయిచి ఎన్నికవడాన్ని మార్కెట్లు స్వాగతించాయి. ఇక చైనా, దక్షిణకొరియాలు మాత్రం సెలవుల కారణంగామూతపడ్డాయి. ఇక



నాస్‌డాక్ కాంపోజిట్ 0.28 శాతం క్షీణించి 22,780.51వద్ద నిలిచింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 238.56 పాయింట్లవద్ద క్షీణించి 46,758.28 వద్ద నిలిచింది. రస్సెల్ 2000 సూచీ కూడా 0.72శాతం పెరిగి 2476.18 వద్ద ముగిసింది. ఇక మార్కెట్లకు పేస్ డిజిటెక్ 217.50వద్దట్రేడ్ అయింది. ఇష్యూధర 2019 కాగా 0.68శాతం క్షీణించింది. సిజిహెచ్ఎస్‌రేట్లను కేంద్రం సవరించడంతో ఆసుపత్రి కంపెనీల షేర్లు భారీగాపెరిగాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.93శాతం, ఉజ్జీవన్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 1.20శాతం, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 1.20శాతం పెరిగితే బంధన్‌బ్యాంకు షేర్లు 0.42శాతం క్షీణించాయి. జుబిలియంట్ ఫుడ్‌వర్క్స్ 0.62శాతం క్షీణించింది. క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ 2.50శాతం ర్యాలీతీసింది. అలాగే పూనావాల్లా ఫిన్‌కార్ప్ కూడా 1.47శాతంపెరిగితే జెటిఎల్ ఇండస్ట్రీస్ 1.90శాతం దిగజారింది. ఫోర్స్ మోటార్స్ 2.75శాతం క్షీణించింది. ఇక ఐపిఒలపరంగా మొదటిరోజు వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ తొలిరోజు 34,08,876 షేర్లకు బిడ్లు స్వీకరించింది. టాటాక్యాపిటల్‌కూడా 12,79,92,332 షేర్లకు బిడ్లు స్వీకరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.